ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kurnool, Kadapa, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
23-7-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 173 పేజీలు: 8+4 వెల: 6.50

దేశంలో ముగిసిన ప్రజాస్వామ్యం: ప్రియాంక గాంధీ 5లో

ప్రధాని మోడీతో పవార్, సుప్రియ భేటీ

# దద్దరిల్లిన పార్లమెంటు


బుధవారం పార్లమెంటులో మాట్లాడుతున్న మంత్రి రిజిజు


మాట్లాడుతున్న ప్రతిపక్షనేత ఖర్గే

## 'నీట్'పై చర్చకు ఒప్పుకొన్న కేంద్రం

### మంత్రి ధర్మేంద్ర రాజీనామా చేస్తేనే చర్చలన్న ఖర్గే

### విపక్ష సభ్యుల ఆందోళనలతో ఉభయ సభల్లో రభస.. నేటికి వాయిదా

**న్యూఢిల్లీ,జులై 22:** నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, అలాగే సోమవారం నిర్వహించిన బసంసద్ చలో నిరసన సందర్భంగా విద్యార్థులపై పోలీసులు వ్యవహరించిన తీరుపై ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలతో బుధవారం కూడా పార్లమెంట్ ఉభయ సభలు తీవ్ర తీవ్రస్థాయి నిరసనల హోరులో కొనసాగాయి. కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై సుదీర్ఘ చర్చకు సిద్ధంగా ఉన్నట్లు మరోసారి స్పష్టం చేసినప్పటికీ, నిరసనలు కొనసాగడంతో లోక్‌సభ, రాజ్యసభ రోజంతా వాయిదా పడ్డాయి. లోక్‌సభలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు మాట్లాడుతూ, నీట్ పేపర్ లీక్ అంశంపై >>2



# ఇదేం పాలన!

- గత పదేళ్లలో 152 పేపర్లు లీక్
- ఒక్కరినైనా శిక్షించలేక పోయారు..
- విద్యార్థులు న్యాయంగా పోరాడుతుంటే అణిచేస్తారా?
- ధర్మేంద్రను తొలగించండి
- మీడియాతో రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ, జులై 22:** గత పదేళ్లలో 152 పేపర్లు లీక్ అయ్యాయని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. అయితే ఒక్కరికికూడా శిక్ష పడలేదని ఆయన విమర్శించారు. దేశంలోని విద్యా వ్యవస్థను లోపభూయిష్టంగా తీర్చిదిద్దారంటూ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. నీట్ లీక్‌పై సిజెపి ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్రమవుతున్న తరుణంలో బుధవారం ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రెస్‌మీట్‌లో రాహుల్ గాంధీ మాట్లాడారు. విద్యార్థులు న్యాయమైన కారణంతోనే నిరసన తెలుపుతున్నారని అన్నారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అవినీతిపరుడు, >>2

## చర్చలకు కేంద్ర మంత్రులే రావాలి

### 'కాక్రోచ్' నేతల డిమాండ్

**న్యూఢిల్లీ,జులై 22:** కేంద్రంతో చర్చలకు మేము సిద్ధమేనని సిజెపి మరోసారి స్పష్టం చేసింది. అయితే చర్చల కోసం తాము ఎవరి ఇంటికి వెళ్లబోమని తెలిపింది. ఈ మేరకు ఇవాళ కాక్రోచ్ జనతా పార్టీ ప్రధాన అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ మీడియాతో మాట్లాడుతూ రెండో విడత చర్చల కోసం బుధవారం ఉదయం పోలీసులు మళ్లీ మమ్మల్ని సంప్రదించారని >>2


బుధవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన సిఎం చంద్రబాబు, కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాసవర్మ, ఎంపీలు శ్రీకృష్ణదేవరాయలు, అప్పలనాయుడు

# భోగాపురానికి రండి

## ఆగస్టు 1న ఎయిర్‌పోర్టును ప్రారంభించడానికి ప్రధాని మోడీని ఆహ్వానించిన సిఎం చంద్రబాబు

### తాజా రాజకీయ పరిస్థితిపై ఉభయుల మధ్య సుదీర్ఘ చర్చ

### జాతీయ మత్స్యబోర్డు కార్యాలయం అమరావతిలో ఏర్పాటు చేయాలని వినతి

**విజయవాడ, జులై 22, ప్రభాతవార్తప్రతినిధి:** ఢిల్లీలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని మోడీతో సుమారు అరగంటకు పైగా సమావేశమయ్యారు. విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మితమైన అల్లూరి సీతారామరాజుఅంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ప్రధానిని సిఎం ఆహ్వానించారు. ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు ఆగస్టు 1న భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను ప్రధాని మోడీ ప్రారంభించనున్నారు. ఈ సమావేశంలో తాజా రాజకీయ పరిస్థితులపై ఇరువురి మధ్య సుదీర్ఘ చర్చ జరిగినట్లు సమాచారం. రాష్ట్రానికి చెందిన పలు అంశాలను, సమస్యలను సిఎం చంద్రబాబు ప్రధాని మోడీ దృష్టికి తీసుకుని వెళ్లారు. భోగాపురం ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్ర దశదిశను మారుస్తుందని సిఎం చంద్రబాబు ప్రధాని మోడీకి వివ >>2

కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి భేటీ 2లో



## నీతి ఆయోగ్ కొత్త సిఇఒ అనురాగ్ జైన్

**న్యూఢిల్లీ,జులై 22:** కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ కొత్త సిఇఒగా మధ్యప్రదేశ్ కేడర్‌కు చెందిన 1989బ్యాచ్ ఐఎఎస్ అధికారి అనురాగ్ జైన్‌ను నియమించింది. ఈ మేరకు కేంద్ర మంత్రివర్గ నియామకాలకమిటీ ఆమోదం తెలిపినట్లు సిబ్బంది, శిక్షణ శాఖ బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. డిఒపిటి విడుదల చేసిన ఉత్తర్వులప్రకారం.. అనురాగ్ జైన్ బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచే ఆయన నియామకం అమల్లోకి వస్తుంది. ప్రస్తుతం ఆయనకు మంజూరైన సేవా పొడిగింపు పూర్తయ్యే వరకు, అనంతరం మొత్తం రెండేళ్ల పాటు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఏది ముందుగా వస్తే అంత వరకు ఆయన నీతి ఆయోగ్ సిఇఒగా కొనసాగనున్నారు. అలాగే ఆయన నియామకం తనకు ముందు ఈ పదవిలో ఉన్న సిఇఒకు వర్తించిన అదే నిబంధనలు, షరతుల ప్రకారమే >>2

# ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

వేతన సవరణ కమిషన్, ఐఆర్, పెండింగ్ డిఎలు తదితర డిమాండ్లపై సుదీర్ఘ చర్చలు

21 ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ఐదుగంటలు పైగా చర్చించిన మంత్రుల బృందం


బుధవారం సచివాలయంలో ఉద్యోగ సంఘాల భేటీలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్,మంత్రులు అనగాని, సత్యకుమార్

**అమరావతి, జులై 22, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన వివిధ అంశాలను సాధ్యమైనంత వరకూ పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నం చేస్తుందుని రాష్ట్ర ఆర్థిక, వాణిజ్య, శాసన సభ వ్యవహారాలశాఖామంత్రి పయ్యావుల కేశవ్ ఉద్యోగ సంఘాలకు స్పష్టం చేశారు. బుధవారం ఎపి సచివాలయంలో 21 ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ఆయన నేతృత్వంలోని మంత్రుల బృందం సమావేశమై సుమారు 5గం.ల పాటు ఉద్యోగుల సమస్యలను తెలుసుకుంది. సమావేశ అనంతరం ఆర్థిక మంత్రి మాట్లాడుతూ 21 ఉద్యోగ సంఘాల నుండి అన్ని సమస్యలను తెలుసుకున్నామని వాటన్నిటినీ క్రోడీకరించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సాధ్యమైనంత వరకూ ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రధానంగా వేతన సవరణ కమీషన్‌ను ఏర్పాటు, ఐఆర్ ప్రకటన, పెండింగ్ డిఎలు, ఇతర పెండింగ్ బిల్లులు సకాలంలో చెల్లించాలనే డిమాండ్లు అన్ని ఉద్యోగ సంఘాల నుండి వచ్చాయని వాటన్నిటినీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సానుకూలంగా పరిష్కారం అయ్యేలా ప్రయత్నం చేస్తామని తెలిపారు.

ఉద్యోగులు వేరు ప్రజా ప్రతినిధులు వేరు కాదని ఇరువురు కలిసి పని చేస్తేనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధిపథంలో ముందుకువెళుతుందని అన్నారు. ఉద్యోగులపై చేసే ఖర్చును ప్రభుత్వం భారంగా పరిగణించడం లేదని పెట్టుబడిగానే భావించడం జరుగుతోందని మంత్రి పయ్యావుల పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఉద్యోగుల పట్ల సానుకూల ధృక్పదంతోనే కంట్రిబ్యూటరీ ఫెన్సన్ స్కీమ్ నుండి ఓల్డ్ ఫెన్సన్ స్కీమ్‌కు మార్చిందని అన్నారు. అదే విధంగా వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు కూడా 60 నుండి 62 సంవత్సరాలకు పదవీ విరమణ వయస్సును పెంచిందని చెప్పారు. గత ప్రభుత్వంనుండి వారసత్వంగా పెద్ద ఎత్తునవచ్చిన అప్పులభారంనుండి రాష్ట్రాన్ని ఏవిధంగా బయటకు తేవాలనే దానిపై ముఖ్యమంత్రి నిరంతరం శ్రమిస్తున్నారని ఇందుకు కేంద్ర ప్రభుత్వంకూడా తగిన సహాయం అంది స్తోందని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. దేశంలోకి వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం రాష్ట్రానికి వచ్చాయంటేనే ఈప్రభుత్వ వచ్చాక రాష్ట్రం ఆర్థికంగా ఏవిధంగా ముందుకు వెళుతుందో అర్థం అవుతోందని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఈసమావేశంలో ప్రభుత్వ >>2



## మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అరెస్టు

### కుమారుడు ఆరవ్‌వర్మ కేసు

**శ్రీకాకుళం, జులై 22 ప్రభాతవార్త :** మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును కాశీబుగ్గ జిఎంఇ కాలనీలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అప్పలరాజు కుమారుడు సీదిరి ఆరవ్ వర్మ ఇటీవల కాశీబుగ్గలో టూవీలర్‌తో గొర్రెల కాపరిని ఢీకొట్టి ఆయన మృతికి కారణమైన కేసులో రిమాండ్‌లో ఉన్నారు. తన కుమారుడిని కేసు నుంచి తప్పించేందుకు ప్రయత్నించిన అభియోగాలపై అప్పలరాజుపై కేసు నమోదుచేశారు. మాజీ మంత్రి సీదిరి కుమారుడు హిట్ అండ్ రన్ కేసులో అప్పలరాజు ఎ3గా ఉన్నారు. సీదిరి ఆరవ్ వర్మ బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించిన సోంపేట కోర్టు తిరస్కరించింది. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఇంటిని పోలీసులు చుట్టుముట్టి అరెస్ట్ చేశారు.

## తూ.గోలో 4కు చేరిన కొవిడ్ కేసులు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జులై 22,ప్రభాతవార్త:** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కోవిడ్ కేసుల సంఖ్య నాలుగుకి చేరింది. తాజాగా కొవిడ్ సోకిన ఇరువురు మహిళలకి రాజమహేంద్రవరం జిజిహెచ్‌లో వైద్యులు చికిత్స చేస్తున్నారు. ఇందులో ఒకరు అప్పుడే డెలివరీ పోసుకున్న పసిబాలింత. అయితే తల్లికి పాజిటివ్ అయినా పసికందుకి మాత్రం నెగిటివ్. వారం కిందట జిజిహెచ్‌లోని మాతాశిశు విభాగంలో ఆమె పురుడు పోసుకున్నారు. ఆమెకు జ్వరం జలుబు తగ్గకపోవడంతో కొవిడ్ పరీక్ష చేయగా పాజిటివ్ వచ్చినట్లు వైద్యాధికారులు తెలిపారు. దీంతో ఆమెను ప్రత్యేక వార్డులోఉంచి చికిత్స అందిస్తున్నారు. కాగా మరొకరు 54 యేళ్ల మహిళ. నాలుగు రోజుల నుంచి దగ్గు తగ్గిపోవడంతో జిజిహెచ్ ఓపికి వచ్చారు. వైద్యులు ఆర్టిపిసిఆర్ చేయగా పాజిటివ్ అని తెలిసింది. 8 మందికి ఆర్టీపిసిఆర్ పరీక్ష చేయగా ఇద్దరు వ్యక్తులకు పాజిటివ్‌గా తేలినట్లు నిర్ధారణ అయింది.

కొవిడ్ కేసులు పెరుగుతుండడంతో జిజిహెచ్‌లో ప్రత్యేక వార్డులను కేటాయించారు. మాస్కులు ధరించాలని జన సమూహాల్లోకి వెళ్లవద్దని నిత్యం చేతులు శుభ్రం చేసుకోవడంతో పాటు శానిటైజర్ వాడాలని భౌతిక దూరం పాటించాలని వైద్యులు సూచించారు. కాగా రాజమండ్రిలో మొదటి కరోనా 21 ఏళ్ల యువకుడిక పాజిటివ్. రాజమండ్రి జిల్లా ఆస్పత్రిలో చికిత్స అందించారు. చికిత్స అనంతరం ఆరోగ్యం కుదుటపడంతో ఆ యువకుడు డిస్ చార్చి అయ్యారు.

# నీటి ఎద్దడి రానివ్వొద్దు

## అమరజీవి జలధార మెగా మంచినీటి పథకాల అమలు

### వేగంపుంజుకొన్న పల్నాడు-ప్రకాశం జల్‌జీవన్ మిషన్: డి.సిఎం పవన్



**విజయవాడ,జులై 22,ప్రభాతవార్తప్రతినిధి:** ఎల్ నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో ఈసారి రాష్ట్రవ్యాప్తంగా అధిక ప్రాంతాలు మంచినీటి ఎద్దడి సమస్యను ఎదుర్కొనే అవకాశం ఉందని, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖలను నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర నీటిఎద్దడి తీవ్రంగాఉండే పల్నాడు-ప్రకాశం లాంటి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని దిశా నిర్దేశం చేశారు. జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధార పథకంలో భాగంగా పల్నాడు-ప్రకాశం ప్రాంతాల్లో చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకాల పనులు నిర్ణీత గడువులోపు పూర్తి కావాలని ఆదేశించారు.

బుధవారం పల్నాడు-ప్రకాశం మెగా వాటర్ గ్రిడ్ పథకాల పనుల పురోగతిపై గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పురోగతిని ఆర్.డబ్ల్యూ.ఎస్. >>2


బుధవారం మంగళగిరిలో లబ్దిదారులకు పట్టాలు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి నారా లోకేష్

# 3 వేల మందికి శాశ్వత ఇళ్ల పట్టాలు

## మంగళగిరి, తాడేపల్లి మండలాల లబ్ధిదారులకు పంపిణీ చేసిన మంత్రి లోకేష్

### నియోజకవర్గంలో మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు

**విజయవాడ. జులై22, ప్రభాతవార్తప్రతినిధి:** మంగళగిరి నియోజకవర్గ ప్రజల దశాబ్దాల కలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని, రాష్ట్రమంతా ఈ నియోజకవర్గం వైపు చూసేలా అభివృద్ధి చేసి చూపిస్తానని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ భరోసా ఇచ్చారు. 'మన ఇల్లుమన లోకేష్' కార్యక్రమంలో భాగంగా రెండోరోజైన బుధవారం మంగళగిరి, తాడేపల్లి మండలాలకు చెందిన సుమారు 3 వేల మంది లబ్ధిదారులకు >>2


బుధవారం విజయవాడలో పరస్పరం దాడులు చేసుకుంటున్న బిజెపి, కాంగ్రెస్ శ్రేణులు

# కాంగ్రెస్, బిజెపి బాహాబాహీ

## ఢిల్లీ ఘటనలకు ప్రతిస్పందనగా విజయవాడలో ఆందోళనలు జరిపిన రెండు పార్టీల నేతలు

### కర్రలతో కొట్టుకొన్న రెండు వర్గాలు

### ఆంధ్రరత్న భవన్ ముట్టడికి యత్నం

**విజయవాడ, జులై 22,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధికారిక నివాసం లోక్ కల్యాణ్ మార్గ్ సమీపంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఆందోళనల ప్రభావం ఎపిలోనూ ప్రతిధ్వనించింది. దీనికి నిరసనగా విజయవాడలో బిజెపి నాయకులు భారీఎత్తున రోడ్లపైకివచ్చి ధర్నా నిర్వహించారు. వారిని కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకోవడంతో తీవ్రస్థాయిలో ఘర్షణ చెలరేగింది. నడిరోడ్డు మీద బాహాబాహికి దిగారు. కర్రలతో కొట్టుకునేంత వరకూ వెళ్లింది. కాంగ్రెస్ పార్టీ తీరును నిరసిస్తూ విజయవాడలో బిజెపి నాయకులు, కార్యకర్తలు ర్యాలీ తీశారు. ప్రధానమంత్రి నివాసం వద్ద కాంగ్రెస్ పార్టీ హింసాత్మక వాతావరణానికి కారణమైందంటూ ఆరోపించారు. >>2




బుధవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీకి వెంకటేశ్వరస్వామి జ్ఞాపికను బహూకరిస్తున్న సిఎం చంద్రబాబు

# దద్దరిల్లిన పార్లమెంటు

>> ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉందని తెలిపారు. అయితే చర్చ ఏ నిబంధన కింద, ఎప్పుడు, ఎంతసేపు నిర్వహించాలన్నది అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లతో సంప్రదించిన అనంతరం స్పీకర్ నిర్ణయిస్తారని చెప్పారు. ఈ అంశంపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను దేశ ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని, అందుకే సమగ్ర చర్చకు సిద్ధమని రిజిజు పేర్కొన్నారు. యువతకు సంబంధించిన కీలక అంశాలను పార్లమెంట్‌లోనే చర్చించాలే తప్ప వీధుల్లో ఆందోళనలు చేయడం వల్ల ప్రయోజనం ఉండదని ఆయన ప్రతిపక్షంపై విమర్శలు గుప్పించారు. అంతకుముందు కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్రప్రధాన్ ఉదయం స్పీకర్ ఓంబిర్లాను ఆయన ఛాంబర్‌లో కలిసి చర్చలు జరిపారు. ఇక కాంగ్రెస్ నాయకుడు కెసి వేణుగోపాల్ మాట్లాడుతూ, నీట్ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ప్రతిపక్షం డిమాండ్ చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇలాంటి సమయంలో సభలోని ఇతర కార్యక్రమాలన్నింటినీ పక్కనపెట్టి ఈ అత్యవసర అంశానికే ప్రాధాన్యం ఇవ్వాలని వేణుగోపాల్ పేర్కొన్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ, ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉందని స్పష్టంగా తెలిపిందని, ప్రతిపక్షం సభా కార్యక్రమాలను అడ్డుకోవడం కంటే చర్చలో పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించాలని సూచించారు. సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ, విద్యార్థులు, యువత ప్రయోజనాలు దెబ్బతింటే ప్రతిపక్షం ప్రజల మధ్యకు వెళ్లి నిరసనలు చేపట్టడం సహజమేనన్నారు. నిరసనల్లో ఢిల్లీ పోలీసులు వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తంచేసారు. ఆడబిడ్డలు దుస్తులు చించేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తంచేసారు. ఇదేనా మనం ఆడబిడ్డలకు ఇచ్చే గౌరవం అని ప్రశ్నించారు. హౌస్‌లో బిజెపి, కాంగ్రెస్ సభ్యులు మాట్లాడుతుండగా తనను మాట్లాడనివ్వలేదని అఖిలేశ్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. యువత, విద్యార్థుల ప్రయోజనాలకు భంగం కలిగితే, ప్రతిపక్షాలు కూడా వీధుల్లోకి వచ్చి నిరసనలు చేపట్టక తప్పదని ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్లమెంట్ ప్రాంగణంలో ప్రతిపక్ష ఎంపీలు నల్ల దుస్తులు ధరించి నిరసన తెలిపారు. ఈ నిరసనలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు తమ హక్కులను అడుగుతున్నారని ప్రియాంక గాంధీ వాద్రా తెలిపారు. ఇదే సమయంలో ప్రతిపక్ష సభ్యులు నినాదాలు కొనసాగించడంతో లోక్‌సభను రోజంతా వాయిదా వేశారు. నీట్ పేపర్ లీక్ ఘటనతో పాటు జంతర్ మంతర్ తదితర ప్రాంతాల్లో నిరసనకారులపై పోలీసులు తీసుకున్న చర్యలకు నిరసనగా కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీలు నల్ల దుస్తులు ధరించి సభకు హాజరయ్యారు. రాజ్యసభలో కూడా కిరెన్ రిజిజు ప్రభుత్వం వైఖరిని పునరుద్ఘాటించారు. నీట్ పేపర్ లీక్‌తో పాటు అన్ని ముఖ్యమైన అంశాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే ఏ నిబంధన కింద చర్చ నిర్వహించాలన్నది సభాపతి నిర్ణయిస్తారని తెలిపారు. సభ ప్రారంభమైన నాటి నుంచే ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉందని చెబుతోందని, అయితే ప్రతిపక్షం వరుసగా సభను అడ్డుకోవడం వల్ల పేపర్ లీక్ తర్వాత ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రజలకు వివరించే అవకాశం లేకుండా పోతోందని రిజిజు ఆరోపించారు. సభా నాయకుడు జెపి నడ్డా కూడా ప్రతిపక్ష తీరును తీవ్రంగా విమర్శించారు. ఇండియా కూటమి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ పార్లమెంట్ గౌరవాన్ని దెబ్బతీస్తోందని అన్నారు. నీట్ పేపర్ లీక్ సహా అన్ని అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మరోసారి స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, ఈ అంశంపై రూల్ 267 కింద చర్చ జరగాలని, అంతకుముందే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తమ ఏకైక డిమాండ్ ధర్మేంద్రప్రధాన్ రాజీనామా అని చెపుతూ మంత్రి రాజీనామా తర్వాతనే చర్చకు స్పందిస్తామని స్పష్టంచేసారు. ఉప సభాపతి హరివంశ్ స్పందిస్తూ, గత నాలుగుదశాబ్దాల్లో అత్యంత అరుదైన సందర్భాల్లో మాత్రమే రూల్ 267ను ఉపయోగించారని గుర్తుచేశారు. అయినా ప్రతిపక్ష సభ్యుల నిరసనలు కొనసాగడంతో రాజ్యసభను కూడా రోజంతా వాయిదా వేశారు.

## చర్చలకు కేంద్ర మంత్రులే రావాలి

>> చెప్పారు. కేంద్ర మంత్రి జెపి నడ్డా మీతో మాట్లాడాలనుకుంటున్నారని చెప్పి ఆయన నివాసానికి రమ్మని ఆహ్వానించినట్లు తెలిపారు. కానీ ఈ ఆహ్వానాన్ని తాము స్పష్టంగా తిరస్కరించినట్లు సౌరవ్ దాస్ వెల్లడించారు. మేము ఎవరి ఇంటికి, ఆఫీస్‌కు వెళ్లేదే లేదని కేంద్ర మంత్రులు, ప్రభుత్వం మాతో చర్చలు జరపాలంటే ఇకపై జంతర్ మంతర్ వద్దకు రావాల్సిందేనని స్పష్టం చేశారు. ఇక్కడ జనతా దర్బార్ జరుగుతోందని ప్రజల ముందుకు వచ్చి చర్చలు జరపాలన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన సౌరవ్ దాస్ తాము చదువుకున్న వ్యక్తులమేనని తాము పట్టుదలకు పోయే వ్యక్తులం కాదని పేర్కొన్నారు. కేంద్ర మంత్రులు చర్చల కోసం జంతర్ మంతర్ వద్దకు వస్తే తమ భద్రతపై ఏదైనా ఆందోళన ఉంటే జంతర్ మంతర్ సమీపంలోని ఏదైనా తటస్థవేదికగా సమావేశమయ్యేందుకు మేము సిద్ధమేనన్నారు. ఈ విషయంలో కేంద్రం సమాధానం కోసం వేచి చూస్తున్నామని వెల్లడించారు. అలాగే మా డిమాండ్లను ఆమోదించే ఉద్దేశం ప్రభుత్వానికి ఉండాలని అర్థం లేని చర్చల కోసం మమ్మల్ని పిలవడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదన్నారు. మా సమయం చాలా విలువైనది. వేలాది మంది ప్రజలు ఇప్పటికీ ఈ నిరసనలో పాల్గొంటున్నారు, వారిని సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత కూడా మాపై ఉందని తెలిపారు. .ప్రభుత్వం నిజంగా మాతో చర్చలు జరిపే ఉద్దేశంతో ఉందో లేదో ముందుగా స్పష్టం చేయాలని సౌరవ్ దాస్ డిమాండ్ చేశారు.

## నీతి ఆయోగ్ కొత్త సిఇఒ అనురాగ్ జైన్

>> ఉంటుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. పరిపాలనా సేవలో విస్తృతమైన అనుభవం ఉన్న అనురాగ్ జైన్ ప్రస్తుతం మధ్యప్రదేశ్ ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్నారు. జైన్ పదవీ విరమణ ఆగస్టు 31, 2025న జరగాల్సి ఉంది. అయితే ఆయన అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వం ఆయనకు ఒక సంవత్సరం పొడిగింపును మంజూరు చేసింది. ఈ పొడిగింపుతో ఆయన పదవీకాలం ఆగస్టు 31, 2026 వరకు కొనసాగుతుంది. నీతి ఆయోగ్ సిఇఒగా ఆయన నియామకాన్ని దేశ విధాన రూపకల్పన ప్రక్రియలో ఒక ముఖ్యమైన పరిపాలనా మార్పుగా పరిగణిస్తున్నారు.

# భోగాపురానికి రండి

>> రించారు. గతంలో వెనుకబడిన ఈ ప్రాంతం అనూహ్యంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఎపిలో ఆక్వా రంగాన్ని మరింత అభివృద్ధి చేయటంతో పాటు ఎప్పటికప్పుడు సహకారం అందించేందుకు వీలుగా జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు కార్యాలయం అమరావతిలో ఏర్పాటు చేయాలని సిఎం కోరారు. అమరావతిలోని నెక్కల్లు గ్రామంలో 7.89 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎన్ఎఫ్‌డిబి ప్రాంతీయ కార్యాలయం, శిక్షణ కేంద్రం, పార్క్, ప్రజల సందర్శనార్థం అక్వేరియం ఏర్పాటు కోసం కేటాయించామన్నారు. తక్షణం ఈ భూమిని స్వాధీనం చేసుకుని నిర్మాణాలు ప్రారంభించాలని సిఎం కోరారు. 2028 నాటికల్లా ప్రాంతీయ కార్యాలయం, అక్వేరియం, శిక్షణా కేంద్రాల పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని కోరారు. ఈ ప్రాంతీయ కేంద్రం బ్లూ ఎకానమీ అభివృద్ధికి ప్రధాన కేంద్రంగా మారుతుందన్నారు. డిజిఎఫ్‌టి ద్వారా క్రమబద్ధీకరించాలని కోరారు. ఈక్వెడార్ నుంచి అమెరికా, చైనా, యూరోప్ లాంటి దేశాలకు ఎగుమతులు పెరగటంతో అంతర్జాతీయ మార్కెట్లో రొయ్యల ధరలు గణనీయంగా పడిపోయాయని తెలిపారు. దేశంలో ఫిష్ మీల్ లభ్యతను క్రమబద్ధీకరించేలా చర్యలు తీసుకోవాలని సిఎం కోరారు. ప్రస్తుతం రొయ్యల ఫీడ్‌లో ఉపయోగించే చేప పొడిని 5శాతం ప్రోత్సాహకాలతో ఎగుమతికి అనుమతిస్తున్నారని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ కారణంగా దేశీయ ఫీడ్ తయారీ దారులు ఎక్కువ ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. డిజిఎఫ్‌టి ద్వారా ఎగుమతులను నియంత్రించాలన్నారు. దేశీయ రొయ్యల ఫీడ్ తయారీ దారుల అవసరాలు తీరిన తర్వాతే ఎగుమతులకు అనుమతించాలని కోరారు. జిఎం సోయాబీన్ మీల్ దిగుమతికి కూడా అనుమతి ఇవ్వాలన్నారు. ఎపి నుంచి ఎఫ్‌సివి పొగాకు ఎగుమతులకు ప్రోత్సాహకాలు కల్పించాలని ముఖ్యమంత్రి కోరారు. లక్షలాది మంది రైతు కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించేందుకు దోహదపడుతోందని సిఎం వెల్లడించారు. దేశంలోని పొగాకు ఉత్పత్తిలో ఎఫ్‌సివి పొగాకు 70 శాతం మేర ఎగుమతి అవుతోందని సిఎం వెల్లడించారు. జింబాబ్వే, టాంజానియా లాంటి దేశాల్లోని ఎగుమతి దారులకు ఆయా దేశాలు రాయితీలు, సుంకాల మినహాయింపు ఇస్తున్నాయని తెలిపారు. భారతీయ పొగాకు ఎగుమతిదారులకు ఎలాంటి మద్దతు లేకపోవటంతో తీవ్రమైన పోటీ ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆగస్టు 2021లో రోడ్‌టెప్ పథకం కింద టీ, కాఫీ, మసాలా దినుసులు లాంటి వ్యవసాయ వస్తువులను చేర్చినప్పటికీ... ప్రాసెస్ చేయని పొగాకును (హెచ్ఎస్ కోడ్ 2401) మాత్రం ఈ జాబితాలో చేర్చలేదన్నారు. సమాన వడ్డీ పథకం, నిర్యాత్ ప్రోత్సాహన్ లాంటి పథకాల కింద ఎఫ్‌సివి పొగాకుకు సబ్సిడీ లేకపోవటంతో ఎగుమతిదారులకు భారం పడుతోందని సిఎం వివరించారు. తక్షణమే ప్రాసెస్ చేయని పొగాకు (హెచ్ఎస్ కోడ్ 24012401 10, 2401 20,2401 30) రకాలను ఇతర వ్యవసాయ ఉత్పత్తులతో పాటు,ఇతరప్రయోజనాలు వర్తింపజేయాలని సిఎం కోరారు. ప్రధాని మోడీకి తన పాటుగా వచ్చిన ఎంపీలను సిఎం చంద్రబాబు పరిచయం చేసారు.పోలవరం ప్రాజెక్ట్,అమరావతి నిర్మాణం వేగంగా జరిగేందుకు కేంద్రం నుంచి సంపూర్ణ సహకారం అందివ్వాలని కోరారు. భోగాపురం ఎయిర్ పోర్టు ఉన్న లోక్‌సభ నియోజకవర్గ ఎంపీ అంటూ కలిశెట్టి అప్పలనాయుడిని ప్రధానికి సిఎం పరిచయం చేయగా అప్పలనాయుడు నాకు తెలుసు. అయన రోజూ సైకిల్‌పై పార్లమెంటుకు వస్తున్నారని ప్రధాని బదులిచ్చారు. ఈ సమావేశంలో సిఎంతో పాటు కేంద్రమంత్రులు రామ్మోహన్, శ్రీనివాసవర్మ, ఎంపీలు శ్రీకృష్ణదేవరాయలు, అప్పలనాయుడు ప్రధానిని కలిశారు.

# నీటి ఎద్దడి రానివ్వొద్దు

>> అధికారులు వివరించారు. రెండు మెగా ప్రాజెక్టుల అంచనా వ్యయం దాదాపు రూ. 2,500 కోట్లు కాగా, అందులో రూ. 1,290 కోట్ల అంచనా వ్యయంతో ప్రకాశం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో, 593 ఆవాసాలకు తాగునీరు అందించే లక్ష్యంతో ప్రారంభించిన ప్రకాశం మెగా వాటర్ గ్రిడ్ పథకానికి సంబంధించి ఇంటేక్ వెల్ నిర్మాణం పనులు 40 శాతానికి పైగా పూర్తయ్యాయి.

119 మిలియన్ లీటర్ల నీటి శుద్ధి ప్లాంట్ పనులు, సంపులు, గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు పురోగన్నాయి. ప్రకాశం వాటర్ గ్రిడ్ పథకం కింద ఇప్పటి వరకు 53 కిలోమీటర్ల మేర పైపు లైన్ల నిర్మాణం పూర్తి చేసినట్టు వివరించారు.రూ. 1,200 కోట్లతో చేపట్టిన పల్నాడు వాటర్ గ్రిడ్ పథకాన్ని 235 ఆవాసాలకు తాగునీరు అందించే లక్ష్యంతో ప్రారంభించగా, ఇప్పటికే 152 కిలోమీటర్ల మేర పైపు లైన్ నెట్వర్క్ పూర్తయ్యింది. ఇన్ టేక్ వెల్స్, రిజర్వాయర్లు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం పనులు కూడా పురోగతిలో ఉన్నట్టు తెలిపారు. ఇప్పటికే రూ. 95 కోట్లు విలువ చేసే పనులు పూర్తి చేసినట్టు తాగునీటి సరఫరా విభాగం అధికారులు వివరించారు.

అనంతరం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ 'తాగు నీటి సమస్యతో ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులుపడుతున్న పల్నాడు, ప్రకాశం ప్రాంతాల ప్రజలకు ఈ ప్రాజెక్టులు జీవనాధారంగా మారనున్నాయి. ఈ రెండు ప్రాంతాల్లో జల్ జీవన్ మిషన్ కింద చేపట్టిన అమరజీవి జలధార మెగా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులు చాలా కీలకమైనవి. వీటి నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. నిర్ణీత గడువులోపు ఈ రెండు ప్రాజెక్టులను పూర్తి చేసి, లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి ఇంటికీ మంచి నీటి సౌకర్యం అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టాలి. గ్రామాల మధ్య పైపు లైన్ల నిర్మాణం, అటవీ అనుమతులు లాంటి సమస్యలు ఉంటే తక్షణం పరిష్కరించుకునే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయండి. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా నిర్మాణ కార్యకలాపాలను సాధ్యమైనంత వేగంగా ముందుకు తీసుకువెళ్లాలి. భుజం శస్త్ర చికిత్స నుంచి పూర్తిగా కోలుకున్న తర్వాత పనుల పురోగతిని పరిశీలించేందుకు క్షేత్ర స్థాయి పర్యటనలు చేపడతాను. స్వయంగా పనుల నాణ్యతను పరిశీలిస్తా. జల్ జీవన్ మిషన్ పనుల్లో అలసత్వానికి తావివ్వొద్దు. పల్నాడు, ప్రకాశం మెగా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులు పూర్తయితే ఈ రెండు ప్రాంతాల పరిధిలోని సుమారు 10 నియోజకవర్గాల పరిధిలో 16 లక్షల మందికి పైగా ప్రజలకు శాశ్వత తాగునీటి భద్రత ఏర్పడుతుంద"న్నారు.

## ఇదేం పాలన!

>> అసమర్థుడని రాహుల్ గాంధీ ఆరోపించారు. మన అతిపెద్ద ఆస్తి అయిన భారతదేశ విద్యా వ్యవస్థను విద్యాశాఖ మంత్రి నాశనం చేస్తున్నారని విమర్శించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇది న్యాయమైన డిమాండ్. ప్రధాన్ ఒక అవినీతిపరుడు, అసమర్థుడు. ఈ గందరగోళం మొత్తానికి ప్రతీక. ఆయనను తప్పక తొలగించాలని అన్నారు. మరోవైపు గత 10 ఏళ్లలో కనీసం 152 పేపర్ లీక్‌లు జరిగాయని, వాటిపై ఎటువంటి జవాబుదారీతనం లేదని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ లీక్‌లు కోట్లాది మంది విద్యార్థులపై ప్రభావం చూపాయి. గత పదేళ్లలో పేపర్ లీక్ కేసుల్లో ఎవరికీ శిక్ష పడలేదు. విద్యార్థులు దీనిని ప్రశ్నిస్తున్నారు అని అన్నారు. అయితే పేదలు, మధ్యతరగతి ప్రజలకు విద్యా వ్యవస్థ అందుబాటులో లేకుండా పోయిందని రాహుల్ అన్నారు. నీట్ కోచింగ్ కోసం దేశవ్యాప్తంగా అభ్యర్థులు ఏటా రూ. 1.32 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. దేశ వార్షిక విద్యా బడ్జెట్ అయిన రూ. 1.4 లక్షల కోట్లతో ఇది దాదాపు సమానమని గుర్తు చేశారు.

### వారం - వర్జ్యం

23-07-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పుష్యమి కార్తె
నవమి ఉ.7.04, విశాఖ రా.1.43
వర్జ్యం : లేదు
దు.ఉ.10.04-ఉ.10.56,
2) మ.3.15-సా.4.07
శుభసమయం : ఉ.8.00-9.00
రాహుకాలం - మ.1.30-3.00

### వార్తాఫలం

**మేషం:** ఇంటాబయటా సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.

**వృషభం:** ఉన్నతాధికారులతో మాట్లాడేటప్పుడు జాగ్రత్తలు పాటించడం వలన లాభపడతారు. వాహన సౌలభ్యం కలదు.

**మిథునం:** వంతాలు వివాదాలు అధికమవుతాయి. ఓర్పు కలిగి ఉండటం చెప్పదగిన సూచన. బంధువుల కలయిక.

**కర్కాటకం:** రెండు మూడు విధాలుగా ధనలాభం పొందుతారు. ప్రముఖుల నుండి కీలక సమాచారం అందుకుంటారు.

**సింహం:** తప్పుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ అన్నారు. పెండింగ్ లోని కోర్టు వ్యవహారాలు చికాకు కలిగిస్తాయి.

**కన్య :** బంధువులకు సంబంధించిన వ్యవహారాలు పర్యవేక్షించవలసి వస్తుంది. మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది.

**తుల:** మీరు ఏర్పరచుకున్న సౌకర్యాలను కలుషితం చేసే యత్నాలు జరుగుతాయి. జాగ్రత వహించండి. ఆరోగ్యం జాగ్రత్త.

**వృశ్చికం:** జీవిత భాగస్వామి తో మాట్లాడేటప్పుడు సంయమనం పాటించండి. వ్యాపారానుకూలత బాగుంటుంది.

**ధనుస్సు:** ఎంత ప్రయత్నించినా పనులు అనుకున్న విధంగా పూర్తికావు. ఆర్థిక సర్దుబాటులు ఎంతో నేర్పుగా చేస్తారు.

**మకరం:** నూతన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. ఆస్తి వివాదాలు చికాకుకలిగిస్తాయి.

**కుంభం:** అనుకోకుండా కొన్ని అవకాశాలు లభిస్తాయి. అనాధ బాలలకు డబ్బు రూపేణా మీ వంతు సహాయాన్ని అందిస్తారు.

**మీనం:** అధిక శ్రమను పంచుకొనడానికి నమ్మకస్తులైన వారిని ఎన్నుకొని బాధ్యతలను అప్పగిస్తారు. శుభవార్తలు అందుకొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 3 వేల మందికి శాశ్వత ఇళ్ల పట్టాలు

>> శాశ్వత ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

**భారీ మెజారిటీతోనే భారీ అభివృద్ధి**


ఈ ఎన్నికల్లో ప్రజలు తనకు 91 వేల ఓట్ల భారీ మెజారిటీ కట్టబెట్టారని, ఆ విజయమే తనకు పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేసేందుకు కొండంత బలాన్ని ఇస్తోందని లోకేష్ అన్నారు. "మీరిచ్చిన ఈ అఖండ విజయం వల్లే నేను కేంద్రంలోని పెద్దలతో మాట్లాడి నిధులు తీసుకురాగలుగుతున్నా. మంగళగిరి ప్రజలే నా కుటుంబం. ఇక్కడ నాకు సొంత అక్కాచెల్లెళ్లు లేకపోయినా, మీ అందరినీ చూస్తుంటే నా సొంతవారిని చూసినట్లే ఉంటుంది"అని ఆయన భావోద్వేగంగా ప్రసంగించారు.

**మోడల్ నియోజకవర్గమే లక్ష్యం**

మంగళగిరిని దేశంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు లోకేష్ తెలిపారు. నియోజకవర్గంలోని భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం రూ.1800 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కేంద్రం నుంచి ఛాలెంజ్ ఫండ్, రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ నిధులతో ఈ పనులు ప్రారంభిస్తున్నామని చెప్పారు. దీంతో పాటు వంద పడకల ఆసుపత్రి నిర్మాణం, పార్కులు, కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధి, మూసేసిన అన్నా క్యాంటీన్ల పునఃప్రారంభం, పైప్‌లైన్ గ్యాస్ వంటి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. నిడమర్రు స్కూలులో సీటు కోసం ఒక తల్లి తనతో వాదించడం ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన నాణ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు.

**మలివిడతలో 2,634మందికి పట్టాలు పంపిణీ చేసిన మంత్రి లోకేష్..**

'మన ఇల్లు - మన లోకేష్' కార్యక్రమంలో భాగంగా వరుసగా రెండోరోజు కూడా మంత్రి లోకేష్ 6 గంటలపాటు నిలబడి పట్టాలు పంపిణీ చేశారు. రెండో రోజున ఉదయం 9.30గంటలనుంచి మధ్యాహ్నం 3.30గంటలవరకు 6గంటలపాటు సికె కన్వెన్షన్ వేదికపైనుంచి లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. తొలిరోజున 1331మందికి, రెండోరోజున 1303మందికి మొత్తంగా 2,634 మందికి నూతన పట్టాలు అందజేసారు. మలివిడతలో మంత్రి లోకేష్ అందజేసిన పట్టాల మార్కెట్ విలువ సుమారు రూ.1000 కోట్లుగా ఉంది. రెండోరోజు కూడా ఓపికగా నిలబడి పట్టాలు అందించిన లోకేష్... పలువురు దివ్యాంగ లబ్ధిదారులకు వేదిక కిందకు దిగి వెళ్లి పట్టాలను అందించారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి లబ్ధిదారు, వారి కుటుంబ సభ్యులతో ఫోటోలు దిగారు. తొలివిడత గత ఏడాది ఏప్రిల్ నెలలో 3,003 మందికి పట్టాలు అందజేశారు. 2029లోగా నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ భూముల్లో దీర్ఘకాలంగా నివాసముంటున్న ప్రతి లబ్ధిదారుడికి పట్టాలు అందజేస్తానని గత ఎన్నికల సమయంలో యువనేత లోకేష్ హామీ ఇచ్చారు. ఇరిగేషన్, రెవిన్యూ, అటవీ, దేవాదాయ, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, రైల్వే తదితర శాఖలకు చెందిన భూముల్లో పేదలు దాదాపు మూడు దశాబ్దాలకు పైబడి ఇళ్లు నిర్మించుకొని జీవిస్తున్నారు. నాడు ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు వివిధ శాఖలకు చెందిన రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో మంత్రి లోకేష్ పలుమార్లు సంప్రదింపులు జరిపి, శాఖలవారీగా స్థలాల సమస్యను పరిష్కరించారు. కేంద్రప్రభుత్వంతో ముడిపడివున్న మరికొన్ని భూముల సమస్యను పరిష్కరించాల్సి ఉంది. వాటిపై కూడా కేంద్ర పెద్దలతో మంత్రి లోకేష్ సంప్రదింపులు జరుపుతున్నారు.



బుధవారం మనిలాలో ఆస్ట్రేలియా విదేశాంగమంత్రి పెన్నీవాంగ్‌తో భారత్ విదేశాంగ మంత్రి జైశంకర్

## కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి భేటీ

**విజయవాడ, జూలై 22,ప్రభాతవార్తప్రతినిధి:** ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌తో సిఎం చంద్రబాబునాయుడు అయ్యారు.గోదావరి, కావేరి నదుల అనుసంధానంపై కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌తో సిఎం చంద్రబాబు చర్చించారు. సముద్రంలో వృథాగా పోయే నీటిని వాడుకోవడం ఉత్తమమని సిఎం సూచించారు. శ్రీశైలం నుంచి అనుసంధానిస్తే గ్రావిటీ ద్వారా కావేరికి నీరు చేరి ఖర్చు తగ్గుతుందన్నారు. అది కుదరకపోతే బనకచర్ల నుంచి ప్రాజెక్టు చేపట్టాలని కోరగా, అధికారులు సానుకూలత తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ఈ అనుసంధాన భారం తగ్గుతుందని సిఎం వివరించారు. అలాగే పోలవరం ఎడమ కాలువను శ్రీకాకుళం వరకు పొడిగించాలని ఆయన కోరారు. అయితే మహానది వంశధారతో ఆ ప్రాంతానికి ప్రయోజనం ఉంటుందని అధికారులు చెప్పారు. ఈ నదుల అనుసంధానంపై మిగతా రాష్ట్రాలను ఒప్పించాలని సిఎం విజ్ఞప్తి చేశారు. దీనిపై రెండు మూడు వారాల్లోనే భాగస్వామ్య రాష్ట్రాల సిఎంలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేస్తామని మంత్రి పాటిల్ హామీఇచ్చారు. అన్ని రాష్ట్రాలు, భాగస్వామ్య పక్షాలతో ప్రత్యేక భేటీ ఏర్పాటు చేయాలని సిఎం చంద్రబాబు అన్నారు. జలశక్తి శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రాల ప్రయోజనాల కంటే దేశ ప్రయోజనాలే ముఖ్యమని, సముద్రంలోకి నీరు వృథాగా పోయే కంటే ఉపయోగించుకుంటే మంచిదని సిఎం తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన అన్ని రాష్ట్రాలతో భేటీ ప్రతిపాదనను కేంద్రమంత్రి సి.ఆర్.పాటిల్ అంగీకరించారు.

## కాంగ్రెస్, బిజెపి బాహాబాహీ

>> రాహుల్ గాంధీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌ను ముట్టడించేందుకు ప్రయత్నించారు. పార్టీ భవనంలోకి దూసుకెళ్లడానికి ఎగబడ్డారు. పోలీసులు అడ్డుకున్నా లెక్క చేయలేదు.ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ శ్రేణులు కూడా పెద్ద ఎత్తున రోడ్డుపైకి వచ్చాయి. పార్టీ కార్యాలయం ముట్టడిని అడ్డుకోవడానికి ప్రయత్నించాయి. కాంగ్రెస్ నాయకులు ప్రతిఘటించడంతో ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఇది కాస్తా పరస్పర తోపులాటకు దారితీసింది. ఇరు పార్టీల కార్యకర్తలు ఒకరినొకరు నెట్టుకుంటూ భౌతిక దాడులకు దిగారు. పార్టీ జెండాలను పట్టుకున్న కర్రలతో పరస్పరం కొట్టుకున్నారు.పరిస్థితి చేజారిపోతుండటంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న విజయవాడ నగర పోలీసులు తక్షణమే రంగంలోకి దిగారు. ఘర్షణ పడుతున్న ఇరు పార్టీల నాయకులను, కార్యకర్తలను విడదీసేందుకు పోలీసులు లాఠీలకు పనిచెప్పాల్సి వచ్చింది. గొడవ మరింత పెరగకుండా నిరసనకారులను బలవంతంగా చెదరగొట్టారు. పలువురిని అదుపులోకి తీసుకున్నారు. విజయవాడలో పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని నగర పోలీసు అధికారులు ప్రకటించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అడ్డుకునేందుకు కాంగ్రెస్, బిజెపి కార్యాలయాల వద్ద అదనపు పోలీసు బలగాలను మోహరించారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

>> ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులకు సంబంధించిన అంశాలను వీలైనంత వరకూ చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చని అన్నారు.వివిధ ఉద్యోగ సంఘాలు లేవనెత్తిన అన్ని అంశాలను పరిశీలించి ప్రభుత్వ స్థాయిలో వీలైనంత మేరకు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఈ సమావేశంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్,రాష్ట్ర రెవెన్యూ,రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్‌లు పాల్గొనగా, రాష్ట్ర ఆహార పౌర సరఫరాలు,వినియోగ దారుల వ్యవహారాల శాఖామంత్రి నాదెండ్ల మనోహార్ వర్చువల్‌గా పాల్గొన్నారు.ఇంకా ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు శశి భూషణ్ కుమార్,యంటి.కృష్ణబాబు,ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్,కార్యదర్శులు వాడ్రేవు వినయ్ చంద్,వీరపాండ్యన్ తదితర అధికారులు పాల్గొన్నారు. అదే విధంగా ఉద్యోగ సంఘాల తరపున ఎపి ఎన్జిజిఓ సంఘం అధ్యక్షులు విద్యాసాగర్, ఎపి సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జి.రామకృష్ణ,ఎపి రెవెన్యూ సర్వీసెస్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు,ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కె.సూర్యనారాయణ,ఎస్టియు ఎపి అధ్యక్షులు సాయి శ్రీనివాస్,ఎపి యుటిఎఫ్ ఎన్. వెంకటేశ్వర్లు,ఎపి పిఆర్టియు ఎం.కృష్ణయ్య,ఎపిటిఎఫ్ జి.హృదయరాజు తదితరులు పాల్గొన్నారు.

### అమరావతి రైల్వే లైన్:

# భూములిచ్చే రైతులకు రాజధాని సమీపంలో ప్లాట్లు

### - మంత్రి నారాయణ

**విజయవాడ, జులై22, ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి రైల్వేలైన్‌కు భూములిచ్చే రైతులకు రాజధాని సమీపంలో ప్లాట్లు కేటాయిస్తామని మంత్రి నారాయణ అన్నారు. రైల్వే లైన్, అవుటర్ రింగ్ రోడ్, కొండవీటి వాగు విస్తరణకు భూములు సమీకరించేందుకు గుంటూరు జిల్లా తాడికొండలో గ్రామసభ నిర్వహించారు. 3 ప్రాజెక్టులకు కలిపి తాడికొండ గ్రామ పరిధిలో 4,000 ఎకరాలకుపైగా సమీకరించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనిపై రైతుల అభిప్రాయాలు, అభ్యంతరాలను మంత్రి నారాయణ తెలుసుకున్నారు. రాజధాని అమరావతి విషయంలో జగన్ చేస్తున్న వ్యాఖ్యలపై రైతులు సందేహాలు లేవనెత్తారు. భూసమీకరణతో పాటు భూసేకరణకు కూడా అవకాశం కల్పిస్తే తమ ఇష్టం వచ్చిన విధానాన్ని ఎంచుకుంటామని కొందరు రైతులు తెలిపారు. ఇద్దరు రైతులు గ్రామసభలోనే భూసమీకరణకు తమ అంగీకారాన్ని తెలియజేస్తూ పత్రాలు అందజేశారు. అమరావతి రైల్వేలైన్‌కు భూములిచ్చే రైతులకు రాజధాని సమీపంలో ప్లాట్లు కేటాయిస్తామని మంత్రి నారాయణ అన్నారు. రైతుల అభ్యంతరాలన్నింటినీ నోట్ చేసుకున్నామని మంత్రి నారాయణ ఈ సభలో స్పష్టం చేశారు.

## అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డు కేసు తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు

**విజయవాడ, జులై22, ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో ప్రతిపాదిత సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన కేసులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తన తీర్పును రిజర్వ్ చేసింది. ఈ రహదారి నిర్మాణంపై గతంలో విధించిన మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరుతూ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ పూర్తయింది. ఇరుపక్షాల వాదనలను విన్న ధర్మాసనం, తుది తీర్పు వెలువడే వరకు వివాదాస్పద భూమి విషయంలో యథాతథ స్థితిని కొనసాగించాలని ఆదేశించింది.ఈ పిటిషన్‌పై జస్టిస్ రవీంద్రనాథ్ తిలకరి, జస్టిస్ చింతలపూడి పురుషోత్తం కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలువినిపిస్తూ.. కోర్టు విధించిన మధ్యంతర ఉత్తర్వుల వల్ల కీలకమైన రహదారి నిర్మాణపనులు నిలిచిపోయాయని, దీనివల్ల ప్రాజెక్టు ఆలస్యమవుతోందని, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని స్టే ఉత్తర్వులను తొలగించాలని ఆయన కోరారు.

## దేశ వ్యతిరేక శక్తులకు మద్దతు ఇస్తున్న కాంగ్రెస్

### బిజెపి రాష్ట్ర చీఫ్ మాధవ్

**విజయవాడ, జులై 22, ప్రభాతవార్తప్రతినిధి:** నీట్ పరీక్ష అంశంపై ప్రారంభమైన ఢిల్లీ నిరసనలు దేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నించే స్థాయికి చేరుకున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ ఆరోపించారు. దేశ వ్యతిరేక శక్తులకు కాంగ్రెస్ పార్టీ ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు ఇస్తోందని విమర్శించారు. విజయవాడలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఢిల్లీలో సోనమ్ వాంగ్చుక్ చేపట్టిన నిరసనల్లో అర్బన్ నక్సల్స్, దేశ విద్రోహ శక్తులు చొరబడ్డాయని మాధవ్ ఆరోపించారు. ఆర్టికల్-370 రద్దును వ్యతిరేకించడం, పార్లమెంట్ దాడి కేసు నిందితుడు అఫ్జల్ గురు ఉరితీతను ప్రశ్నించడం, దేశాన్ని ముక్కలు చేస్తామంటూ నినాదాలు చేసే శక్తులకు కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు అండగా నిలవడం అత్యంత ప్రమాదకరమని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నివాసంపై దాడి యత్నం దేశంపైనే జరిగిన దాడిగా భావిస్తున్నామని మాధవ్ పేర్కొన్నారు. దీనికి నిరసనగా దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కార్యాలయాల ముట్టడికి బీజేపీ పిలుపునిచ్చిందన్నారు. విజయవాడలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బీజేపీ కార్యకర్తలపై కాంగ్రెస్ శ్రేణులు గుడ్లతో, కర్రలతో దాడి చేయడం వారి హింసాత్మక రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు.మన్మోహన్‌సింగ్ ప్రభుత్వ హయాంలో 150కు పైగా పేపర్ లీకులు జరిగిన విషయాన్ని కాంగ్రెస్ మరచిపోయిందని విమర్శించారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్ ఘటన వెలుగులోకి రాగానే బాధ్యులపై మోదీ ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని అరెస్టులు చేసిందన్నారు.

## పలువురు డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు, పోస్టింగ్స్

**విజయవాడ, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిలో పలువురు డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు, పోస్టింగ్స్‌లు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను అనుసరించి అనకాపల్లి జిల్లా అడ్డరోడ్డు ఆర్డీఓగా కె.వి.రామలక్ష్మి, ధర్మవరం ఆర్డీవోగా రామభూపాల్ రెడ్డి, అమలాపురం ఆర్డీవోగా డి.ధర్మరాజు, పీలేరు ఆర్డీవోగా కె.విజయలక్ష్మి, మడకశిర ఆర్డీవోగా నాగప్రసన్న లక్ష్మి, అనంతపురం ఆర్డీఓగా ప్రేమ్‌నాథ్ కుమార్ నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తక్షణమే సంబంధిత స్థానాల్లో విధుల్లో చేరాలని సిఎస్ సాయిప్రసాద్ సూచించారు.

## విదేశాల్లో ఉద్యోగాల పేరుతో భారీ మోసం

### ఫ్లయింగ్ బోర్డర్స్ కన్సల్టెన్సీ నిర్వాహకులు సౌజన్య, శ్రీనివాస్ దంపతుల అరెస్ట్

**విజయవాడ, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పలువురు నిరుద్యోగులను నమ్మించి మోహం చాటేసిన ఫ్లయింగ్ బోర్డర్స్ కన్సల్టెన్సీ నిర్వాహకులు సౌజన్య, శ్రీనివాస్ దంపతులు విజయవాడ పోలీసులకు పట్టుబడ్డారు. దాదాపు 750 మంది నిరుద్యోగుల నుంచి రూ.11.46 కోట్లు వసూలు చేసినట్లు దంపతులపై ఆరోపణలు ఉన్నాయి. హైదరాబాద్‌లో నిందిత దంపతులను విజయవాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఐరోపా దేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగులకు సౌజన్య, శ్రీనివాస్ దంపతులు వలవేసారు. డబ్బులు తీసుకుని ఉద్యోగాలు చూపించకుండా మోసం చేసి అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. వారిపై బాధితుల ఫిర్యాదు మేరకు మాచవరం, సైబర్ క్రైమ్, సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు అయ్యాయి. కొంతకాలంగా పరారీలో ఉన్న సౌజన్య, శ్రీనివాస్ దంపతులు ఎట్టకేలకు అత్యంత చాచక్యంగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిరుద్యోగుల నుంచి వసూలు చేసిన సొమ్మును స్థిరాస్తి వ్యాపారంలో పెట్టుబడి పెట్టినట్లు పోలీసులు గుర్తించారు. కంకిపాడు ప్రాంతంలో దంపతుల పేర్లతో పలు స్థలాల కొనుగోలు చేసారు. స్థలాల లావాదేవీల విలువ సుమారు రూ.1.42 కోట్లుగా గుర్తించిన పోలీసులు. మరిన్ని ఆస్తుల వివరాల కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పోలీసుల ఆరా తీస్తున్నారు. సంస్థ కార్యాలయంలో సోదాలు చేసారు. ల్యాప్‌టాప్‌లు, ఇతర పరికరాలు స్వాధీనం చేసుకున్నారు. ఫ్లయింగ్ బోర్డర్స్ కన్సల్టెన్సీలో దంపతులిద్దరూ నిర్వాహకులుగా ఉన్నట్లు ఆధారాలు లభించాయి. నిందితుల ఆర్థిక లావాదేవీలు, విదేశీ ఉద్యోగాల నెట్‌వర్క్‌పై పోలీసుల దర్యాప్తు చేస్తున్నారు.

# భూ రికార్డుల శాశ్వత భద్రతకు బ్లాక్‌చెయిన్

- నేడు సిఎం చంద్రబాబు చేతుల మీదుగా 'మీ భూమి- బ్లాక్‌చెయిన్' పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభం
- 7 జిల్లాల పరిధిలోని 7 మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్ అమలు
- భూ రికార్డులకు 'సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్'గా 'మీ భూమి-బ్లాక్ చెయిన్' ప్రాజెక్ట్
- భూ మోసాలకు చెక్.. వేగవంతమైన, పారదర్శక సేవలే లక్ష్యం

**విజయవాడ, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** భూ రికార్డుల నిర్వహణలో సాంకేతిక విప్లవానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల్లో విడివిడిగా ఉన్న భూ సమాచారాన్ని ఒకే వేదికపైకి తీసుకువస్తూ, రాష్ట్రంలోని భూ రికార్డులకు సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్‌గా నిలిచే ఖీమీభూమి-బ్లాక్ చెయిన్ఖీ వ్యవస్థను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. గురువారం మధ్యాహ్నం రాష్ట్ర సచివాలయంలో ఈ కార్యక్రమం జరగనుంది. కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల కలెక్టర్లు వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రస్తుతం వెబ్‌ల్యాండ్ ద్వారా భూ రికార్డులు డిజిటలైజ్ అయినప్పటికీ, రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల్లో సమాచారం వేర్వేరుగా ఉండటం వల్ల డేటా వ్యత్యాసాలు, రికార్డుల్లో మార్పులను గుర్తించడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా మీ భూమి-బ్లాక్ చెయిన్ వ్యవస్థను రూపొందించారు. వి.ది ఆంధ్రప్రదేశ్, వి.ది బెంగళూరులోని




సెంటరాఫ్ ఎక్స్ లైన్స్ ఇన్ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ సంస్థలు సంయుక్తంగా హైపర్ లెడ్జర్ ఫ్యాబ్రిక్ టెక్నాలజీతో ఈ వ్యవస్థను అభివృద్ధి చేశాయి. ఈ వ్యవస్థలో ప్రతి భూ పార్సెల్‌కు ప్రత్యేక బ్లాక్‌చెయిన్ గుర్తింపు కల్పిస్తారు. ప్రతి లావాదేవీ టాంపర్‌ప్రూఫ్, సెక్యూర్టీతో జరగనుంది. భూ రికార్డుల్లో ఎలాంటి మార్పు చేయాలన్నా ప్రభుత్వం నిర్దేశించిన ఆన్‌లైన్ సేవల ద్వారానే ఇకపై సాధ్యమవుతుంది. ఒక భూ పార్సెల్‌కు సంబంధించిన అన్ని రకాల లావాదేవీలు, వాటి ప్రతి వెర్షన్‌తో సహా శాశ్వతంగా నమోదయ్యేలా వ్యవస్థను తీర్చిదిద్దారు. ఇక ప్రతి లావాదేవీని ఏ అధికారి, ఎప్పుడు నిర్వహించారనే వివరాలు కూడా శాశ్వతంగా రికార్డుల్లో ఉంటాయి. రికార్డుల్లో ఏమైనా వ్యత్యాసం ఉంటే లావాదేవీ వెంటనే ఆగిపోయేలా వ్యవస్థను రూపొందించారు. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలను ఒకే వేదికపైకి తీసుకువస్తున్న ఈ వ్యవస్థలో ప్రస్తుతం ఆటో మ్యూటేషన్, సబ్‌డివిజన్, ఎక్స్‌టెంట్ కరెక్షన్ సహా ఎనిమిది పౌర సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. వ్యవసాయం, మత్స్యశాఖ, గనులు, పరిశ్రమలు, విద్యుత్ శాఖ, సీఆర్‌డీఏ, ఆర్థిక సంస్థలు వంటి విభాగాలు కూడా అవసరమైన మేరకు ఈ సమాచారాన్ని వినియోగించుకునే అవకాశాన్ని కల్పించారు. మొదటి దశలో కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల పరిధిలోని అస్పరి, పెనుమూరు, రేపల్లె, గన్నవరం, కడియం, గుమ్మలక్ష్మీపురం, కొత్తవలస మండలాల్లో ఈ పైలట్ ప్రాజెక్టుగా అమలు కానుంది. ఈ పైలట్ ప్రాజెక్టులో 89 రీసర్వే గ్రామాలు, 1,37,763 ల్యాండ్ పార్సెల్ మ్యాప్‌లు కవర్ అవుతున్నాయి.



## తగ్గిన బొప్పాయి ధరలు... భగ్గుమన్న రైతులు

- కోతకు వెళ్లే లారీలను ఆపి రోడ్డుపై గడ్డి కాలుస్తూ నిరసన

**రైల్వేకోడూరు రూరల్, జులై 22 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా రైల్వే కోడూరు మండలంలో బుధవారం బొప్పాయి ధరలు తగ్గడంతో ఒకసారిగా బొప్పాయి రైతులు రోడ్లు పైకి వచ్చి వరిగడ్డి కాలుస్తూ నిరసనను వ్యక్తం చేశారు. బుధవారం తెల్లవారుజామునే కోతకు వెళ్లే లారీలను ఆపి వరిగడ్డి తెచ్చి ప్రధాన రహదారిపై వేసి బొప్పాయి రైతులు ధరలను తగ్గిస్తే ఇదే నిరసనను కొనసాగిస్తామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కొంతకాలంగా బొప్పాయి ద్వారా కిలోకు రూ.18 లుండగా ఒక్కసారిగా దళారుల చేతుల్లో 14కు తగ్గిపోవడంతో ఉక్కిరిబిక్కిరి అయిన బొప్పాయి రైతులు పూర్తిగా పలుచోట్ల నిరసనలను వ్యక్తం చేశారు. అదేవిధంగా ధరలు తగ్గింపును వ్యతిరేకిస్తూ ప్యాకింగ్ కేంద్రాల వద్ద ఆందోళన ఉద్రిక్తం చేస్తామని రైతులు పేర్కొన్నారు. బొప్పాయి రైతులు తమ పొలాల్లో ఉన్న బొప్పాయి కోత (కట్టింగ్) చేపట్టవద్దని నిర్ణయించడంతో పలు గ్రామీణ ప్రాంతాల్లో బొప్పాయి లోడింగ్ పూర్తిగా నిలిచిపోయింది. దీంతో లోడు చేయవలసిన లారీలు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో ఒకసారిగా కోడూరు పట్టణంలో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. సమాచారం తెలుసుకున్న రైల్వే కోడూరు సిఐ చంద్రశేఖర్, ఎస్ఐలు లక్ష్మీ ప్రసాద్ రెడ్డిలు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి సంబంధిత వివరాలను జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో వేగవంతంగా తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ రైల్వేకోడూరు మండలంలో రైతులతో చర్చలు జరిపి, ఆందోళన విరమింపజేశారు.

# వైమానిక ప్రస్థానంలో సరికొత్త శకం!

- అన్ని హంగులతో ప్రారంభానికి సిద్ధమైన భోగాపురం ఎయిర్‌పోర్ట్



**విజయనగరం, జులై 22 ప్రభాతవార్త:** భారతీయ విమానయాన రంగంలో మరో అద్భుతమైన చరిత్రను ఆవిష్కరించేందుకు రంగం సిద్ధమైంది. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం నెరవేరుస్తూ, భోగాపురం వద్ద అత్యాధునిక హంగులతో రూపుదిద్దుకున్న ఖీఅల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంఖీ ఆగస్టు 1న జాతికి అంకితం కానుంది. దేశ ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్నారు. ఈ విమానాశ్రయం కేవలం ఒక రవాణా కేంద్రం మాత్రమే కాదు ఇది ఉత్తరాంధ్ర ప్రాంత ఆర్థిక వృద్ధికి, పారిశ్రామికాభివృద్ధికి, ఉపాధి అవకాశాల సృష్టికి ఒక తిరుగులేని వారధిగా నిలవనుంది.

**అత్యుత్తమ మౌలిక వసతులు-ప్రత్యేకతలు:** ప్రముఖ విమానాశ్రయ సంస్థ జీఎంఆర్ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో రూపుదిద్దుకుంది. భారీ విమానాలు సైతం సులభంగా రాకపోకలు సాగించేందుకు వీలుగా 3,800 మీటర్ల పొడవు గల ఖీకోడ్ 4ఈఖీ రన్‌వేను ఏర్పాటు చేశారు. మొదటి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణీకులకు సేవలందించే సామర్థ్యంతో ప్రారంభమవుతుండగా, భవిష్యత్తులో దశలవారీగా దీనిని 4 కోట్ల మందికి పైగా విస్తరించేలా ప్రణాళిక రూపొందించారు. ప్రత్యేక కార్గో సదుపాయాలు ఉండటం వల్ల స్థానిక ఎగుమతులకు ఎంతో ఊతం లభిస్తుంది.

**చట్టబద్ధమైన అనుమతులు పూర్తి:** ప్రారంభోత్సవం అనంతరమే కాకుండా, తక్షణమే వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించేందుకు వీలుగా ఈ విమానాశ్రయం అన్ని రకాల చట్టబద్ధమైన అనుమతులను సాధించింది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ నుంచి ఏరోడ్రోమ్ లైసెన్స్, బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ ఆమోదాలు, ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్ట్, కస్టమ్స్ నోటిఫికేషన్‌లు, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి నుండి క్లియరెన్స్‌లు జారీ అయ్యాయి.

**ప్రాంతీయ అనుసంధానం ఆర్థిక విప్లవం:** భోగాపురం విమానాశ్రయం విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతో బాటు దక్షిణ ఒడిశా మరియు ఛత్తీస్‌గఢ్‌లోని సరిహద్దు జిల్లాల ప్రజలకు ప్రధాన విమానయాన మార్గంగా మారుతుంది.

**రహదారుల అనుసంధానం:** ప్రయాణీకులు సులభంగా విమానాశ్రయానికి చేరుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖపట్నం నుంచి ఇప్పటికే 7 అప్రోచ్ రోడ్లతో కూడిన అధునాతన హైవే కనెక్టివిటీని అందుబాటులోకి తెచ్చాయి. ఇతర జిల్లాలనుంచి కూడా అనుసంధానానికి ప్రణాళికలను రూపొందించారు.

ఇన్నాళ్ళూ వెనుకబడ్డ జిల్లాగా ముద్ర పడ్డ విజయనగరం జిల్లా ఆ ముద్రను తుడిచేసుకుని, రాష్ట్రానికి వెన్నుముక జిల్లాగా మారేందుకు భోగాపురం విమానాశ్రయం సరికొత్త బాటను వేస్తుందనడంలో సందేహం లేదు.



విద్యార్థులతో మాట్లాడుతున్న అమెరికన్ బృందం

## శాంతిపురంలో అటల్ ల్యాబ్‌ను సందర్శించిన అమెరికన్ విద్యార్థులు

**శాంతిపురం(చిత్తూరు), జులై 22 ప్రభాతవార్త:** స్థానిక శ్రీ పరమహంస యోగానంద విద్యాలయంలో ఉన్న అటల్ ల్యాబ్‌ను అమెరికాలోని లిహై యూనివర్సిటీ విద్యార్థులు సందర్శించారు. ఈసందర్భంగా వారు అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను పరిశీలించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థుల సృజనాత్మకత, ఆవిష్కరణ నైపుణ్యాలు పరిశీలించారు. ఇక్కడ అమలవుతున్న అభ్యసన విధానాలు, ల్యాబ్‌లో జరుగుతున్న కార్యకలాపాల గురించి తెలుసుకుని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆజాద్ హుసేన్, సైన్స్ ఉపాధ్యాయుడు నారాయణరెడ్డి, అక్షత, సంపత్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## గన్నవరం విమానాశ్రయంలో ప్రయాణికుడి బ్యాగులో బుల్లెట్

**గన్నవరం(కృష్ణా), జులై 22 ప్రభాతవార్త:** న్యూఢిల్లీ వెళ్ళేందుకు గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన ప్రయాణికుడి బ్యాగులో డబుల్ బ్యారెల్ గన్ బుల్లెట్ కనిపించటంతో భద్రతా సిబ్బంది అప్రమత్తమయి ప్రయాణికుడిని అదుపులోకి తీసుకుని గన్నవరం పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం న్యూఢిల్లీ వెళ్ళేందుకు నలుగురు ప్రయాణికులు గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. విమానాశ్రయ భద్రతా సిబ్బంది ప్రయాణికుల లగేజీని స్కానర్‌లో తనిఖీ చేయగా వీరిలో ఒ ప్రయాణికుడి బ్యాగులో బుల్లెట్ కనిపించింది. దీంతో భద్రతా సిబ్బంది ప్రయాణికుడిని అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ నిమిత్తం గన్నవరం పోలీసులకు అప్పగించారు. గన్నవరం సిఐ శివప్రసాద్ ప్రయాణికుడిని విచారించి అతని వివరాలు రాబట్టారు. బుల్లెట్‌తో వచ్చిన ప్రయాణికుడు ఉత్తరప్రదేశ్‌లోని వారణాసికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ ఆనందకుమార్‌గా నిర్ధారించారు.

ఆనందకుమార్ సోదరుడు అశీష్ యాదవ్‌కు, అమరావతిలోని విట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటర్వ్యూ నిమిత్తం వీరు అమరావతి వచ్చారు. అశీష్‌కు గురువారం ఉత్తరప్రదేశ్‌లో మరో ఇంటర్వ్యూకు హాజరుకావాల్సి ఉండగా వెళ్ళేందుకు వీరు విమానాశ్రయానికి వచ్చినట్లు తెలిపారు. కాగా ఆనందకుమార్ పెదనాన్న నందూజీసింగ్ యాదవ్ మిలటరీలో పనిచేసి రిటైర్ అయిన అనంతరం ఎస్‌బిఐలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. పెదనాన్న వద్ద బ్యాగు తీసుకురాగా అందులో బుల్లెట్ ఉందని, బ్యాగ్‌ను పూర్తిగా పరిశీలించకుండా దుస్తులు పెట్టుకుని రావటంతో ఇలా జరిగిందని ఆనంద్‌కుమార్ పోలీసులకు వివరించారు. పూర్తిస్థాయి విచారణం అనంతరం వాస్తవాలు వెల్లడిస్తామని సిఐ శివప్రసాద్ మీడియాకి తెలిపారు.

# దానయ్య కుటుంబానికి అండగా ప్రభుత్వం

- ఆర్థిక సాయమందించిన మంత్రి పార్థసారథి, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష



**పలాస (శ్రీకాకుళం జిల్లా), జులై 22 ప్రభాతవార్త:** ఇటీవల రహదారి ప్రమాదంలో దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయిన దుబ్బ దానయ్య కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం, కూటమి నాయకులు అన్నివిధాలా అండగా ఉంటారని రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష స్పష్టం చేశారు. ఈ నెల 10వ తేదీన జరిగిన మోటారు బైక్ ప్రమాదంలో దుబ్బ దానయ్య మృతి చెందిన నేపథ్యంలో బుధవారం పలాసలోని మృతుడి నివాసానికి వెళ్లిన మంత్రి, ఇచ్ఛాపురం, పలాస శాసన సభ్యులు బాధితులను స్వయంగా పరామర్శించి తీవ్ర సానుభూతిని తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చి వారిలో ధైర్యం నింపారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే పార్టీ స్పందించి ఆర్థిక పరిహారాన్ని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ఆర్థిక సాయానికి అదనంగా, బాధిత కుటుంబాన్ని వ్యక్తిగతంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో తమ తండ్రి, మాజీ పార్లమెంట్ సభ్యులైన కొలుసు పెదరెడ్డయ్య యాదవ్ ఛారిటబుల్ ట్రస్ట్ నుండి రూ.2 లక్షలు, యాదవ సంఘం నుండి రూ.3 లక్షలు ఈ 5 లక్షలు పార్టీ తరపున ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే గౌతు శిరీష చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు.

అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి విలేకరులతో మాట్లాడుతూ 'నేను కూడా ఒక గొర్రెల కాపరి కుటుంబం నుంచే వచ్చి, భగవంతుని, సమాజపు ఆశీస్సులతో ఈ స్థాయికి చేరుకున్నట్లు చెప్పారు. సోదరి గౌతు శిరీష వ్యక్తపరిచిన ఆవేదనను, బాధను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. ఒక సెంట్ భూమి కూడా లేకుండా, కూలీతో బతుకుతున్న ఒక నిరుపేద కుటుంబంలో ప్రమాదం వల్ల జరిగిన నష్టం పూడ్చలేనిదన్నారు. ఇక్కడికి వచ్చి, నిరుపేద కుటుంబం గురించి కనీస ప్రస్తావన చేయకుండా, ప్రమాదం చేసి మరణానికి కారణమైన 18 సంవత్సరాలు నిండిన మేజర్ యువకుడి గురించి మాట్లాడారంటే, ఆ పార్టీ డిఎన్ఏ ఎటువంటిదో ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలి అని ఘాటుగా విమర్శించారు. రోడ్డు ప్రమాదాలు జరిగితే చట్టం తన పని తాను చేసుకుపోతుందని, కానీ ఒక తండ్రిగా తన కొడుకుని తప్పించేందుకు వేరే వ్యక్తిని తెచ్చి నిలబెట్టడం చట్టానికి ఆమోదయోగ్యమా అని మంత్రి ప్రశ్నించారు. అటువంటి వ్యక్తులు రేపు అధికార స్థానాల్లోకి వస్తే పరిస్థితులు ఎంత ఘోరంగా ఉంటాయో ప్రజలు ఆలోచించాలని కోరారు. 'సెంట్ భూమి లేని గొర్రెల కాపరి కుటుంబానికి తప్పు జరిగింది, ఆదుకోవాలి' అని కనీసం ఒక్క మాటైనా అనకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వ సహాయ చర్యలను వివరిస్తూ 'ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ కుటుంబాన్ని వదిలేయదని, వారికి ఇల్లు, భూమి లేకపోవడంతో, ఎమ్మెల్యే శిరీష స్థలం కేటాయించగానే గృహ నిర్మాణ శాఖ ద్వారా వెంటనే పక్కా ఇల్లు నిర్మిస్తామన్నారు. పిల్లల చదువుల పూర్తి బాధ్యతను మేమందరం చూసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో బలహీన వర్గాల సంక్షేమానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

అనంతరం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ దానయ్య చనిపోయింది ఒక కటిక నిరుపేద అని తెలిసి ప్రతి ఒక్కరూ సాయం చేసేందుకు ముందుకు వస్తున్నట్లు చెప్పారు. ఒక ప్రాణం తీసి, రోడ్డుపై అనాథ శవంలా పడేసి వెళ్లిపోయారన్నారు. ఇద్దరు కొడుకులను పోగొట్టుకున్న ముసలి తల్లి, భర్తను కోల్పోయి అనాథగా మారిన భార్య, తండ్రి పేరే తెలియని చిన్న పిల్లల బాధలు వారికి కనిపించడం లేదా? సరిగా ప్రింటింగ్ కూడా రాని కొన్ని పేపర్లు, యూట్యూబ్ ఛానళ్లు నిజాన్ని కప్పిపుచ్చి తప్పుడు ప్రచారాలు చేస్తున్నట్లు చెప్పారు. ఒక యూట్యూబ్ ఛానళ్లలో కూడా విలువలు లేకుండా కథనాలు రాయడం బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ, జన సైనికులు, యాదవ సంఘాలు స్వచ్ఛందంగా వచ్చి ఈ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్నాయని, స్వయంగా వచ్చి తన సొంత నిధుల నుంచి బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించిన మంత్రి పార్థసారథికి నియోజకవర్గ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు.

ఈ పరామర్శ కార్యక్రమంలో ఇచ్ఛాపురం శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, ప్రజాప్రతినిధులు, వివిధ బీసీ, యాదవ సంఘాల ప్రతినిధులు, కూటమి నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రధాని పర్యటన ఏర్పాట్లు ముమ్మరం

### సభా స్థలం పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి

**భోగాపురం(విజయనగరం), జులై 22 ప్రభాతవార్త:** ఆగస్టు 1న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభానికి ప్రధాని నరేంద్ర మోదీ విచ్చేస్తున్న నేపథ్యంలో, పర్యటనా ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. ముందుగా ప్రధాని పాల్గొనే సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. అక్కడి వేదిక ఏర్పాట్లు, వివిధ గ్యాలరీలు, మీడియా సెంటర్, గ్రీన్ రూమ్స్ తదితర వాటి గురించి సంబంధిత అధికారులతో చర్చించారు. అనంతరం వీఐపీ వాహనాల పార్కింగ్ స్థలాలను పరిశీలిం చారు. వాహనాల రాకపోకలపై ఆరా తీశారు. ట్రాఫిక్ కి ఎక్కడా అంత రాయం కలగకుండా చూడాలని, పటిష్టమైన ప్రణాళికతో ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ స్థలాలను ఖరారు చేయాలని ఆదేశించారు. అంతకు ముందు టెర్మినల్ భవనాన్ని కలెక్టర్ పరిశీలించి, కంట్రోల్ రూమ్‌కి భవనాన్ని ఖరారు చేశారు. ఈ పర్యటనలో జేసి సేధు మాధవన్, జిసిసి ఎండీ ఎస్ ఎస్ శోభిక, ట్రైనీ ఐఎఎస్ హరి ఓం పాండ్య, జిఎంఆర్ ప్రాజెక్ట్ హెడ్ రామరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో సిఎంతో మంత్రి కొండపల్లి భేటీ



**విజయనగరం, జులై 22 ప్రభాతవార్త:** రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బుధవారం ఢిల్లీ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటన వివరాలను మంత్రి సిఎంకు వివరించారు. స్త్రీ నిధి ద్వారా పిఎంఎఫ్ఎంఇ పథకం అమలుపై కేంద్ర కార్యదర్శితో చర్చించడం, పీఎంఎఫ్ఎంఈ పథకం కింద స్త్రీ నిధి ద్వారా ఎస్‌హెచ్‌జి మహిళలకు అందించే రుణాలకు కూడా వడ్డీ రాయితీ ఇచ్చే అంశాలపై చర్చించినట్టు మంత్రి సీఎంకు తెలిపారు. అలాగే కడప జిల్లాలోని కొప్పర్తిలో ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు, ఎస్‌కె యూనివర్సిటీ, విజయనగరం జెఎన్‌టియులో ఎంఎస్ఎంఇ ఎక్స్‌టెన్షన్ సెంటర్ల ఏర్పాటు కార్యాచరణను వేగవంతం చేయాలని కేంద్ర మంత్రులు జితన్ రామ్ మాంఝీ, శోభా కరంద్లాజేను కలిఇ విజ్ఞప్తి చేసిన విషయాన్ని కూడా మంత్రి సిఎం దృష్టికి తీసుకువచ్చారు.

# ఉపాధికి హార్టికల్చర్ అనుసంధానం... జీవనోపాధికి భరోసా

- పవన్ కల్యాణ్ చొరవతో రెండేళ్లలో దాదాపు రెండు లక్షల ఎకరాల పండ్ల తోటల సాగు
- లక్ష మందికి పైగా రైతులకు లబ్ధి, ఆపరేషన్ చైతన్యంలో కీలక పాత్ర పోషిస్తోన్న డి.సిఎం నిర్ణయం



**విజయవాడ, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడం, మౌలిక వసతుల కల్పనకు నిర్దేశించిన జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా రైతుల జీవనోపాధి మెరుగుపర్చేందుకు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలను నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్ చేపట్టిన చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఉపాధి హామీ పథకానికి హార్టికల్చర్ అనుసంధానం ద్వారా గడచిన రెండేళ్లలో దాదాపు రెండు లక్షలకు పైగా ఎకరాల్లో పండ్ల తోటల సాగుకు ఆయన ఊతం ఇచ్చారు. దాదాపు రూ. 500 కోట్ల ఉపాధి నిధులతో రాష్ట్రవ్యాప్తంగా లక్ష 10 వేల మందికి పైగా రైతులకి పవన్ కళ్యాణ్ నిర్ణయం మేలు చేసింది. విబి జీ రాం జీ నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా గ్రామీణ ప్రజలకు స్థిరమైన జీవనోపాధి కల్పనతో పాటు రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో పవన్ కళ్యాణ్ రెండేళ్ల క్రితమే ఈ సంస్కరణలు తీసుకువచ్చారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతం ఎక్కువగా ఉండే అల్లూరి, తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉండే రాయలసీమ జిల్లాల్లో రైతుల పాలిట ఉపాధి హామీ పథకానికి హార్టికల్చర్ అనుసంధానం వరంగా మారింది.

గడచిన రెండేళ్ల కాలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పండ్ల తోటల సాగు అల్లూరి జిల్లా పరిధిలోని గిరిజన రైతాంగానికి స్థిరమైన ఆదాయ వనరులు సమకూర్చుకునేందుకు తోడ్పాటునిచ్చింది. ఏజెన్సీ ప్రాంతాలను గంజాయి రహితంగా తీర్చిదిద్దేందుకు సహకరించింది. గంజాయి సాగును నివారించేందుకు చేపట్టిన "ఆపరేషన్ చైతన్యం"లో ఉప ముఖ్యమంత్రి నిర్ణయం కీలక భూమిక పోషించింది. ఉపాధి పథకం ద్వారా చేపట్టిన పండ్ల తోటల సాగును ఒక్క అల్లూరి జిల్లా పరిధిలోనే సుమారు 46 వేల మందికి పైగా రైతులు వినియోగించుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లబ్దిపొందిన రైతుల్లో అత్యధిక శాతం ఈ జిల్లాకి చెందిన వారే కావడం గమనార్హం. అల్లూరి జిల్లా పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సాయంతో రాష్ట్రంలోనే అత్యధికంగా 48 వేలకు పైగా ఎకరాల్లో పండ్ల తోటలు సాగయ్యాయి. అందులో కాఫీ తోటలు కూడా ఉన్నాయి. గిరిజన రైతులకి మొదట సిల్వర్ ఓక్ మొక్కలు అందించి, అవి పెరగడం మొదలైన తర్వాత కాఫీ మొక్కలు పంపిణీ చేసేలా ప్రణాళిక రూపొందించారు. సిల్వర్ ఓక్ మొక్కల నీడ కాఫీ తోటల సాగుకి అత్యంత అనుకూలంగా ఉంటుంది. ఆ సిల్వర్ ఓక్ మొక్కలను ఆధారంగా చేసుకుని మిరియాలు అంతర పంటగా కూడా సాగు చేస్తారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న కూటమి ప్రభుత్వ లక్ష్య సాధనలోనూ పవన్ కళ్యాణ్ నిర్ణయం కీలక పాత్ర పోషించింది. తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉండే అనంతపురం, అన్నమయ్య, శ్రీ సత్యసాయి, కర్నూలు, కడప, చిత్తూరు, తిరుపతి నంద్యాల జిల్లాల్లో కలిపి రెండేళ్లలో 62,106 ఎకరాల్లో పండ్ల తోటల సాగుకు ఉపాధి హామీ పథకం ఊతం ఇచ్చింది. ఈ పథకం కింద పండ్ల మొక్కలు నాటడంతో సరిపుచ్చకుండా, మొక్క చెట్టుగా మారే వరకు దాదాపు మూడేళ్లపాటు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు వీలుగా ఆర్థిక సాయం అందించనున్నారు. ఏటా దుక్కి దున్నడం, గుంతలు తవ్వడం, భూమిని చదును చేయడం, మొక్కల రవాణా, నాటడం, కంచెలు ఏర్పాటు, నీటిపారుదల సదుపాయాలు, ఎరువుల వినియోగం, అంతర పంటల సాగు వంటి అంశాలకు దశలవారీగా ఆర్థిక మద్దతు అందిస్తున్నారు. హార్టికల్చర్ సాగు ద్వారా రైతులు ఎకరాకి ఏడాదికి రూ. లక్ష ఆదాయం పొందేలా ప్రణాళికలు రూపొందించి, ఆయా ప్రాంతాలను అనువైన మొక్కలు సాగు చేసే ఏర్పాటు చేశారు. రైతు క్షేమమే రాష్ట్ర క్షేమంగా తలంచి పవన్ కళ్యాణ్ తీసుకువచ్చిన సంస్కరణలు జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటున్నాయి.

వార్త

> అంతులేని కోరికలుండడమే పెద్ద దోషం. ఇతరుల గురించి చెడుగా చెప్పడమే పెద్ద పాపం. సత్యంగా ప్రవర్తించడమే నిజమైన తపస్సు.
>
> \- గురజాడ

# దేనికోసమీ పంతం?

పార్లమెంట్ వర్షాకాలపు సమావేశాల తరుణంలో కేంద్ర ప్రభుత్వానికి ఒక తలనొప్పి కాదు, పలు నిరసనలు ముప్పేట దాడి చేస్తున్నాయి. 'నీట్' ప్రశ్నపత్రాల లీక్‌కు బాధ్యత వహించాల్సిన వారెవరూ ధైర్యంగా నైతిక బాధ్యత తీసుకునేందుకు సిద్ధంగా లేరు. కొత్తగా వెలుగులోకి వచ్చిన 'కాక్రోచ్ జనతా పార్టీ' ఇదే అంశాన్ని చేపట్టి జంతర్ మంతర్‌లో అగ్గి పుట్టిస్తోంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అన్న ఒకే ఒక డిమాండ్‌తో 'కాక్రోచ్' పార్టీ గల నెల మొదటి వారంలో ఢిల్లీలో నిరసనలు చేపట్టింది. ఆనాటి నుంచి ఈనాటివరకు 'నీట్' బాధిత విద్యార్థులు,వారి తల్లిదండ్రులు, కేంద్ర ప్రభుత్వ నిర్వాకాన్ని వ్యతిరేకించేవారు, పేపర్ లీక్‌పై విరుచుకుపడినా హస్తినలో ఏలినవారు, 'కాక్రోచ్'లదేముందిలే అని ఆ అంశాన్ని ఎటూ తేల్చకుండా నాన్చారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఆయా శాఖల వ్యవహారాలు చూసే మంత్రులు తమ శాఖ పరిధిలోకి వచ్చే అంశాల విషయంలో విమర్శలు వెల్లువెత్తినప్పుడు, అవకతవకలు బయట పడినప్పుడు నైతిక బాధ్యత వహిస్తూ ఎంతో హుందాగా రాజీనామాలు చేసేవారు. ఇప్పుడలాంటిదేమీ లేదు సరి కదా! వర్షాకాల పార్లమెంటు సమావేశాల ప్రారంభం నాడు ఢిల్లీలో విపక్షాల నేతృత్వంలో కాక్రోచ్ జనతాపార్టీ కార్యకర్తల ఆందోళన చేపట్టేవరకు పట్టించుకోలేదు. కొత్తవిద్యార్థి ఉద్యమం ఊపందుకుంటున్నా ప్రభుత్వ పెద్దలకు చీమ కుట్టినట్లనిపించడం లేదు. నీట్ పేపర్ లీక్ మహాపాపమని ప్రధాని నరేంద్రమోడీ కూడా అంటున్నారు. కానీ ఆ శాఖ మంత్రి మీద ఈగవాలనివ్వడం లేదు. 'కాక్రోచ్' ఉద్యమానికి మద్దతు బాగా పెరుగుతోంది. వర్షాకాలపు పార్లమెంటు సమావేశాల సందర్భంగా 'కాక్రోచ్' ఉద్యమకారులు పార్లమెంటు ఎదుట ధర్నా నిర్వహిస్తూ కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోసం పట్టుబట్టారు. కానీ విద్యార్థుల ఉద్యమం సిజెపి ర్యాలీపై లాఠీచార్జి, కొందరు విద్యార్థులకు గాయాలు తగలడంతో ఉద్యమం మరింత తీవ్ర రూపం దాల్చింది. ఈ వ్యవహారం రాజధానిని కుదిపేసింది. కాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో మిత్రపక్షాలు వెంటరాగా గురువారం సాయంత్రం లోక్ కళ్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసాన్ని ముట్టడించారు. దాంతో కేంద్ర మంత్రి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలన్న డిమాండ్ కాస్తా ప్రధాని నరేంద్ర మోడీ రాజీనామా చేయాలనే డిమాండ్‌గా మారిపోయింది. ఈ ఆకస్మిక పరిణామానికి హస్తినలో రాజకీయ పక్షాల వారు ఆశ్చర్యం చెందారు. ఇదే సందర్భంలో కాక్రోచ్‌జనతా పార్టీ, కాంగ్రెస్ తదితర మిత్రపక్షాల లక్ష్యాలు మారిపోవడం చర్చించదగినది. సిజెపి తమను రాజకీయ రొచ్చులోకి లాగొద్దని రాజకీయ పక్షాలను కోరుతోంది. సిజెపి విద్యార్థుల నిరసనకు మద్దతుగా 24రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్ చుక్ ఇంకా వైద్యసేవల్లోనే ఉన్నారు. అయినా సిజెపి తన పట్టు వీడడం లేదు. అలాగే ప్రధాని కూడా 'నీట్'విషయంలో అలా జరిగి ఉండకూడదని అంటూనే బాధ్యుల్ని నిర్ణయించడంలో కప్పదాటు వైఖరి అవలంబిస్తున్నారనే అపప్రథ పొందారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి ఉన్నట్లయితే సిజెపి ఆగ్రహం మొదట్లోనే చల్లారిపోయి ఉండేది. వారు జంతర్ మంతర్ వరకు వచ్చే అవకాశమే ఉండేది కాదు. ఈ ఉద్యమంలో కాంగ్రెస్ మిత్రపక్షాలు నిర్వహించే ఉద్యమం మరింత ముందుకు పోకుండా అక్కడే నిలబడి పోయి ఉండేది. కానీ పార్లమెంట్‌లో రచ్చరచ్చవుతోంది. లోక్‌సభ రాజ్యసభలో మూడో రోజు బుధవారం కూడాకాంగ్రెస్ తదితర విపక్షాల సభ్యులంతా నల్లదుస్తులు ధరించి వచ్చారు. ఇంతక్రితం మంగళవారం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతోబిజెపి మంత్రి జితేంద్ర సింగ్ భేటీ అయ్యారు. విషయాన్ని సంయమనంతో పరిశీలించాలని అనుకున్నారో ఏమో! కర్ర విరగకుండా, పాము చావకుండా సమస్యను ఒకొలిక్కి తీసుకురావాలన్న ప్రయత్నం జరిగింది. మరోపక్క కేంద్ర ప్రభుత్వంతో చర్చలకు సిజెపి అంగీకరించింది. ఈ చర్చల్లో ఎవరున్నా 'నీట్' గురించి ఏదైనా అడగండి, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తప్ప అనే ధోరణిలో ఉంటే సిజెపి ఉద్యమాన్ని ఆపలేరు. విద్యార్థులు,నిరుద్యోగులేఅత్యధిక మంది ఉన్న సిజెపి నిరసనలను ఆపకపోతే ఆ ఉద్యమం కేంద్ర ప్రభుత్వపాలనపై ప్రభావం చూపిస్తుంది. గతంలో ఉన్న అంశాలకు తోడు తాజాగా విద్యార్థులపైపోలీసుల లాఠీచార్జి కొత్తగా వచ్చి చేరింది. ఎన్నో దేశాల్లో 'జెన్‌జి' ఉద్యమాలు పెరిగిపోతున్న పరిస్థితులను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోకపోతే మరింత ఇరకాటంలో చిక్కుకుంటుంది. రాహుల్, జితేంద్ర సింగ్‌ల మధ్య భేటీలో'నీట్' పరీక్షల వైఫల్యాలపై సభలో చర్చించేందుకు అంగీకారం కుదిరినా కాంగ్రెస్ ఆ మాటకు కట్టుబడి ఉండలేదని బిజెపి ఆరోపిస్తోంది. ఇంతకూ ఎవరి పంతాలు వారివన్నట్లు ఉన్న ఈ వ్యవహారంలో సమస్యల ముడి వీడితేనే తప్ప పరిష్కారం దొరకదు. ప్రశ్నపత్రాల లీకేజీలు నివారించడంజాతీయ బాధ్యత అని చెబుతున్న ప్రధాని నిరసనలు చేపడుతున్న యువత డిమాండ్‌లపట్ల సానుకూల స్పందన వ్యక్తం చేయలేకపోయారు. పైగా పిల్ల ల్ని రెచ్చగొట్టవద్దని యువతను సరైన మార్గంలో నడిపించే అంశంలో సమాజం బాధ్యతాయుతంగా వ్యవహరించాలంటూ కాంగ్రెస్,తదితర పక్షాలకు హితవు చెప్పారు. అంతేతప్ప సిజెపి సమస్యను పరిష్కరించే బాధ్యత,అవకాశం తనకే ఉందన్న విషయాన్నిపక్కన పెట్టినట్లుంది. రాహుల్ గాంధీ అరెస్టు కాంగ్రెస్ శ్రేణుల్లో ఆగ్రహావేశాలు నింపింది. దేశవ్యాప్తంగా బిజెపి, కాంగ్రెస్ శ్రేణుల మధ్య దాడులు మొదలయ్యాయి. 'నీట్' పేపర్‌లీక్‌జీ అంశంపై విద్యార్థిల్లో గూడుకట్టుకున్న అసంతృప్తి నుంచి బయటవేసే బాధ్యత కేంద్ర ప్రభుత్వం చేతిలోనేఉంది. తక్షణమే ఈ సమస్య పరిష్కార దిశగా అడుగులు వేయాలి.

> చేయక తప్పని పనిలో కూడా జాప్యం చేస్తే కాలం ఆపనిని నిస్సారంగా మార్చి వేస్తుంది.
>
> 
>
> జె.ముర్రే

> దేవుడు మనకు రెండు చెవులు, రెండు కళ్లు, ఒక నాలుక ఇచ్చింది ఎక్కువ చూడమని, వినమని, తక్కువగా మాట్లాడమని.
>
> 
>
> జి. ఇలియెట్

## ప్రజావాక్కు



### జ్యోతిష్కులకు సవాల్..

జాతకాలు జ్యోతిష్యం చెప్తామనేవారిని నమ్మవద్దు. మోసం, అబద్ధం, బూటకం. జ్యోతిష్యం చెప్పడం మా తాత ముత్తాతలనుండి వారసత్వంగా వస్తుంది. మేము కొంద జాతివారము, మీజీవితాలను మారుస్తాము, మీ వివాహ సమస్యలు, ఆర్థిక సమస్యలు, కోర్టుసమస్యలు ఇట్టే తీరుస్తాము, దిష్టి నర దిష్టి లేకుండా చేస్తాము, దుష్టగ్రహ శక్తులనుండి రక్షిస్తాం,ఈ నంబరుకు ఫోన్ చేయండి, ముందుగా ఇంత డబ్బులు పంపండి, పని జరగక పోతే మీ డబ్బు వాపసు అంటూ టీవీలలో తెగ ప్రకటనలు వస్తున్నాయి. వీటిని అరికట్టవలసిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉన్నది. కానీ అవి ఆ పని చెయ్యటం లేదు. పైగా అరికట్టవలసిన వారేదొంగబాబాల చుట్టూ తిరుగుతున్నారు. మూఢ నమ్మకాలను పెంచీ పోషిస్తున్నారు. జ్యోతిష్యం అబద్ధం.మోసం,దగా,ప్రపంచంలో జ్యోతిష్యం నిజమని ఇంతవరకు ఋజువు కాలేదు. జ్యోతిష్యం నిజమని నిరూపిస్తే కోట్ల రూపాయలు బహుమతిగా ఇస్తామని హేతువాదులు ప్రపంచమంతా సవాళ్లు చేస్తున్నారు. ఒక జ్యోతిష్కుడి వలన 2001లో నేపాల్ రాజ కుటుంబం మొత్తం హత్యగావింపబడ్డారు.

\- నార్నెవెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ఎక్కడవేసిన గొంగళి అక్కడే..

కొన్ని గ్రామాల్లో పాలకవర్గం కొలువుదీరి ఏడు నెలలైనా ఎక్కడిగొంగడి అక్కడే వేసినట్లే ఉంది గ్రామాల్లో పరిస్థితి. ఎన్నికలప్పుడు పెద్ద పెద్ద హామీలిచ్చిన్న లీడర్లు అమలు చేయకుండా అటకెక్కించారు. వీళ్ల మీదా వాళ్ళు వాళ్ళ మీద వీళ్ళు మాయమాటలు చెప్పి అభివృద్ధి చేయకుండా అధోగతి పాలు చేస్తున్నారు. వీళ్లను ఎక్కడిక్కడ లెక్క లెక్కఅడిగి నిలదీస్తేనే అభివృద్ధి జరుగుతుంది. లేదంటే వీళ్ళునాటకాలు ఆడుతూనే ఉంటారు పదవీకాలం అంత.

\- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ఏపిలోని అన్ని జిల్లాల కేంద్రాల్లో ప్రజల ఫిర్యాదులు వివిధ శాఖలకుసంబంధించి ప్రత్యక్షంగా జిల్లా మేజిస్ట్రేట్ ,కలెక్టర్ వారు స్వీకరణ చేస్తూ వారికి రసీదు ఇవ్వడం ఎంతో తృప్తికరం. వారు సమస్య స్థితిని వ్యక్తంచేయడం కూడా కొంత ఉపశమనం ఉంటుంది. ఐతే ఫిర్యాదుల సంఖ్యాశాఖలవారీ ప్రకటనతోపాటు, దీర్ఘకాల సమస్యలకు పరిష్కారానికి హెచ్చు ప్రాధాన్యత ఉంటుంది.

\-బి. మేఘనాదం, విశాఖపట్నం

### పని లేని పథకం

వీబీజీరామ్‌జీలో ఎక్కువ పని దినాలు తప్ప కూలీలకు పని లేదు అని, కాంట్రాక్టర్స్ లూటీ ఉంటుందని ఒక విమర్శ ఉంది. దానికి ప్రభుత్వం చెప్పే సమాధానం ఏమిటి అంటే స్థిరమైన ఆస్తుల సృష్టి చేయడమే లక్ష్యం అని ప్రభుత్వం చెపుతుంది. ప్రభుత్వం పెంచిన 125 రోజుల లక్ష్యం చేరుకోగ లమా అనేది కొంత మంది అభివృద్ధి ఆధారిత ఆర్థిక వేత్తల మాట. వాళ్లవాదన నిజమే. ఎందుకంటే సగటు కూలీలకు పని దినాలు కల్పించడంలో చాలా రాష్ట్రాలు 40 నుండి 50 మధ్యనే కొట్టుమిట్టడుతూ ఉన్నాయి. పైపెచ్చు తెలంగాణ లాంటి రాష్ట్రాలలో వనమాహోత్సవం పేరుతో చెట్లను పెంచే బృహత్తార కార్యక్రమాలుపెడుతున్న నేపథ్యంలో గ్రామపంచాయితీలు తమ లక్ష్యాలు చేరుకోవడంలో మునుగా లాంటివి ఇతోధికంగా పనిచేస్తాయి. 60శాతం కూలికి 40శాతం గ్రామ పంచాయితీకి ఆదాయం సమాకోరుతుంది. అంటే మునుగా పెట్టె రైతు ఏడాది పొడుగునా తానుమాత్రమే లబ్ది పొందడం కాదు గ్రామపంచాయితీకి లబ్ది చేకూరుస్తున్నాడు అన్నమాట.

\- భారత అవినాష్, జనగామ

### అలవాట్లు మార్చుకోవాలి

ఆధునిక సమాజం ఎంతో పురోగమిస్తున్నకొద్దీ రోగాలు కూడా ముసురుకుంటున్నాయి. సామాన్యుడి నుండి కోటీశ్వరుడి వరకు జీవనశైలి వ్యాధుల బారిన పడుతున్నారు. పాతకాలం రోజులే బాగుండే అని తాత ముత్తాతలను గుర్తుచేసుకొంటున్నారు. కానీమారిన జీవన శైలిని మార్చుకొనేందుకు ఇష్టపడట్లేదు. మనం తినేఆహారం, తాగే పానీయాలు, శారీరక శ్రమ తగ్గడం, వాతావరణ కాలుష్యం, నీటి కాలుష్యం,ప్లాస్టిక్ భూతం, మద్యపానం ధూమపానం లాంటి వ్యసనాలు ఆరోగ్యాన్ని కాటేస్తున్నాయి. ఇలాంటి వ్యసనాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలి.

\- టి. మురళీ మోహన్, హైద్రాబాద్

### సాంకేతిక లోపం

మీసేవ మొబైల్ యాప్‌లోని టెంపుల్ ఆన్‌లైన్ సర్వీసెస్ విభాగంలో ఆన్‌లైన్ సేవలు ఓపెన్ కావడం లేదు. తరుచూ సాంకేతిక లోపాలు ఎదురవుతున్నాయి. ఈ ట్యాబ్ ద్వారా దేవాలయాలకు సంబంధించిన పూజావివరాలు, సేవల సమాచారం ప్రజలకు అందుబాటులో ఉండాల్సి ఉంది. కానీ ప్రస్తుతం ఈలోపం కారణంగా అనేకమంది భక్తులు, వినియోగదారులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు.

\- పి. రాజశేఖర్, నల్గొండ జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# వర్సిటీల చుట్టూ వివాదాలెందుకు?

**ప్రజా సంస్థలకు సంబంధించిన నిర్ణయాలు తక్షణ అవసరాల దృష్టితో మాత్రమే కాకుండా, దీర్ఘకాల సామాజిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని తీసుకోవాలి. నాంపల్లి ప్రాంగణాన్ని దాని విద్యా, పరిశోధనా, సాంస్కృతిక స్వరూపంతో పరి రక్షించడం. బాచుపల్లిని భవిష్యత్ విస్తరణకు, ప్రపంచ స్థాయి తెలుగు సాంస్కృతిక సముదాయంగా అభివృద్ధి చేయడం, పురావస్తు సంపదకు అత్యాధునిక సంరక్షణ, ప్రదర్శన వేదికలను కల్పించడం, అంకిత భావంతో కృషి చేస్తే ఈ మూడు లక్ష్యాలు ఒకేసారి సాధ్యమే. నిజానికి సురవరం ప్రతాప రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం విషయం లో తెలంగాణ ప్రభుత్వం ముందున్నది సమస్య కాదు. భవిష్యత్ తరాలను నిర్మించడానికి సమస్య రూపంలో ఎదురైన, సంస్కృతి, భాష, విద్యారంగాల పరిరక్షణకోసం ప్రణాళిక బద్ధంగా విధానపరమైన నిర్ణయం తీసుకుని మంచి పేరు తెచ్చుకునే చక్కటి అవకాశం.**



మల్లాది వేంకట గోపాలకృష్ణ

సమాజం తన భవిష్యత్తును నిర్మించుకోవడానికి రహదారులు, పరిశ్రమలేకాదు సాంకేతికత కూడా అవసరమే. అదే సమాజం తన అస్తిత్వాన్ని నిలబెట్టుకోవాలంటే జ్ఞానాన్ని, సంస్కృతిని, చరిత్రను తరతరాలకు అందించే బలమైన విద్యాసంస్థలు కూడా చాలా అవసరం. అందుకే ప్రపంచవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు కేవలం విద్యను బోధించే కేంద్రాలే కాదు అవి సమాజపు మేధో సంపదను, సాంస్కృతిక స్మృతిని, పరిశోధనా సంప్రదాయాలను సంరక్షించే సంస్థలుగా భావిస్తారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఒక సాధారణ విశ్వవిద్యాలయం కాదు. తెలుగు భాష, సాహిత్యం, సంగీతం, నృత్యం, జానపద సంప్రదాయాలు, శాసనాలు, ప్రాచీన గ్రంథాలు, భాషా పరిశోధన వంటి అనేక అంశాలను, రంగాలను ఒకే విద్యా వేదికపై సమన్వయం చేసిన అరుదైన సంస్థ. అందువల్ల నాంపల్లి ప్రాంగణంపై జరుగుతున్న చర్చను కేవలం 'స్థల వినియోగం' అనే కోణంలో చూడడం సరిపోదు. ఇది ఒక సాంస్కృతిక నిర్ణయం. అంతకంటే ముఖ్యంగా, భవిష్యత్ తరాల పట్ల మన బాధ్యతను నిర్వచించే నిర్ణయం. భాషలు కేవలం జన బాహుళ్యంలో ప్రచారంలో ఉండడం వల్ల మాత్రమే జీవించవు. వాటిని పరిశోధించే విశ్వవిద్యాలయాలు, ప్రచురించే ప్రచురణా కేంద్రాలు, భద్రపరిచే గ్రంథాలయాలు, అభ్యసించే విద్యార్థులు, బోధించే అధ్యాపకులు, ప్రోత్సహించే ప్రభుత్వాలు అన్నీ కలిసి విస్తృత స్థాయిలో కృషి చేసినప్పుడే ఒక భాష సజీవంగా ఉంటుంది. తెలుగు విశ్వవిద్యాలయం అలాంటి బాధ్యతను భుజంపై వేసుకుని సజావుగా, సక్రమంగా నిర్వహిస్తున్న సంస్థ. తెలుగు భాషకు సంబంధించిన జ్ఞానాన్ని సృష్టిస్తారు. సాహిత్యాన్ని విశ్లేషిస్తారు. కళలను సంరక్షిస్తారు. అంతరించిపోతున్న జానపద సంప్రదాయాలను నమోదు చేస్తారు. పరిశోధకులను తీర్చిదిద్దుతారు. భవిష్యత్ తరాలకు ఒక సాంస్కృతిక నిరంతరత్వాన్ని అందిస్తారు. అందుకే ఇటువంటి విశ్వవిద్యాలయాల గురించి తీసుకునే ప్రతి నిర్ణయం తక్షణ అవసరాలను మాత్రమే దృష్టిలో పెట్టుకుని కాకుండా, కనీసం మరో నూరు సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తీసుకోవాలి. కొన్ని ప్రదేశాలు కేవలం భౌగోళికపరమైన గుర్తింపులు కావు. అవి కొన్ని ఆలోచనలకు ప్రతీకలు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం నాంపల్లి ప్రాంగణం కూడా అలాంటి ప్రదేశమే. 1975లో జరిగిన తొలి ప్రపంచ తెలుగు మహాసభలు తెలుగు భాషకు ఒక శాశ్వత విద్యా, సాంస్కృతిక కేంద్రం అవసరమనే ఆలోచనకు బీజం వేశాయి.ఆ ఆలోచనకు రూపం దాల్చినప్రాంగణమే నాంపల్లి. తెలుగు భాష, సాహిత్యం,కళలు, సంస్కృతికి ఒక విశిష్ట విశ్వవిద్యాలయం ఉండాలన్న స్వర్గీయ నందమూరి తారక రామారావు దూరదృష్టికి ఇది ప్రతిరూపం. ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు తమ చరిత్రను కేవలం పుస్తకాలలోనే కాదు, తమ ప్రాంగణాల్లో కూడా సంరక్షించుకుంటాయి. ఎందుకంటే సంస్థాగత నిరంతరత్వం కూడా విద్యా నాణ్యతలో ఒక భాగమే. నాంపల్లి ప్రాంగణం విషయంలో కూడా ఇదే దృక్పథం చాలా అవసరం. ఉన్నత విద్యాసంస్థలను బలోపేతం చేయడం కూడా ప్రభుత్వ బాధ్యతే. ఈ రెండు లక్ష్యాలు పరస్పర విరుద్ధాలు కావు. ఆ రెండింటినీ సమన్వయం చేసే మార్గాన్ని అన్వేషించడం కూడా అదే దూరదృష్టిని ప్రదర్శించే అవకాశం ఉంది. ప్రజా జీవితంలో ప్రతి సమస్యకు రెండు రకాల పరిష్కారాలు ఉంటాయి. ఒకటి తక్షణ అవసరాన్ని తీర్చేది. మరొకటి భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని తీసుకునేది. మంచి పాలన రెండో మార్గాన్ని ఎంచుకుంటుంది. నాంపల్లి ప్రాంగణానికి సంబంధించిన అంశంలో కూడా అలాంటి దూరదృష్టి అవసరం. ఒకవైపు చారిత్రక పురావస్తువులు



మరోవైపు తెలుగు భాషా, సాంస్కృతిక అధ్యయనానికి అంకితమైన విశ్వవిద్యాలయం. ఈ రెండూ తెలంగాణ గర్వించదగ్గ సంపదలే. ఒకదానిని కాపాడాలంటే మరొకటి బలహీనపడాల్సిన అవసరం లేదు. ప్రజాసంస్థల నిర్వహణలో ఇదే ప్రాథమిక సూత్రం. పురావస్తువులు చరిత్రను భద్రపరుస్తాయి. విశ్వవిద్యాలయాలు ఆ చరిత్రకు అర్థం చెప్పే పరిశోధకులను తయారు చేస్తాయి. మ్యూజియంలు వారసత్వాన్ని ప్రదర్శిస్తాయి. విశ్వవిద్యాలయాలు ఆ వారసత్వాన్ని అధ్యయనం చేస్తాయి, కొత్త తరాలకు పరిచయం చేస్తాయి. అందువల్ల ఈ రెండింటి మధ్య సంఘర్షణ కాదు, సమన్వయం ఉండాలి. నిత్యం వేలాదిమంది విద్యార్థులు సమున్నతమైన విద్యను ఆర్జించే విద్యాలయాన్ని పురాతన వస్తువులను భద్రపరచే జీవం లేని సౌధంగా మార్చాలనుకోవడం పూర్తిగా పొరపాటు నిర్ణయమే అవుతుంది. అటువంటి నిర్ణయానికి తగిన మూల్యాన్ని ఏ ప్రభుత్వమైనా దీర్ఘకాలంలో చెల్లించుకుని తీరక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది.బాచుపల్లి ప్రాంగణం గురించి ఇప్పటివరకు ప్రధానంగా విశ్వవిద్యాలయ విస్తరణ కోణంలోనే చర్చ జరిగింది. కానీ తెలంగాణ ప్రభుత్వం మనసు పెట్టి చూస్తే దాన్ని తెలంగాణ సాంస్కృతిక భవిష్యత్తుకు ఒక విశాలమైన అవకాశంగా తోస్తుంది. తెలంగాణ ప్రభుత్వం తలచుకుంటే బాచుపల్లిలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఒక సమగ్ర తెలుగు సాంస్కృతిక ప్రాంగణాన్ని అభివృద్ధి చేసే అవకాశం ఉంది. ఆధునిక మ్యూజియం, డిజిటల్ హెరిటేజ్ ఆర్కైవ్, పురావస్తు పరిరక్షణ కేంద్రం, జానపద కళల గ్రామం, కళాకారుల శిక్షణా కేంద్రాలు, పరిశోధనా ప్రయోగశాలలు, విద్యార్థులు, పరిశోధకుల కోసం ఆధునిక అధ్యయన వేదికలు మొదలైన వాటన్నింటినీ ప్రభుత్వం పూనుకుని బాచుపల్లి ప్రాంగణంలో ఓ చక్కటి ప్రణాళికతో అభివృద్ధి చేస్తే, అది కేవలం తెలంగాణకే కాదు, దేశవ్యాప్తంగా ఒక ఆదర్శ సాంస్కృతిక నమూనాగా నిలిచే అవకాశం ఉంది. అలా చేస్తే నాంపల్లి తన చారిత్రక, విద్యా పాత్రను కొనసాగిస్తుంది. బాచుపల్లి భవిష్యత్ విస్తరణకు కేంద్రంగా ఎదుగుతుంది. రెండు ప్రాంగణాలూ పరస్పరం ఒకదానిని మరొకటి బలపరుస్తాయి.నాంపల్లి ప్రాంగణానికి సంబంధించిన నిర్ణయం ఈ తరం అవసరాలకే పరిమితం కాదు. ఇది రాబోయే దశాబ్దాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని తీసుకోవాల్సిన నిర్ణయం. తెలుగు భాషపై పరిశోధన మరింత విస్తరిస్తుంది.డిజిటల్‌ఆర్కైవింగ్కు కొత్త అవకాశాలు వస్తాయి. జానపద విజ్ఞానాన్ని భద్రపరచాల్సిన అవసరం పెరుగుతుంది. అంతర్జాతీయ స్థాయిలో తెలుగు అధ్యయనాలపై ఆసక్తి మరింత పెరగవచ్చు. ఈ అవసరాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుంటే, ఇప్పటికే ప్రజల విశ్వాసాన్ని సంపాదించిన ఒక చారిత్రక విద్యా ప్రాంగణాన్ని మరింత బలోపేతం చేయడమే దీర్ఘకాల ప్రజా ప్రయోజనానికి అనుకూలమైన నిర్ణయం. ఒక భాషకు, ఒక సంస్కృతికి, ఒక సమాజానికి నిరంతరత్వాన్ని అందించగల సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంపై జరిగే చర్చను ఒక స్థల వివాదంగా కుదించలేం. అది తెలంగాణ తన భాషా సాంస్కృతిక సంస్థల వల్ల ఎంత బాధ్యతతో వ్యవహరిస్తుందనే విషయానికి ఒక ప్రమాణంగా మిగిలిపోతుంది. నేటి నిర్ణయం ఏదైనా కళారూపాలను సంరక్షించే కళాకారుడిలపై ప్రభావం చూపుతుంది. భాషా అధ్యయనాన్ని ఎంచుకునే భావితరాలపై ప్రభావం చూపుతుంది. అందుకే ప్రజా సంస్థలకు సంబంధించిన నిర్ణయాలు తక్షణ అవసరాల దృష్టితో మాత్రమే కాకుండా, దీర్ఘకాల సామాజిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని తీసుకోవాలి. నాంపల్లి ప్రాంగణాన్ని దాని విద్యా, పరిశోధనా, సాంస్కృతిక స్వరూపంతో పరి రక్షించడం. బాచుపల్లిని భవిష్యత్ విస్తరణకు, ప్రపంచ స్థాయి తెలుగు సాంస్కృతిక సముదాయంగా అభివృద్ధి చేయడం, పురావస్తు సంపదకు అత్యాధునిక సంరక్షణ, ప్రదర్శన వేదికలను కల్పించడం, అంకిత భావంతో కృషి చేస్తే ఈ మూడు లక్ష్యాలు ఒకేసారి సాధ్యమే. నిజానికి సురవరం ప్రతాప రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం విషయంలో తెలంగాణ ప్రభుత్వం ముందున్నది సమస్య కాదు. భవిష్యత్ తరాలను నిర్మించడానికి సమస్య రూపంలో ఎదురైన, సంస్కృతి, భాష, విద్యారంగాల పరిరక్షణకోసం ప్రణాళిక బద్ధంగా విధానపరమైన నిర్ణయం తీసుకుని మంచి పేరు తెచ్చుకునే చక్కటి అవకాశం. •

# తగ్గుతున్న జననాలతో మారుతున్న జనాభా చిత్రం

సి.హెచ్. ప్రతాప్

భారత్ జనాభా నిర్మాణంలో నిశ్శబ్దంగా ఒక కీలక మార్పు చోటు చేసుకుంటోంది. ఒకవైపు మొత్తం సంతానోత్పత్తి రేటు (టోటల్ ఫెర్టిలిటీ రేట్ – టీఎఫ్ఆర్) తగ్గుతుండగా, మరోవైపు వృద్ధుల జనాభా క్రమంగా పెరుగుతోంది. ఈ రెండు పరిణామాలు భవిష్యత్ ఆర్థికవ్యవస్థ, ఆరోగ్యరంగం, సామాజిక భద్రతపై గణనీయ ప్రభావం చూపనున్నాయి. జనాభా పెరుగుదల మాత్రమే కాదు, జనాభా నాణ్యత, వయో నిర్మాణం కూడా అభివృద్ధికి కీలకమనే విషయాన్ని విధాన నిర్ణేతలు గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది. ఒక మహిళ తన జీవితకాలంలో సగటున ఎంతమంది పిల్లలకు జన్మనిస్తుందో తెలిపే సూచికనే మొత్తం సంతానోత్పత్తి రేటు (టోటల్ ఫెర్టిలిటీ రేట్ – టీఎఫ్ఆర్) అంటారు.సాధారణంగా 2.1ను ప్రత్యామ్నాయ జననాల రేటు (రిప్లేస్‌మెంట్ లెవెల్ ఫెర్టిలిటీ)గా పరిగణిస్తారు. ఈ స్థాయిలో జననాలు కొనసాగితే జనాభా దీర్ఘకాలంలో స్థిరంగా ఉంటుంది. అంతకంటే తక్కువగా ఉంటే భవిష్యత్‌లో యువజనాభా తగ్గేఅవకాశం ఉంటుంది. ఇటీవలి గణాంకాల ప్రకారం, భారత్‌లో 2019–21 నుంచి 2023–24 వరకు మొత్తం సంతానోత్పత్తి రేటు 2.0 వద్దే స్థిరంగా కొనసాగింది. ఇది ప్రత్యామ్నాయ స్థాయి కంటే తక్కువ. దాదాపు ప్రతి రాష్ట్రంలో టీఎఫ్ఆర్ తగ్గడం లేదా స్థిరంగా ఉండడం గమనార్హం. అయితే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, నాగాలాండ్ రాష్ట్రాల్లో మాత్రం స్వల్ప పెరుగుదల నమోదైంది. మరోవైపు బీహార్‌లో దేశంలోనే అత్యధిక టీఎఫ్ఆర్ 2.7గా ఉన్నప్పటికీ, గతంలో నమోదైన 3.0తో పోలిస్తే తగ్గుముఖం పట్టడం విశేషం. సంతానోత్పత్తి రేటు తగ్గడం అంటే కుటుంబ నియంత్రణ విజయవంతమైందనిమాత్రమే అర్థం కాదు. విద్యావకాశాల పెరుగుదల, మహిళలఉపాధి, పట్టణీకరణ, వివాహాల ఆలస్యం, జీవన వ్యయంపెరగడం వంటి అనేక సామాజిక ఆర్థిక అంశాలు దీనికి కారణమవుతున్నాయి. అయితే దీర్ఘకాలంలో యువ జనాభా తగ్గిపోవడం వల్ల శ్రామిక శక్తి క్షీణించే ప్రమాదం కూడా ఉంది. అదే సమయంలో భారత్‌లో వృద్ధుల జనాభా వేగంగా పెరుగుతోంది. అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలు,తూర్పు ఆసియా దేశాలు అధిక ఆదాయ స్థాయికి చేరుకున్న తర్వాత వృద్ధాప్య సమాజాలుగా మారాయి. కానీ భారత్‌మాత్రం దిగువమధ్య ఆదాయ దేశంగానే కొనసాగుతూనే వృద్ధాప్య సమాజం వైపు అడుగులు వేస్తోంది.ఇది దేశానికి కొత్తసవాలుగా మారనుంది. ప్రస్తుతం గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వృద్ధులకు అవసరమైన బహుళ వ్యాధులచికిత్సకు పూర్తిస్థాయిలో సిద్ధంగా లేవు. గుండె జబ్బులు, మధుమేహం, రక్తపోటు, కీళ్ల వ్యాధులు,మతిమరుపు వంటిసమస్యలు ఒకేసారి ఎదుర్కొనే వృద్ధులకు ప్రత్యేక జెరియాట్రిక్ కేర్ అవసరం.అధికశాతం వృద్ధులు ఇప్పటికీ స్వల్పమొత్తంలోని ప్రభుత్వ పింఛన్లపైనే ఆధారపడుతున్నారు. ఇదివారి ఆర్థిక భద్రతకు సరిపోదు.ఈ పరిస్థితులను దృష్టిలోఉంచుకుని ప్రభుత్వం సమగ్ర జనాభా విధానం రూపొందించాలి. ప్రతిజిల్లా ఆసుపత్రిలో ప్రత్యేక జెరియాట్రిక్ వార్డులు ఏర్పాటు చేయడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వృద్ధులకుఅనుకూల సేవలు విస్తరించడం,లాంగ్‌టర్మ్ కేర్ వ్యవస్థను అభివృద్ధి చేయడం అవసరం. సామాజిక భద్రతా పింఛన్లను పెంచడంతోపాటు, హెల్త్ ఇన్సూరెన్స్ పరిధిని విస్తరించాలి. యువతకు నైపుణ్యాభివృద్ధి, మహిళల ఉపాధి, కుటుంబాలకు శిశు సంరక్షణ సౌకర్యాలు కల్పించడం ద్వారా సమతుల్య జనాభా నిర్మాణాన్ని ప్రోత్సహించాలి. జనాభా మార్పులను కేవలం గణాంకాలుగా కాకుండా భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా చూడాలి. •

# ఇక కొత్త సంస్కరణలతో 'ఒసిఐ' కార్డులు!



యేచన్ చంద్ర శేఖర్

భారతదేశం 2005ఆగస్టులోపౌరసత్వ చట్టం 1955 సవరణ ద్వారా ఓవర్సీస్ సిటిజన్‌షిప్ ఆఫ్ ఇండియా (ఓసిఐ) పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ కార్యక్రమాన్ని 2006 జనవరిలో హైదరాబాద్‌లో జరిగిన ప్రవాస భారతీయ దివస్ సదస్సులో లాంఛనంగా ప్రారంభించారు.ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాస భారతీయుల నుండి 'ద్వంద్వ పౌరసత్వం'కోసం వస్తున్న నిరంతర డిమాండ్లను నెరవేర్చడానికి ఈ కార్డును ప్రవేశపెట్టారు. భారత రాజ్యాంగం ద్వంద్వ పౌరసత్వాన్ని ఖచ్చితంగా నిషేధించినందున, ఒక వారధిగా ఓసిఐని సృష్టించారు. ఇది భారతీయ సంతతికి చెందిన విదేశీయులకు (పిఐఐ పర్సన్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్) భారతదేశంలో నిరవధికంగా నివసించేందుకు, ఉపాధి పొందేందుకు హక్కును, జీవితకాల వీసాను అందిస్తుంది. కానీ అసలు భారతీయ పౌరసత్వం లేదా ఓటింగ్ హక్కులను మంజూరు చేయదు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 53లక్షల మంది నమోదిత ఓసిఐ కార్డుదారులున్నారు. వీరిలో అత్యధికులు భారతీయులు అధికంగా నివసించే అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, ఆస్ట్రేలియా కెనడాలలో ఉన్నారు. దరఖాస్తుదారు గతంలో భారత పౌరసత్వం కలిగి ఉన్నా, 1950 జనవరి 26 నాటికి భారతదేశ పౌరుడు లేదా పౌరురాలిగా మారడానికి అర్హత కలిగి ఉన్నా, లేదా అటువంటి అర్హత కలిగిన వ్యక్తి సంతానం, మనవలు లేదా మునిమనవలు అయి ఉన్నా, సాధారణంగా అటువంటి వ్యక్తులు ఓసిఐ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. అయితే, పాకిస్థాన్,బంగ్లాదేశ్ పౌరులు మాత్రం దీనికి అర్హులు కారు. ఓసిఐ కార్డుదారులకుప్రామాణిక వీసా అవసరం లేకుండా భారతదేశంలో పర్యటించడానికి నివసించడానికి బహుళప్రవేశ, జీవితకాల ప్రాప్యతను అందిస్తుంది. భారతదేశంలో ఎంత కాలం బస చేసినా ఫారిన్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ వద్ద నమోదు చేసుకోవలసిన అవసరం నుండి వీసాదారునికి మినహాయింపు లభిస్తుంది. దేశీయ విమాన ఛార్జీలుజాతీయ స్మారక చిహ్నాలలో సమాన ప్రవేశ రుసుములతో సహా, ప్రవాస భారతీయుల (ఎన్నారైల)తో సమానమైన ఆర్థిక, ద్రవ్య,విద్యా ప్రయోజనాలను ఓసిఐ కార్డుదారులకు అందిస్తుంది. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫేమా)ప్రకారం, ఓసిఐ కార్డుదారులు భారతదేశంలో వ్యవసాయ భూములు,తోటభూములు లేదా ఫామ్‌హౌస్‌లను చట్టబద్ధంగా కొనుగోలు చేయలేరు. అయితే, వీరు ఈ ఆస్తులను వారసత్వం ద్వారా లేదా భారతదేశంలో నివసిస్తున్న బంధువు నుండి బహుమతిగా పొందవచ్చు.అయితే, వాటిని మరొక ఓసిఐ కార్డుదారుకు గానీ లేదా విదేశీ జాతీయునికి గానీ అమ్మకూడదు. భారతదేశం ద్వంద్వ పౌరసత్వాన్ని అనుమతించదు కనుక ఓసిఐ కార్డు ద్వంద్వ పౌర





సత్వ అనుమతి పత్రం కాదు. ఓసిఐ కార్డుదారులు విదేశీ జాతీయులుగానే పరిగణించబడుతారు కనుక వారు భారత దేశ సందర్శనకు విధిగా తమ విదేశీ పాస్‌పోర్ట్‌ను ఉపయోగించాలి. భారత పౌరులకు రాజ్యాంగబద్ధంగా సంక్రమించే ఓటు హక్కు వీరికి ఉండదు. అంతేకాదు, వీరు ఎలాంటి ప్రభుత్వ పదవులు లేదా రాజ్యాంగ పదవులను (ఉదా., రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి లేదా న్యాయమూర్తి) చేపట్టలేరు. మిషనరీ, జర్నలిస్టిక్ లేదా పర్వతారోహణ కార్యకలాపాలు చేపట్టడానికి లేదా నోటిఫైడ్ పరిమిత/రక్షిత ప్రాంతాలను సందర్శించడానికి వీరు తప్పనిసరిగా అధికారిక ముందస్తు అనుమతి పొందాలి. ఈ కార్డు, అర్హులైన విదేశీ పౌరులు తమ ఓసిఐ వివరాలను తమ మొబైల్ ఫోన్లలో సురక్షితంగా నిల్వ చేసుకోవడానికి,ఇమ్మిగ్రేషన్ చెక్‌పాయింట్ల వద్ద తమ పాస్‌పోర్ట్‌తో పాటు వాటిని సమర్పించడానికి అనుమతిస్తుంది. ఈ వ్యవస్థ, కొత్త దరఖాస్తుదారులు ఇప్పటికే ఓసీఐ కార్డు పొందిన వారు ఇద్దరూ తమ డిజిటల్ కార్డులను ఆన్‌లైన్ ఓసీఐ సర్వీసెస్ పోర్టల్,ఇండియన్ వీసాను మొబైల్ యాప్ ద్వారా నేరుగా దరఖాస్తు చేసుకోవడానికి డౌన్‌లోడ్ చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది.ఇఓసిఐ పొందిన తర్వాత కూడా ఇప్పటికే ఉన్న భౌతిక ఓసీఐ కార్డులు చెల్లుబాటులో ఉంటాయి. అయితే, ఇఓసిఐ కార్డు పొందినప్పటికీ, విదేశీ విమానయాన సంస్థల సిబ్బందికి ఈ నూతన ప్రక్రియ పట్ల పూర్తి అవగాహన ఏర్పడే వరకు భారతదేశ పర్యటన సందర్భంగా ప్రతిసారి కూడా ఫిజికల్ బుక్‌లెట్‌ను తమతో ఉంచుకోవాలి. 20ఏళ్ల పైబడిన కార్డుదారులు ఓసిఐ పోర్టల్‌లో తమ కొత్త పాస్‌పోర్ట్ వివరాలను మాత్రమే నమోదు చేయవలసి ఉంటుంది. భౌతిక ఓసిఐ కార్డు జారీ సమయంతో పోలిస్తే ఇఓసిఐ కార్డు జారీసమయానికి చాలా తక్కువ సమయం పడుతుంది. సాధారణంగా భౌతిక ఓసిఐ కార్డు జారీకి 6 నుండి 8 వారాలు పట్టేదానితో పోలిస్తే, ఇఓసిఐ కార్డు 15 పనిదినాలలోనే వేగవంతంగా జారీ చేయబడుతుంది. ఇఓసిఐకి భౌతిక కార్డుతోపోలిస్తే,తక్కువ పత్రాలు అవసరమవుతాయి. అంతేకాదు, మొబైల్ ఫోన్లో డౌన్లోడ్ చేసుకునే వెసులుబాటు ఉండడంతో దీనిని ఎప్పుడైనా, ఎక్కడైనా అవసరమైనప్పుడు సంబంధిత అధికారులకు చూపించేందుకు ఎంతో అనుకూలంగా ఉంటుంది. భౌతిక ఓసిఐ కార్డును ఏ విధంగా పాడవకుండా సురక్షితంగా భద్రపర్చుకోవలసి ఉంటుంది. కానీ ఇఓసిఐ కార్డుతో ఇక అటువంటి బెంగ ఉండదు. ఆన్‌లైన్‌లో ఉండడంతో అది పూర్తిగా సురక్షితం.ఇఓసిఐ కార్డుతో భారతీయ విమానాశ్రయాలలో ఇమ్మిగ్రేషన్ ధృవీకరణ వేగవంతంగా పూర్తవుతుంది. భారత దేశ పౌరసత్వ (సవరణ) నిబంధనలు, 2026, ఓసిఐ దరఖాస్తు ప్రక్రియను డిజిటలైజ్ చేయడం ద్వారా దరఖాస్తులనుడూప్లికేట్‌లో (రెండుప్రతులు) సమర్పించాలనే మునుపటి నిబంధనను తొలగించింది. ఎవరైనా ఓసిఐకార్డు కలిగిన వ్యక్తి స్వచ్ఛందంగా తమ కార్డును రద్దు చేసుకోవాలనుకుంటే ప్రత్యేక ఓసిఐ పోర్టల్‌లో ఫారం ట్రిపుల్ ఎక్స్‌ని పూరించడం ద్వారా ఆన్‌లైన్‌లో సులభంగా రద్దు చేసుకోవచ్చు. ప్రస్తుతం ఉన్న భౌతిక ఓసిఐ కార్డులన్నీ చెల్లుబాటులోనే ఉంటాయి.కాబట్టి, తమ కార్డును ఇఓసిఐగా మార్చుకోవా ల్సిన అవసరంలేదు. చిరునామా, సంప్రదింపు నంబర్ లేదా ఇతర వివరాలలో మార్పుల కోసం తదుపరిసారి అప్‌డేట్ చేసినప్పుడు,సిస్టమ్ స్వయంచాలకంగా ఇఓసిఐని జారీ చేస్తుంది. •

# దేశంలో ముగిసిన ప్రజాస్వామ్యం



## పార్లమెంటులో, వీధుల్లో అన్నీ అప్రజాస్వామిక పరిస్థితులే

### విపక్ష ఎంపీలు నల్లజెండాలతో పార్లమెంటు వద్ద ఆందోళన

**న్యూఢిల్లీ:** విద్యార్థుల ఉద్యమానికి సంఘీభావంగా నల్ల దుస్తులు ధరించిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశంలో ప్రజాస్వామ్యం పూర్తిగా ముగిసిపోయిందని, పార్లమెంట్‌లోనూ, బయట వీధుల్లోనూ అప్రజాస్వామిక పరిస్థితులు నెలకొన్నాయని ఆమె ఆరోపించారు. బుధవారం పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడిన ప్రియాంక గాంధీ, యువత, విద్యార్థులకు సంబంధించిన అత్యంత కీలకమైన అంశాలపై చర్చ జరగకుండా ప్రభుత్వం పదేపదే అడ్డుకుంటోందని విమర్శించారు. ప్రతిపక్ష నేతలకు సభలో మాట్లాడే అవకాశమే ఇవ్వడం లేదని, ఇది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధికారిక నివాసం లోక్ కళ్యాణ్ మార్గ్ వద్ద మంగళవారం కాంగ్రెస్ చేపట్టిన నిరసనను ప్రస్తావిస్తూ, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత ముఖ్యమైనవని ప్రియాంక అన్నారు. శాంతియుత నిరసనలో ఎలాంటి అప్రజాస్వామికత లేదని, కానీ పార్లమెంట్‌లో జరుగుతున్న పరిణామాలు, వీధుల్లో నిరసనకారులపై వ్యవహరిస్తున్న తీరు మాత్రం పూర్తిగా అప్రజాస్వామికమని విమర్శించారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని, ఇతర ప్రతిపక్ష సభ్యులు లేచి మాట్లాడేందుకు ప్రయత్నించిన ప్రతిసారీ వారిని అడ్డుకుంటున్నారని ఆమె ఆరోపించారు. సభాపతికూడా చర్చ జరగాలంటే ముందుగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని చెప్పడం ఆశ్చర్యకరమని, "ఇదేనా ప్రజాస్వామ్యం? ప్రజాస్వామ్యం ముగిసిపోయింది" అని ప్రియాంక వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు ప్రదర్శించిన దౌర్జన్యాన్ని నిరసిస్తూ ప్రతిపక్ష ఎంపీలు బుధవారం నల్ల దుస్తులు ధరించి పార్లమెంట్ వెలుపల ఆందోళన చేపట్టారు. ఈ నిరసనలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు పలువురు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీల ఎంపీలు పాల్గొన్నారు. ప్రధానమంత్రి నివాసం వద్ద జరిగిన కాంగ్రెస్ నిరసన సందర్భంగా రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌తో పాటు పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయంపై స్పందించిన ప్రియాంక, తమను అరెస్ట్ చేయడం పెద్ద విషయం కాదని అన్నారు. "మేము విద్యార్థులకు అండగా నిలబడి వారి గొంతుకను వినిపిస్తున్నాం. అసలు ప్రశ్న ఏమిటంటే విద్యార్థులపై జరిగినది సరైందా కాదా అని ప్రశ్నించారు.

దేశంలోని ప్రతి తల్లిదండ్రి, ప్రతి విద్యార్థి, ప్రతి ఉపాధ్యాయుడు ఈ సమస్య ఎంత తీవ్రమైందో తెలుసునని ఆమె అన్నారు. విద్యార్థులు తమ హక్కులను మాత్రమే కోరుతున్నారని, ఎంతో కష్టపడి చదువుకుని భవిష్యత్తును నిర్మించుకోవాలనుకునే యువత భవిష్యత్తును ప్రభుత్వం నాశనం చేస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా కేంద్ర బడ్జెట్ కేటాయింపులపై కూడా ప్రియాంక విమర్శలు చేశారు. దేశ యువత విద్య కోసం కేవలం రూ.1.4 లక్షల కోట్లు మాత్రమే కేటాయిస్తున్న ప్రభుత్వం, అదానీ, అంబానీ సంస్థలకు రూ.16 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేస్తోందని ఆరోపించారు. రైతులకు, పేదలకు, విద్యార్థులకు ప్రభుత్వం ఎలాంటి న్యాయం చేయడం లేదని విమర్శించారు. మంగళవారం జరిగిన ఘటనలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ తదితరులు ప్రధానమంత్రి నివాసం వద్ద ఆకస్మిక ధర్నా చేపట్టి మోడీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అత్యంత భద్రత కలిగిన ప్రాంతంలో ఈ నిరసన జరగడంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి జితేంద్ర సింగ్, కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ నిరసనకారులను అక్కడి నుంచి వెళ్లిపోవాలని కోరినా వారు వెనక్కి తగ్గలేదు. దీంతో సాయంత్రం పోలీసులు బలవంతంగా రాహుల్ గాంధీతో పాటు పలువురు ప్రతిపక్ష నేతలను అదుపులోకి తీసుకున్నారు.

రాహుల్ గాంధీని మోడల్ టౌన్‌లోని ఛత్రసాల్ స్టేడియానికి తరలించగా, ప్రియాంక గాంధీతో పాటు మరికొందరు ఎంపీలను మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ వారిని పోలీస్ స్టేషన్‌లో కలిశారు. విద్యార్థులు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని, తమపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, తమపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారని రాహుల్ గాంధీ తెలిపారు. ఈ అంశం ప్రస్తుతం దేశంలో అత్యంత కీలకమైన సమస్యగా ప్రతిపక్షం భావిస్తోందని, అందుకే లోక్‌సభ, రాజ్యసభల్లో దీనిపై సమగ్ర చర్చ జరిపి తమ అభిప్రాయాలు వ్యక్తం చేసే అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.



బుధవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన శరద్ పవార్, సుప్రియా సూలే

# ప్రధాని మోడీతో పవార్, సుప్రియ భేటీ

## శరద్ ఎన్సీపి ఎన్డీయేలో చేరేందుకు రంగం సిద్ధం?

**న్యూఢిల్లీ,జులై 22:** ఒకవైపు నీట్ లీకేజీతో పాటు పలు అంశాలపై పార్లమెంట్ వెలుపల విపక్ష ఎంపీలు తీవ్ర స్థాయిలో నిరసనలు, నినాదాలతో హోరెత్తిస్తుంటే మరోవైపు ప్రధాని కార్యాలయంలో జరిగిన ఒక కీలక భేటీ దేశ రాజకీయాల్లో పెను దుమారాన్ని రేపుతోంది. ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్, ఆయన కుమార్తె సుప్రియా సూలేలు ప్రధాని నరేంద్ర మోడీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోల్లో ప్రధాని మోడీ స్వయంగా శరద్ పవార్‌ను చిరునవ్వుతో చేతిని పట్టుకుని ఆహ్వానించడం, ఇద్దరు నాయకులు ఎంతోసంతోషంగా నవ్వుకుంటూ చర్చించుకోవడం కనిపించింది. రైతుల సమస్యలు, నీటిపారుదల రంగానికి సంబంధించిన పలు అంశాలపై పవార్ ప్రధానికి వినతిపత్రం సమర్పించినట్లు సమాచారం. ప్రస్తుత పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం మూడింట రెండొంతుల మెజారిటీ కోసం ప్రయత్నాలు చేస్తోంది. ఈ సమయంలో 8 మంది ఎంపీలు ఉన్న శరద్ పవార్ పార్టీ మద్దతు ప్రభుత్వానికి చాలా కీలకంగా మారింది. దేశవ్యాప్తంగా 50 శాతం సీట్ల పెంపుపై ప్రభుత్వం లిఖిత పూర్వక హామీ ఇస్తే ఈ బిల్లుకు మద్దతు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని ఇటీవలే సుప్రియా సూలే సంకేతాలు ఇచ్చారు. ఈ పరిణామాల మధ్య శరద్ పవార్ పార్టీ ఎన్డీఎ కూటమిలో చేరుతుందనే ఊహాగానాలు కూడా మొదలయ్యాయి. మహారాష్ట్రలోని రెండు ఎన్సీపీ వర్గాలు (అజిత్ పవార్, శరద్ పవార్ వర్గాలు) మళ్లీ విలీనమైతేనే ఎన్డీఎలో అధికారికంగా భాగస్వామ్యం కల్పిస్తామని, వ్యక్తిగతంగా లేదా విడివిడిగా చేర్చుకునే ఉద్దేశం లేదని బిజెపి స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. విపక్ష ఇండియా కూటమి కేంద్ర ప్రభుత్వంపై విమర్శల దాడిని తీవ్రతరం చేసిన సమయంలోనే, ఆ కూటమిలోని కీలక నేత శరద్ పవార్ ప్రధానితో భేటీ కావడం చర్చనీయాంశంగా మారింది.

## నల్లదుస్తులతో పార్లమెంటుకు

# ఇండియా కూటమి ఎంపిలు

**న్యూఢిల్లీ,జులై 22:** ప్రధాని అధికారిక నివాసం వద్ద మంగళవారం జరిగిన హైడ్రామా తర్వాత రెండోరోజు బుధవారం కూడా ఇండియా కూటమి ఎంపీలు తమ నిరసనను తీవ్రతరం చేశారు. పోలీసుల దౌర్జన్యానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతూ ఎంపీలందరూ నల్ల దుస్తులు ధరించి పార్లమెంట్‌కు చేరుకున్నారు. పార్లమెంట్ వెలుపల గుమిగూడిన విపక్ష నేతలు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిన చలో సంసద్ మార్చ్‌కు మద్దతుగా నిన్న విపక్షాలు ఆందోళన చేపట్టాయి. ఈ క్రమంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ సహా పలువురు ఇండియా కూటమి నేతలు ప్రధాని నివాసం వద్ద నిరసనకు యత్నించారు. పోలీసులు వారిని బలవంతంగా అదుపులోకి తీసుకుని వ్యాన్లు, బస్సుల్లో తరలించారు. ఈ ఘటన రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది.

ఈ అరెస్టులు, పోలీసుల తీరును తీవ్రంగా ఖండిస్తూ విపక్ష ఎంపీలు నేడు నల్ల దుస్తుల్లో పార్లమెంట్‌కు వచ్చారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ సహా పలు పార్టీల ఎంపీలు మకర ద్వార్ వద్ద నిలబడి ప్రభుత్వ వైఖరిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ మాట్లాడుతూ నిన్న ప్రతిపక్ష నేతను సిగ్గులేకుండా అరెస్ట్ చేసి, గాయపరిచిన తీరు దారుణం. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతోందని చెప్పడానికి ఇదే నిదర్శనం. రాజ్యాంగం ఉనికిలో లేదు. ఈ ప్రభుత్వంతో శాంతియుతంగా పోరాడటమే మా ముందున్న ఏకైక మార్గమని తీవ్రంగా విమర్శించారు.

## నిరాహార దీక్ష విరమించండి

### వాంగ్‌చుక్‌కు సిజెపి విజ్ఞప్తి

### ఆస్పత్రిలో విపక్ష ఎంపిల పరామర్శ

**న్యూఢిల్లీ, జులై 22:** పరీక్షల గందరగోళానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సిజెపిచేస్తున్న నిరసనకు బలాన్నిచ్చిన సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్షను విరమించాలని బొద్దింక జనతా పార్టీ విజ్ఞప్తి చేసింది. "సోనమ్‌సార్‌కు సిజెపి విజ్ఞప్తి అని 'ఎక్స్'లో ఒక పోస్ట్‌లో సిజెపి పేర్కొంది. "అత్యంతగౌరవంతో, కృతజ్ఞతతో, దయచేసి మీ నిరాహార దీక్షను విరమించాలని తాము మిమ్మల్ని కోరుతున్నాము. మీ త్యాగం దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులకు స్ఫూర్తినిచ్చింది. జులై 20న, యువత మీకు, ఈ ఉద్యమానికి మద్దతుగా నిలిచేందుకు వివిధ రాష్ట్రాల నుంచి ప్రయాణించి వచ్చారు. ఈ పోరాటం ఏ ఒక్క వ్యక్తి కన్నా గొప్పదని, విద్యార్థులు న్యాయానికి అర్హులని మీరు నిరూపించారు. కానీ ప్రస్తుతం, మీరు మీ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి. మీ నిరాహార దీక్షతో ఈ పోరాటం ముగిసిపోదని మేము వాగ్దానం చేస్తున్నాము. పరీక్షల న్యాయం కోసం మాడిమాండ్లు నెరవేరే వరకు తాము నిరసనలను కొనసాగిస్తాము, ఈ పోరాటాన్ని ముందుకు తీసుకువెళ్తాము. దీనిని కొనసాగించడానికి తాము చేయగలిగినదంతా చేస్తాము. తాము ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్తాము" అని సిజెపి శపథం చేసింది.

**విపక్ష ఎంపిలు పరామర్శ**

గురుగ్రామ్‌లోని మెదాంత ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వాంగ్‌చుక్‌ను విపక్ష ఎంపిలు పరామర్శించారు. వాంగ్‌చుక్‌ను కలిసిన వారిలో కాంగ్రెస్ రాజ్యసభ ఎంపి వివేక్ తంఖా, టిఎంసి రాజ్యసభ ఎంపి సాగరిక ఘోష్, సిపిఎం రాజ్యసభ ఎంపి జాన్ బ్రిట్టాస్ ఉన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో విద్యా రంగంలో జవాబుదారీతనం అంశాన్ని చేపడతామని ఎంపిలు ఈ సందర్భంగా వాంగ్‌చుక్‌కు హామీనిచ్చాయి.

## దేశానికి మీరు ఎంతో అవసరం..

# దీక్ష విరమించండి



### వాంగ్‌ఛుక్‌ను కలిసిన అభిజిత్ దీప్కే

**న్యూఢిల్లీ,జులై 22:** ఆమరణ నిరాహార దీక్ష కొనసాగిస్తున్న పర్యావరణ వేత్త సోనమ్ వాంగ్‌చుక్‌ను దీక్ష విరమించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే. ఈ మేరకు బుధవారం తన సోషల్ మీడియా వేదికగా ప్రకటన విడుదల చేశారు. దేశానికి సోనమ్ వాంగ్‌చుక్ అవసమరమని, అందువల్ల ఆయన దీక్ష విరమించాలని కోరారు. ఆయన ఆరోగ్యం ఇంకా క్షీణిస్తుండటంపై అభిజీత్ ఆందోళన వ్యక్తంచేశారు. సోనమ్ వాంగ్‌చుక్ తన ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, దీక్ష విరమించాలని కోరారు. దేశానికి ఆయన అవసరం ఉందన్నారు. ఇదే సమయంలో తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు జంతర్‌మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన కొనసాగిస్తామన్నారు. సోనమ్ వాంగ్‌చుక్ ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించిన తర్వాత ఆయన దీక్ష విరమించాలని అభిజీత్ దీప్కే కోరడం ఇదే మొదటిసారి. సోనమ్ ఆరోగ్యాన్ని ఇంకా ప్రమాదంలోకి నెట్టడం తమకు ఇష్టం లేదన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ దాదాపు 24 రోజులుగా వాంగ్‌చుక్ నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు.

ఆయనను ఆస్పత్రికి తరలించినప్పటికీ అక్కడ కూడా దీక్ష చేస్తున్నారు. దీంతో ఆయన ఆరోగ్యం క్షీణిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు నీట్ పేపర్ లీకేజ్, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వంటి అంశాల్లో సిజెపితో చర్చలకు కేంద్రం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి జేపీ నడ్డా కూడా తెలిపారు. ఈ విషయంలో సిజెపి నేతలకు మద్దతు లభిస్తోంది. అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు ఉద్యమకారులు కూడా చర్చలకు సిద్ధంగానే ఉన్నారు.

# ఆడబిడ్డల బట్టలు చించేస్తారా!

### లోక్‌సభలో ఎంపి అఖిలేష్ యాదవ్ ఫైర్



**న్యూఢిల్లీ,జులై 22:** నీట్ పరీక్ష పత్రాల లీకేజీ వ్యవహారంపై లోక్‌సభలో జరిగిన చర్చ సందర్భంగా సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ కేంద్ర ప్రభుత్వ వైఖరిని తప్పుపట్టి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల అంశం కాంగ్రెస్, బిజెపి లేదా సమాజ్ వాదీ పార్టీ ఇళ్లకు పరిమితమైనది కాదని, దేశంలోని కోట్లమంది విద్యార్థులు, యువత భవిష్యత్తుకు సంబంధించినదని ఆయన స్పష్టం చేశారు. పేపర్ లీకేజీలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని అఖిలేష్ డిమాండ్ చేశారు. సభలో ప్రతిపక్షాల గొంతుకను సరిగ్గా వినకపోతే, రోడ్లపైకి వచ్చి పోరాడటంతప్ప మరోమార్గం ఉండదని హెచ్చరించారు. నిరసనకారులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం, మహిళా విద్యార్థినులను ఈడ్చుకెళ్లడం వంటి అమానవీయ చర్యలకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీరును ఆయన ఎండగట్టారు. విద్యార్థుల కోసం తామందరం పోరాడుతున్నామని, వాళ్ల సమస్యలు వినకపోతే ఇలాంటి పరిణామాలే సంభవిస్తాయని అఖిలేష్ పేర్కొన్నారు. లాఠీఛార్జీ చేయడాన్ని తప్పుపట్టారాయాన. తమ గొంతుకను వినిపించడానికి రోడ్డెక్కిన విద్యార్థుల కాళ్లు చేతులు విరగ్గొట్టారని, తలలు పగులగొట్టారని గుర్తు చేశారు. ఆడపిల్లల బట్టలు చింపారని ఆవేదన వ్యక్తం చేశారు. అలా మీరు చేస్తారా అని స్పీకర్ ను ఉద్దేశించి నిలదీశారు. గత్యంతరం లేని పరిస్థితుల్లోనే తాము లోక్‌కల్యాణ్ మార్గ్ వద్ద బైఠాయించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అదే సమయంలో కాంగ్రెస్ సభ్యుడు కెసి వేణుగోపాల్‌కు ఎక్కువ సమయం పాటు మాట్లాడే అవకాశం ఇవ్వడం పట్ల అఖిలేష్ యాదవ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సభ్యులు కూర్చున్న వైపు వేలెత్తి చూపుతూ వారితో ఏవైనా లోపాయకారి ఒప్పందాలు కుదుర్చుకున్నారా అని స్పీకర్‌ను ప్రశ్నించారు. తమకు అవకాశం ఇవ్వాలంటూ పదే పదే అడుగుతున్నప్పటికీ పట్టించుకోకుండా కాంగ్రెస్ ఎంపిలతో మాట్లాడించడం సమంజసం కాదని చెప్పారు.

## జడ్జిల రిటైర్మెంట్ వయసు

# 61యేళ్లకు పెంపు

### ఈ విషయాన్ని పరిశీలించండి: రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కోరిన సుప్రీం కోర్టు



**న్యూఢిల్లీ, జులై 22:** న్యాయాధికారుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 61 యేళ్లకు పెంచే విషయాన్ని పరిశీలించాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను సుప్రీంకోర్టు కోరింది. దేశవ్యాప్తంగా జిల్లా న్యాయాధికారుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 యేళ్లకు ఏకరీతిగా పెంచాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై బుధవారం విచారణ జరుపుతూ, భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, జస్టిస్‌లు జయమాల్య బాగ్చి, వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాన్ని జారీ చేసింది. "అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలు (యుటిలు), తమ తమ అధికార పరిధిలోని హైకోర్టులతో సంప్రదించి ఈ విషయంపై ఒకనిర్ణయం తీసుకోవాలని ఆదేశిస్తున్నాము. ఒకవేళ వారు అంగీకరిస్తే, ఆ రాష్ట్రాల్లోని న్యాయాధికారులు 61 యేళ్ల వయస్సు వరకు సర్వీసులో కొనసాగడానికి అనుమతించబడతారు. అటువంటి కొనసాగింపు ఈ విచారణల తుది ఫలితానికి లోబడి ఉంటుంది" అని ధర్మాసనం ఆదేశించింది.

ఈ నిబంధన ఏప్రిల్ 1, 2026 నుంచి అమల్లోకి వస్తుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పదవీ విరమణ వయస్సు 65యేళ్లు కాగా, హైకోర్టు న్యాయమూర్తులు 62 యేళ్ల వయస్సులో పదవీ విరమణ చేస్తారు. దేశవ్యాప్తంగా జిల్లా న్యాయాధికారుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 యేళ్లకు ఏకరీతిగా పెంచాలా వద్దా అనే ప్రధాన న్యాయపరమైన ప్రశ్నపై తుది తీర్పునకు ఈ మధ్యంతర ఏర్పాటు ఆటంకం కలిగించదని కూడా అది పేర్కొంది. "రాష్ట్రాలు లేదా హైకోర్టులు ఏ వైఖరి తీసుకున్నప్పటికీ, ప్రారంభంలోనే రూపొందించిన ఈ న్యాయపరమైన ప్రశ్నను ఈ కోర్టు స్వతంత్రంగా నిర్ణయిస్తుందని తాము స్పష్టం చేస్తున్నాము" అని ధర్మాసనం తెలిపింది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ తమ హైకోర్టులను సంప్రదించిన అనంతరం, రెండు వారాల్లోగా తమ వాదనను రికార్డు చేయాలని ఆదేశించింది.

# ఇరాన్‌పై యుద్ధానికి అమెరికా రూ.3.6 లక్షలకోట్లు వ్యయం

### ప్రతినిధుల సభలో రక్షణమంత్రి పీట్ హెగ్సెత్ నివేదిక



**వాషింగ్టన్, జులై 22:** ఇరాన్‌తో కొనసాగుతున్న సైనిక చర్యల కోసం అమెరికాకు అక్షరాలా 37.5 బిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ. 3.6 లక్షల కోట్లు ఖర్చయిందని అమెరికా రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్‌సెత్ వెల్లడించారు. యుద్ధాన్ని కొనసాగించేందుకు, క్షీణిస్తున్న వనరులను తిరిగి సమకూర్చుకునేందుకు మరిన్ని అత్యవసర నిధులు కావాలని ట్రంప్ ప్రభుత్వం కోరుతున్న నేపథ్యంలో ఆయన ఈ వివరాలను చట్టసభ సభ్యులకు అందించారు. సెనేట్ అప్రాప్రియేషన్స్ కమిటీ ఎదుట జరిగిన విచారణలో హెగ్‌సెత్ ఈ నూతన అంచనాలను తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ 30తో ముగియనున్న నేపథ్యంలో ఆలోపు అయ్యే ఖర్చులనుకూడా కలుపుకుని ఈ అంచనాను రూపొందించారు. గతంలో మే, జూన్ నెలల్లో ఈ వ్యయం సుమారు 29 నుంచి 30 బిలియన్ డాలర్లుగా ఉంటుందని అంచనా వేయగా, ప్రస్తుతం ఆ సంఖ్య గణనీయంగా పెరిగింది. యుద్ధ కార్యకలాపాల కోసం సుమారు 67బిలియన్ డాలర్ల అదనపురక్షణ నిధులను కేటాయించాలని జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్ జనరల్ డాన్ కెయిన్‌తో కలిసి హెగ్‌సెత్ సెనేట్‌ను అభ్యర్థించారు. ఈ ఏడాది ఫిబ్రవరి చివర్లో అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో మొదలైన ఈఘర్షణ, ఈ నెల ప్రారంభంలో కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ విఫలం కావడంతో మళ్లీ తీవ్రరూపం దాల్చింది. ప్రస్తుతం ఇరుపక్షాల మధ్య ప్రతిరోజూ దాడులు, ప్రతిదాడులు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హార్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టును బలహీనపరిచే లక్ష్యంగా అమెరికా దాడులు సాగుతున్నాయి. ఈ జలసంధిలో ఏర్పడిన అంతరాయాలు అమెరికాలో గ్యాస్ ధరల పెరుగుదలకు కారణమయ్యాయి. ఈ ఘర్షణలో ఇప్పటివరకు 17 నుంచి 18 మంది అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పోయారని, వంద మందికి పైగా గాయపడ్డారని పెంటగాన్ వెల్లడించింది. గాయపడినవారిలో చాలామంది తిరిగి విధుల్లో చేరినట్లు అధికారులు తెలిపారు. యుద్ధ వ్యూహం, కాలపరిమితిపై స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదని ఇరు పార్టీల చట్టసభ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా మధ్యంతర ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ యుద్ధం వల్ల కలుగుతున్న ఆర్థిక, మానవ నష్టాన్ని డెమొక్రాట్లు ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. అత్యవసర నిధులు వెంటనే మంజూరు చేయకపోతే, సైనిక శిక్షణను తగ్గించాల్సి వస్తుందని, పరికరాల నిర్వహణ దెబ్బతిని దేశ రక్షణ సంసిద్ధతపై ప్రభావం పడుతుందని హెగ్‌సెత్ హెచ్చరించారు.

# సంక్షిప్త వార్తలు

## టిఎంసి ఎంపి కల్యాణ్‌బెనర్జీ లోక్‌సభనుంచి సస్పెన్షన్



**న్యూఢిల్లీ,జులై 22:** లోక్‌సభ సమావేశాల సందర్భంగా మహిళా ఎంపీలపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న కారణంతో టిఎంసి పార్టీ ఎంపీ కల్యాణ్ బెనర్జీపై సస్పెన్షన్ వేటుపడింది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రస్తుత పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ముగిసే వరకు సభ నుంచి కల్యాణ్ బెనర్జీని సస్పెండ్ చేశారు. బుధవారం మధ్యాహ్నం ప్రతిపక్షాల నిరసనల నడుమ సభ వాయిదా పడిన తర్వాత టిఎంసి ఎంపీ కల్యాణ్ బెనర్జీకి.. మాజీ టిఎంసి సభ్యులు కకోలి ఘోష్ దస్తీదార్, శతాబ్ది రాయ్, మితాలి బాగ్ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా కల్యాణ్ బెనర్జీ తమను ఉద్దేశించి అసభ్యకరమైన భాష వాడారని, దూషించారని ఆరోపిస్తూ సదరు మహిళా ఎంపీలు లోక్‌సభ స్పీకర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

## సాయుధబలగాల్లో అగ్నివీర్‌లకు 50% రిజర్వేషన్

**న్యూఢిల్లీ,జులై 22:** కేంద్ర సాయుధ బలగాల్లోకి మాజీ అగ్నివీరులను పరీక్ష లేకుండానే తీసుకోవాలని, 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర హోం శాఖ నిర్ణయించింది. సాధారణంగా బలగాల్లోకి ఎంపిక కోసం నిర్వహించే ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ వంటి పరీక్షలు వీరు రాయాల్సిన అవసరం లేదు. ఇప్పటివరకు ఉన్న 10 శాతం ఉన్న రిజర్వేషన్ 50 శాతానికి పెంచడం విశేషం. నాలుగేండ్ల పదవీకాలం పూర్తయ్యాక అగ్నిపథ్ పథకం నుంచి బయటకు వచ్చే సైనికులకు మరొకసారి సాయుధ బలగాల్లో ఉపాధి లభించనుంది.

## నెతన్యాహు అరెస్టుపై వెనక్కి తగ్గిన మమ్‌దానీ


**న్యూయార్కు, జులై 22:** ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు న్యూయార్క్ వస్తే అంతర్జాతీయ నేర న్యాయస్థానం (ఐసిసి) వారెంట్ ఆధారంగా అరెస్ట్ చేస్తానన్న ఎన్నికల హామీ నుంచి న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మామ్దానీ వెనక్కి తగ్గారు. నగర పరిపాలనా రంగానికి అటువంటి అరెస్టులు చేసే స్వతంత్ర చట్టపరమైన అధికారం లేదని న్యాయ సమీక్షలో తేలడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు.

## సౌదీ అణు ఒప్పందానికి ట్రంప్ ఆమోదం



**వాషింగ్టన్, జులై 22:** పశ్చిమాసియాలో కీలక పరిణామం చోటు చేసుకుంది. సౌదీ అరేబియాతో అత్యంత ప్రాధాన్యమున్న 30 యేళ్ల పౌర అణు ఒప్పందానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారికంగా ఆమోదంతెలిపారు. ఈచారిత్రక ఒప్పందం ద్వారా సౌదీ అరేబియా భూభాగంలోనే యూరేనియం శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసే అవకాశం లభిస్తుంది. వాషింగ్టన్, రియాద్ సంయుక్తంగా నిర్వహించే అధ్యయనంలో సాధ్యమేనని తేలితే, అమెరికన్ కంపెనీలు ఈ శుద్ధి కేంద్రాన్ని నిర్మిస్తాయి. తద్వారా విదేశీ పోటీదారులను పక్కనపెట్టి, సౌదీ అణు మౌలిక సదుపాయాల నిర్మాణంలో అమెరికా సంస్థలు పదిలమైన స్థానాన్ని దక్కించుకోవడమే కాకుండా వేల కోట్ల డాలర్ల వ్యాపార ఒప్పందాలను పొందుతాయి.

## ఉగ్రకాల్పుల్లో జవాను మృతి, మరొకరికి తీవ్రగాయాలు



**శ్రీనగర్,జులై 22:** జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఒక జవాన్ మరణించగా, మరొకరు గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం, జమ్మూ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్-కోకెర్‌నాగ్ రోడ్డు మార్గంలో జరిగింది. స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ (ఎస్‌ఓజి)కి చెందిన ఇద్దరు జవాన్లు బుధవారం ఉదయం అనంత్‌నాగ్-కోకెర్‌నాగ్ రోడ్డులో విధులు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో అక్కడికి వచ్చిన తీవ్రవాదులు ఈ జవాన్లపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్పందించిన ఇతర భద్రతా సిబ్బంది వెంటనే వారిని చికిత్స కోసం స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఆ ఇద్దరిలో తీవ్ర గాయాల కారణంగా ఒక జవాన్ అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు.

# అంతర్జాతీయ మహిళా క్రికెట్‌లో ఆణిముత్యం నల్లపురెడ్డి శ్రీచరణి

## ఎపి జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ నాగలక్ష్మి


టీమిండియా మహిళా క్రికెటర్ నల్లపురెడ్డి శ్రీచరణి సత్కరిస్తున్న జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ నాగలక్ష్మి

**విజయవాడ, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ రంగ ఉద్యోగుల కుటుంబాల నుంచి భారత క్రికెట్‌కు ప్రాతినిధ్యం వహించిన ప్రతిభావంతులైన క్రీడాకారులు రావడం మొత్తం విద్యుత్ కుటుంబానికే గర్వకారణమని ఆంధ్ర ప్రదేశ్ విద్యుత్ ఉత్పత్తి సంస్థ (ఎపి జెన్‌కో) మేనేజింగ్ డైరెక్టర్ నాగలక్ష్మి, పేర్కొన్నారు. ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డు (ఎపి ఎస్ఇబి)లో ఉద్యోగిగా పనిచేసిన మొహ్మద్ అజీజిద్దీన్ కుమారుడిగా భారత పురుషుల క్రికెట్ జట్టుకు నాయకత్వం వహించిన మాజీ కెప్టెన్ మొహమ్మద్ అజారుద్దీన్ దేశానికి విశిష్ట సేవలు అందించా రన్నారు. నేడు రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్‌టిపిపి) ఉద్యోగి చంద్రశేఖర్ రెడ్డి కుమార్తె నల్లపురెడ్డి శ్రీచరణి భారత మహిళల క్రికెట్ జట్టులో స్థానం సంపాదించి దేశం తరఫున రాణించడం విద్యుత్ రంగ చరిత్రలో మరో గర్వించదగ్గ విషయం అని ఆమె అన్నారు. బుధవారం విజయవాడలోని విద్యుత్ సౌధలో ఎపి జెన్‌కో ఆధ్వర్యంలో భారత మహిళల క్రికెట్ జట్టు సభ్యురాలు నల్లపు రెడ్డి శ్రీచరణికి ఘన సన్మాన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లా డుతూ, భారత పురుషుల జట్టులో మొహమ్మద్ అజారుద్దీన్, మహిళల జట్టులో నల్లపురెడ్డి శ్రీచరణి వంటి క్రీడాకా రులు విద్యుత్ రంగ ఉద్యోగుల కుటుంబాల నుంచి దేశానికి ప్రాతి నిధ్యం వహించడం ప్రతి విద్యుత్ ఉద్యోగికి స్ఫూర్తిదాయకమని అన్నారు. విద్యుత్ రంగ ఉద్యోగుల కుటుంబాల నుంచి భారత క్రికెట్‌కు ఇద్దరు అంతర్జాతీయ క్రీడాకారులు రావడం విద్యుత్ శాఖకు విశేష గౌరవాన్ని తీసుకువచ్చిందని ఆమె పేర్కొన్నారు. వైఎస్సార్ కడప జిల్లా నుంచి భారత మహిళల క్రికెట్ జట్టుకు ఎంపికైన తొలి మహిళా క్రికెటర్లలో ఒకరిగా నిలిచిన శ్రీచరణి, గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా కృషి, పట్టుదల, ప్రతిభ ఉంటే అంతర్జాతీయ స్థాయికి చేరుకోవచ్చని యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొ న్నారు. విద్యుత్ రంగ ఉద్యోగుల కుటుంబాల్లోని పిల్లలు విద్య, క్రీడలు, ఇతర రంగాల్లో మరెన్నో ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ, నల్లపురెడ్డి శ్రీచరణి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి భారతదేశానికి, ఆంధ్ర ప్రదేశ్‌కు, విద్యుత్ కుటుంబానికి మరింత కీర్తి తీసుకురావాలని జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ నాగలక్ష్మి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శ్రీ చరణి మాట్లాడుతూ, తనతండ్రి పని చేస్తున్న సంస్థలో తనకు జరిగిన ఈ సన్మానం పట్ల ఆమె ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో జరుగబోయే క్రికెట్ పోటీల్లో మరింత మెరుగైన ప్రతిభను కనబరుస్తానని ఆమె ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో శ్రీచరణి కుటుంబ సభ్యులతో పాటు ఎపి జెన్‌కో డైరెక్టర్లు ఉషా, సుజయ్ కుమార్, అశోక్ కుమార్ రెడ్డి, ఎపిపిడిసిఎల్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఎపి ట్రాన్స్‌కో డైరెక్టర్లు ఎవికె భాస్కర్, జెవి రావు, వెంకటరమణమూర్తి పాల్గొన్నారు.




## కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుపతిలో నిరసన

**తిరుపతి, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** నీట్ పరీక్షల్లో అక్రమార్కులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో కాంగ్రెస్ ఎంపి, లోకసభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రియాంక గాంధీతో బాటు ఆ పార్టీ ఎంపీలు ఆందోళనకు దిగితే వారిని బలవంతంగా అరెస్టు చేసి నిర్బంధించడాన్ని తిరుపతిలో నిరసన వ్యక్తం చేశారు. అణచివేయాలని చూస్తే మరింతగా ఉద్యమాలు విస్తరిస్తాయన్నారు. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ప్రధాని ఇంటి ముందు బైఠాయించడం ఇదే తొలిసారి అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఉద్యమాలు తీవ్రతరం అవుతాయని కాంగ్రెస్ తిరుపతి అధక్షుడు గౌడపేర చిట్టిబాబు హెచ్చరించారు. రాహుల్, ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ ఎంపిల అరెస్టుకు నిరసనగా కాంగ్రెస్ నేతలు తిరుపతిలో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయం ముందు కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చిత్రపటం దగ్ధం చేశారు. ఈ ర్యాలీలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. ఎన్‌ఎస్ యుఐ జిల్లా అధ్యక్షుడు శివ బాలాజీ, తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలగురవం బాబు, తిరుపతి అర్బన్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు, కాంగ్రెస్ పార్టీ నేతలు వెంకట నరసింహులు, కంభంపాటి మురళీకృష్ణ, తలప దామోదర్ రెడ్డి, రమేష్ రెడ్డి, దాసరి రత్నం, చిరంజీవి, కరీముల్లా, శ్రీనివాస్ గౌడ్, ఇళయరాజా, చిత్తూరు శివశంకర్, తవన్ కళ్యాణ్, శివకుమార్, గొడుగు చింత గోపి జ్యోతీశ్వర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమల నిధులతో అంగన్‌వాడి భవనాలు


అంగన్‌వాడి భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**శ్రీకాళహస్తిరూరల్, జులై 22 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని గ్రామా ల్లో పరిశ్రమల నిధులతో అభివృద్ధి కార్య క్రమాలను చేపడుతున్నట్లు శాసన సభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి వివరిం చారు. బుధవారం శ్రీకాళహస్తి మండలం చల్లపాళెం బిసి కాలనీలో అంగన్‌వాడి భవనాన్ని, అలాగే తిరుమంజనం వారి కండ్రిగలో ఆర్‌ఒ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. వీటికి నిధులు హిందూ స్తాన్ బెవరేజస్(కోకా కోలా) సియస్‌ఆర్ ప్రాజెక్టు నిధులతో అభివృద్ధి కార్యక్రమా లను చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ పిల్లల అభివృద్ధి కోసం కోకా కోలా యాజ మాన్యం ముందుకు రావటం అభినంద నీయం అన్నారు.


ఈ కార్యక్రమాల్లో కోకా కోలాకు చెందిన హిమాన్సు, జడ్‌పిటిసి వెంకట సుబ్బారెడ్డి, మార్కెటింగ్ కమిటి ఛైర్మన్ చెంచయ్య నాయుడు, మండలాధ్యక్షుడు కృష్ణయాదవ్, బత్తిరెడ్డి, తాటపర్తి రవీంద్రనాథ్ రెడ్డి, జగదీశ్వర రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, కామేష్ యాదవ్, సుదర్శనం రెడ్డి, సిడిపిఒ శాంతి దుర్గ, అంగన్‌వాడి సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుమలలో వేడుకగా మలయప్ప పల్లవోత్సవం



**తిరుమల, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో బుధవారం సాయంత్రం పల్లవోత్సవం వేడుకగా జరిగింది. మైసూరు మహారాజు జయంతిని పురస్కరించుకుని ఈ పల్లవోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సాయంత్రం సహస్రదీపాలంకారసేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఊరేగింపుగా కర్ణాటక సత్రానికి వేంచేపు చేసి మైసూర్ సంస్థానం తరపున మహారాణి, యువరాజు ఆతిథ్యాన్ని స్వీకరించారు. అనంతరం కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, మైసూరు సంస్థానం ప్రతినిధులు స్వామి, అమ్మవార్లకు ఆహ్వానం పలికి ప్రత్యేక హారతి సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు నరేష్, దర్శన్, ఆలయ పేష్కార్ రామకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా ద్రౌపదీ సమేత అర్జునుడు ఊరేగింపు



**శ్రీకాళహస్తి, జులై 22 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వ రాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ద్రౌపదీ సమేత అర్జునుడు వధూవరులుగా పట్టణంలో బుధవారం దర్శనమిచ్చారు. ఆలయం వద్ద కన్నుల పండువగా అర్జునుడు ద్రౌపదీ వివాహం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ఇఒ బికె వెంకటేశులు, డిప్యూటి ఇఒ ఎన్‌ఆర్ కృష్ణారెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి, ఎంఎస్‌రెడ్డి, దేవస్థానం అధికారులు, ఉద్యోగస్తులు హాజరయ్యారు. బుధవారం ఉదయం స్వామి అమ్మవార్లు సప ్పర వాహనంలో దర్శనమిచ్చారు.

కళ్యాణ ముస్తాబుతోనే అర్జునసమేత ద్రౌపదీ అమ్మవారిని చక్కగా సప్పరంలో ప్రతిష్టించారు. ఆలయ సంప్రదాయంతో పూజారి పురుషోత్తంలు స్వామి అమ్మవార్లకు హారతులిచ్చి ఊరేగింపును ప్రారంభించారు.

మేళ తాళాలు పంబజోళ్ల మోతతో ఊరేగింపు జయరామారావువీధి, బజారువీధి, తేరువీధి, నెహ్రూవీధి, నగరి వీధుల మీదుగా సాగింది. మధ్యాహ్నం ఆలయంలో రాజసూయ యాగం ఘట్టాన్ని భారతంలో చదివి భక్తులకు వినిపించారు. రాత్రి రాజసూయ యాగాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి వర్షం కురుస్తున్నా స్వామి అమ్మవార్ల గ్రామోత్సవంను కన్నుల పండువగా నిర్వహించారు.

## పిల్లలే మన సంపద

- వారి చదువులే మనకు తరగని ఆస్తి
- విద్యా శాఖ మంత్రి నారా లోకేష్



**విజయవాడ, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** పిల్లలే మన సంపద. వారి చదువులే మనకు తరగని ఆస్తి అని ఎపి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. 'తల్లికి వందనం' కార్యక్రమంలో లబ్దిదారులకు నిధులు జమ బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ 'ఎక్స్'లో తల్లివందనం లబ్దిదారులను అభినం దిస్తూ పోస్టు చేసారు. "విద్యే మన రాష్ట్ర వెలకట్టలేని పెట్టుబడి. ఏ ఒక్క చిన్నారి విద్యకు దూరం కాకూడదనేది మా కూటమి ప్రభుత్వం లక్ష్యం. అందుకే ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు చదివితే అంతమందికి ఎటువంటి ఆంక్షలు లేకుండా ఇచ్చే పథకం తల్లికి వందనం రూపొం దించారు. వరుసగా రెండో ఏడాది తల్లికి వందనం నిధులు విద్యా సంవత్సరం ఆరంభంలోనే విడుదల చేసాం. తల్లికి వందనం ద్వారా ఈ ఏడాది 67.47 లక్షల మంది విద్యా ర్థుల తల్లులు 42.70 లక్షల మంది బ్యాంకు ఖాతాల్లో రూ.10,120.78 కోట్లు జమ చేస్తున్నాం. ఈ ప్రక్రియ 24 వరకు కొనసాగుతుంది. పిల్లలను చదివించే ప్రతి తల్లికీ నా వందనం' అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

## తిరుమల సమాచారం



### శ్రీవారి సేవలో వ్యాసాశ్రమం పరిపూర్ణానందస్వామి

**తిరుమల, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆషాడమాసం సందర్భంగా తిరుపతి జిల్లా ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి శిష్యులతో కలసి బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం ఆలయం వద్దకు విచ్చేసిన స్వామివారికి టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ ఆలయ సాంప్రదాయంగా స్వాగతం పలికారు. ఆలయంలోపల తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించు కున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీవారి ఆశీస్సులతో మంచి వర్షాలు కురవాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు.

### గోవిందరాజస్వామి ఆలయంలో 26న తులసి మహాత్మ్యం ఉత్సవం



**తిరుమల, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో ఈనెల 26న పవిత్రమైన తులసి మహాత్మ్యం ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున 4.30 గంటల నుండి 6.30 గంటల వరకు గోవిందరాజస్వామి గరుడవాహనాన్ని అధిరోహించి ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దివ్య దర్శనభాగ్యం కల్పించనున్నారు. అనంతరం ఉదయం 6.30 గంటల నుండి 7.30 గంటల వరకు స్వామివారి ఆస్థానం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అర్చకులు తులసి మహాత్మ్యం గురించి పురాణ పఠనం చేసి తులసీదేవి వైభవాన్ని భక్తులకు వివరిస్తారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేస్తారు. ఈ దివ్య ఉత్సవంలో పాల్గొని గోవిందరాజ స్వామి అనుగ్రహం పొందాలని టిటిడి భక్తులను ఆహ్వానిస్తోంది.

### మేఘావృతంతో ఆలయ ప్రాంగణం కనువిందు

**తిరుమల, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** మారిన వాతావరణంతో శేషాచలంలోని తిరుమల ఆలయం పరిసరాలు ఆహ్లాదకరంగా మారాయి. బుధవారం ఉదయం శ్రీవారి ఆలయం ముందు పావురాలు సందడి చేస్తూ భక్తులను ఆకట్టుకున్నాయి. గుంపుగా వచ్చిన పావురాలు ఆలయం ముందు విహరించడం ఆధ్యాత్మిక వాతావరణానికి మరింత అందాన్ని తీసుకువచ్చింది. భక్తులు తమ సెల్‌ఫోన్‌లలో ఈ అనుభూతిని చిత్రీకరించారు.



## తిరుమల ఘాట్‌లో ఆంజనేయస్వామి విగ్రహం చోరీ

- రాతి విగ్రహం మాయంపై దిగ్భ్రాంతి




**తిరుమల, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల నుండి తిరుపతికి వెళ్ళే మొదటిఘాట్‌లోని 7వ మైలువద్ద ఉన్న ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం క్రింది భాగంలోని ఒక అడుగు రాతివిగ్రహం చోరీ జరిగింది. అర్ధరాత్రి దాటిన తరువాత జరిగిన ఈ చోరీ సంఘటన అటు భక్తుల్లో ఇటు టిటిడిలో పెద్ద దుమారం రేపుతోంది. దేవుని విగ్రహాన్ని చోరీ చేసుకెళ్ళడం వెనుక ఉన్న పెద్ద తతంగం ఏమిటనేది ఇప్పుడు హిందూ వర్గాల్లో కలకలంగా మారింది. బుధవారం వేకువజామున 2గంటల ప్రాంతంలో 7వ మైలువద్ద ఒక అడుగు ఆంజనేయస్వామి రాతివిగ్రహం ఎలా చోరీ జరిగిందనేది ఇప్పుడు భక్తులను తీవ్రంగా కలచివేస్తోంది. ఆ సమయంలో భద్రత సిబ్బంది కూడా కునుకుతీస్తుంటారు. అలాంటిది మొదటి ఘాట్ రోడ్‌లో 7వమైలు వద్ద ఉన్న క్రింద అమర్చిన ఆంజనేయస్వామి రాతి విగ్రహాన్ని ఓ వ్యక్తి టవల్‌లో దాచి ఎత్తుకెళ్ళాడు. ఈ చోరీలో ఇద్దరు ముగ్గురు పాల్గొని ఉంటారనేది అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాతికేళ్ళుగా కొలువై ఉన్న స్వామివారి రాతి విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోవడం తిరుమల చరిత్రలోనే ఒక పవిత్రతకు కళంకంగా భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అర్ధరాత్రి యాత్రికుల కదలికలుగానీ, భద్రత సిబ్బంది గానీ ఎవరూ లేని సమయాన్ని ఆసరాగా చేసుకుని విగ్రహాన్ని ఎత్తుకెళ్ళినట్లు ప్రాథమిక సమాచారం బట్టి తెలుస్తోంది. ఉదయం 5గంటల ప్రాంతంలో పూజలు చేసేందుకు వచ్చిన భక్తులు, ఆలయ సిబ్బంది విగ్రహం ఉండాల్సిన స్థానంలో లేకపోవడాన్ని గమనించి తిరుమల తిరుపతి దేవస్థానం విజిలెన్స్ విభాగానికి, తిరుమల 2టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, టిటిడి సెక్యూరిటీ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తిరుమల పోలీసు యంత్రాంగం క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించి క్షేత్రస్థాయి ఆధారాలను సేకరించారు.

ఘాట్ రోడ్లలోని చెక్‌పోస్టులు, ఏడో మైలు పరిసర ప్రాంతాల్లో ఉన్న సిసి కెమెరాల పుటేజీలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఓ వ్యక్తి ఆలయంలోకి వెళ్లి విగ్రహంతో పరుగులు పెడుతున్న దృశ్యాలు వీడియోల్లో రికార్డు అయ్యాయి. అర్ధరాత్రి సమయంలో ఆ మార్గంలో వెళ్లిన వాహనాల వివరాలను, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించారు. పోలీసులు 10 బృందాలతో దర్యాప్తు వేగవంతం చేశారు. నిందితులను త్వరలోనే అదుపులోకి తీసుకుని, ఆంజనేయస్వామి విగ్రహాన్ని యథాస్థానంలో పునఃప్రతిష్ఠిస్తామని టిటిడి అధికారులు తేల్చారు. భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న ఈ అంశంపై పూర్తి స్థాయి నిజాలను వెలికితీస్తామని, ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తిరుమల పోలీసులు తెలిపారు.

## నడకదారిలో భద్రతా లోపం

- 'పెద్ది' పోస్టర్‌తో తిరుమలకు అభిమాని



**తిరుమల, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలకు వచ్చే అలిపిరి నడకమార్గంలో భద్రతా వైఫల్యం మరోసారి ప్రస్ఫుటమైంది. నడక మార్గాల్లో క్షుణ్ణంగా తనిఖీ చేసే భద్రత సిబ్బంది కొన్ని సమయాల్లో భక్తుల వద్ద ఉంటున్న నిషేధిత పదార్థాలు, వస్తువులను గుర్తించ డంలో విఫలమవుతున్నారు. తాజా గా బుధవారం ఏకంగా అలిపిరి నడక మార్గంలో మోకాళ్ళపర్వతం వద్ద 'పెద్ది' చిత్రం పోస్టర్‌ను ఓ మహిళ భక్తురాలు ప్రదర్శించడం దుమారం రేపింది.

కడప జిల్లాకు చెందిన యువతిగా టిటిడి విజిలెన్స్ సిబ్బంది గుర్తించారు. ఏకంగా యువతి పెద్ది పోస్టర్‌తో తిరుమలకు రావడం, మోకాళ్ళ పర్వతం వద్ద మెట్లపై ప్రదర్శించడం విమర్శలకు తావిచ్చింది.

కడప జిల్లాకు చెందిన సితార 'పెద్ది' చిత్రం విజయవంతం కావడంతో శ్రీవారికి మొక్కుతీర్చుకునేందుకు కాలినడకన బుధవారం మధ్యాహ్నం తిరుమలకు వస్తుంది. ఆమె కాలిబాట మార్గంలో 'పెద్ది' చిత్రం పోస్టర్‌ను పట్టుకుని రావడంతో కలకలం రేపింది. ఎంతో పవిత్రమైన పుణ్యక్షేత్రంలో ఆలయానికి సినిమా పోస్టర్ తేవడంపై భక్తులు అసహనం వ్యక్తం చేశారు. టిటిడి భద్రత సిబ్బంది దీనిపై చర్యలు తీసుకోనున్నారు.

## నడకమార్గాల్లో 'కంచె' అసంభవమేనా!?

- హైకోర్టు ఆదేశించినా నిపుణుల కమిటీ విముఖత



**తిరుమల, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** 'గోవిందా... గోవింద' నామస్మరణతో దేశం నలుమూలల నుండి ఎంతో భక్తిభావంతో తిరుమలకు అలిపిరి, శ్రీవారిమెట్టు కాలినడక మార్గాల్లో నడచివచ్చే భక్తుల భద్రతకు టిటిడి చర్యలు తీసుకుంటున్నా వన్యప్రాణుల కట్టడి చేయలేక పోతుండటం చర్చనీయాంశంగా మారింది. నాలుగేళ్ళ క్రిందట అలిపిరి కాలినడక మార్గంలో చిరుతపులి ఓ బాలుడ్ని ఎత్తుకెళ్ళి తీవ్రంగా గాయపరచగా మరో బాలికపై దాడిచేసి చంపితిన్న విషాద ఘటన తెలిసిందే. ఇంకా పలు సందర్భాల్లో చిరుతపులులు ఘాట్‌రోడ్లలో వాహనదారులపై దాడిచేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఈ నేపథ్యంలో కాలినడక మార్గంలో మెట్లకు ఇరువైపులా ఇనుపకంచే ఏర్పాటు చేస్తే భక్తులకు భద్రత కల్పించవచ్చనే సూచనలు అప్పట్లో వెల్లువెత్తాయి. ఆ దిశగా కొందరు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం ధర్మాసనం కూడా కంచె ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఆదేశిం చింది. తిరుపతి అలిపిరి నుండి తిరుమలకు కాలినడక మార్గం సుమారు 10కిలోమీటర్లు దూరం అటవీ ప్రాంతంలోనే ఉంది. 3,550 మెట్లు మార్గంలో భక్తులు ప్రయాణానికి ఐదుగంటల సమయం పడు తుంది. ఈ మధ్యదూరం పూర్తిగా అటవీ ప్రాంతానికి ఆనుకునే ఉంది. అడపాదడపా చిరుత పులులు, ఎలుగుబంట్లు, ఏనుగులు ఆహారం కోసం, వన్యప్రాణి సంతతి ఉత్పత్తి కోసం అడవిని వదలి దారితప్పి ఇలా నడకమార్గాల్లోకి. ఘాట్‌రోడ్లపైకి వచ్చేస్తున్నాయి. ఎక్కడైనా ఒంటరిగా కనిపిస్తే దాడి చేస్తుండటంతో భక్తులు భయాందోళనకు గురవుతున్నారు. అలిపిరి నడక మార్గంలో వన్యప్రాణుల నుంచి రక్షణ కోసం ఇనుప కంచె (ఫెన్సింగ్) ఏర్పాటుపై 2022లోనే ప్రతి పాదనలు తెరపైకి వచ్చాయి. నడక మార్గంలో వన్య ప్రాణుల దాడులను అరికట్టడానికి అలిపిరి నుండి తిరుమల వరకు దారికి ఇరువైపులా ఇనుప కంచె ఏర్పాటు చేయాలని హైకోర్టు ఆదేశించింది.

**అత్యాధునిక సాంకేతికతతో గుర్తింపు:** కాలినడక మార్గాల్లో భక్తుల రక్షణ చర్యలపై టిటిడి, అటవీశాఖ ప్రత్యేక దృష్టి సారించాయి. క్రూరమృగాల బారినుండి కాపాడటానికి అడవిలో అధునాతన ట్రాప్ కెమెరాలు ఏర్పాటుచేసి వాటి కదలికలను గమనిస్తున్నారు. ఈ ఘటనల నేపథ్యంలో తిరుమలకు వచ్చే కాలినడక భక్తుల రక్షణకు టిటిడి అధికారులు మరింతగా ఫోకస్ చేస్తున్నారు. నడకదారి భక్తులకు రక్షణ కల్పించేందుకు మెట్లమార్గాల్లో ఇరువైపులా ఇనుపకంచే ఏర్పాటు ప్రతిపాదనలు టిటిడి తయారుచేసి కేంద్రానికి, రాష్ట్రా నికి పంపారు. క్రూరమృగాల కదలికలు నియంత్రించ డానికి, మెట్లమార్గాల్లో రాకుండా చూసేందుకు కంచే ఏర్పాటు శరణ్యమని భావించారు. అయితే నడక మార్గంలో కంచె వేయటం మరింత ప్రమాదకరమనే సూచనలను కమిటీ సూచించింది. చిరుతలు చెట్టుపైకి ఎక్కి కొమ్మలపై చిరుత హాయిగా నిద్రపోతుందని, అలాంటిది ఐదు, పది అడుగుల ఎత్తైన కంచెలు చిరుతలను ఏ మాత్రం ఆపలేవనే వాదన వినిపించారు. మెట్లకు ఇరువైపులా కంచె వేసినా చిరుతలు దూకి కంచె లోపలకి పొరపాటున వస్తే, అప్పుడు ఇంకా పెద్ద ప్రమాదమే జరిగే అవకాశం ఉంటుందనేది కూడా కమిటీ తేల్చింది. ప్రాణభయంతో జనాల మధ్య తొక్కిసలాట, అదే ప్రాణభయంతో చిరుతలు కూడా మనుషులపై దాడిచేస్తే పరిస్థితి ఏంటనేది ఆందోళనకరమని స్పష్టం చేసింది. కంచే ప్రమాదకర మని కూడా తేల్చింది. దీనికంటే భక్తులకు చేతికర్రలు ఇచ్చి పంపడం వల్ల భద్రతకు ఢోకా ఉండదని 2023లో టిటిడి ధర్మకర్తల మండలి చేతికి కర్రలు ఇచ్చి పంపింది. ఆ తరువాత చిరుతల సంచారం తగ్గడంతో చేతికర్రలకు స్వస్తిచెప్పారు. అలిపిరి, శ్రీవారిమెట్టు నడకమార్గాల్లో అత్యవసర సమయాల్లో క్షణాల్లో స్పందించేందుకు శాశ్వత ప్రాతిపదికన ప్రత్యేక రక్షణ బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల భద్రత కోసం నడక మార్గంలో రాత్రి 9.30గంటల వరకే సమయం కేటాయించారు. గుంపులుగుంపులుగా భక్తులను 50మంది నుండి వందమంది వరకు అనుమతినిస్తున్నారు. ఒక్కరే కాకుండా గుంపులుగా వెళ్లటం వలన క్రూరమృగాలు దగ్గరికి రావని టిటిడి అధికారులకు అటవీశాఖ సూచనలు చేసింది. అటవీమార్గంలో వన్యప్రాణుల సంచారాన్ని నిరంతరం పర్యవేక్షించేందుకు టిటిడి అటవీ శాఖ, విజిలెన్స్, ఇంజినీరింగ్, ఆరోగ్య శాఖలతో బాటు సంబంధిత అన్ని విభాగాల మధ్య సమన్వయాన్ని మరింత మెరుగుపర చుకుని, సమర్థవంతమైన పర్యవేక్షణతో సమాచార మార్పిడి, అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందనకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. నడకమార్గంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద ప్రత్యేక అత్యవసర ప్రతిస్పందన బృందాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ బృందానికి అవసరమైన సిబ్బంది, ఆధునిక పరికరాలు, వాహనాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులో ఉంచి, వన్యప్రాణుల ఘటనలు చోటుచేసుకున్న వెంటనే తక్షణమే స్పందించేలా శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు.

## వైభవంగా నృసింహుని స్వర్ణ గరుడోత్సవ సేవ

• భక్తి శ్రద్ధలతో స్వామి వారి జన్మనక్షత్ర వేడుకలు



**రాపూరు (నెల్లూరు), జులై 22 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారికి బుదవారం స్వర్ణ గరుడోత్సవ సేవ నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా తెల్లవారుజామున స్వామి వారి మూలమూర్తికి అభిషేకం, చందనాలంకారం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు స్వామి వారికి శాంతి హోమం నిర్వహించిన అనంతరం స్వామి వారి నిత్యకళ్యాణం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి అత్యంత ప్రీతిప్రాతమైన స్వర్ణ గరుడవాహనంపై శ్రీవారిని వుంచి స్వామివారికి క్షేత్రోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, గిరిజన వాయిద్యాల మధ్య నిర్వహించిన స్వామివారి స్వర్ణ గరుడవాహన క్షేత్రోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావల్సిన భోజన, వసతి ఏర్పాట్లును ఆలయ ఇన్‌చార్జ్ ఇఒ కె.జనార్ధన్ రెడ్డి పర్యవేక్షణలో ఆలయ సూపరింటెండెంట్ పాలవల్లి లక్ష్మీనారాయణ, ఎఇ వినోద్, సిబ్బంది నరసింహ, వెంకటసుబ్బయ్య, పెంచలస్వామి, హరిష్ ఇతర సిబ్బంది పర్యవేక్షించారు. స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చక స్వామి గుండ్లూరు శశి స్వామి, అర్చక స్వాములు మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు నిర్వహించారు.

**25న వైకుంఠనాథ అలంకారంలో నృసింహుడు:** 25వ తేది శనివారం తొలి ఏకాదశి (పాల కడలిలో యోగనిద్రకి స్వామి ఉపక్రమించే రోజు) సందర్భంగా స్వామి వారి మూలమూర్తికి అభిషేకం నిర్వహించనున్నట్లు ఇఒ తెలిపారు. అనంతరం స్వామి వారికి వైకుంఠనాథ అలంకారం నిర్వహించి శేషవాహనం పై ఉభయ దేవేరులతో శేషవాహనోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## ఆంజనేయుని విగ్రహం చోరీ కేసు ఛేదన!

• ఒంగోలులో అదుపులోకి తీసుకున్న పోలీసులు

**తిరుమల, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల మొదటిఘాట్‌రోడ్డులోని 7వ మైలు వద్ద 30 అడుగుల ప్రసన్న ఆంజనేయస్వామి విగ్రహం క్రిందిభాగంలో ఉన్న ఆంజనేయుని విగ్రహం చోరీ కేసులో పోలీసులు నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ దొంగతనం జరిగిన 15గంటల్లోనే తిరుపతి జిల్లా తిరుమల పోలీసులు కొంత పురోగతి సాధించారు. బుధవారం తెల్లవారుజామున ఘాట్‌రోడ్డులోని 7వ మైలు వద్ద ఆంజనేయస్వామి రాతి విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేయడం, ఉదయం భక్తులు గమనించడం జరిగింది. దీనిపై వెంటనే స్పందించిన జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్ 20 మంది పోలీసు బృందాలు రంగంలోకి దిగిన 15గంటల్లోనే ఈ కేసును ఛేధించారు. నిందితుడ్ని ఒంగోలు రైల్వేస్టేషన్‌లో ఆంజనేయుని విగ్రహంతో సహా అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న విగ్రహాన్ని తిరుమల పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితుడు విశాఖపట్నం వాసి జశ్వంత్ కుమార్‌ను తిరుమలకు తీసుకువస్తున్నారు. మొత్తంమీద దేవుని మహిమ ఉందని భక్తుల్లో మరోసారి ప్రస్ఫుటమైంది. అయితే ఎందుకు విగ్రహం చోరీ చేయాల్సి వచ్చింది అనేది గురువారం తిరుమలలో పోలీసులు వెల్లడించనున్నారు. మొత్తంమీద హిందూ భక్తులను తీవ్రంగా కలచివేసిన ఆంజనేయుని విగ్రహం చోరీ నిందితుడిని 15 గంటల వ్యవధిలోనే పోలిసులు అదుపులోకి తీసుకోవడంతో అంతా దేవుని మహిళ అన్నట్లు చర్చ మొదలైంది.

# పంచదార్ల రెవెన్యూ భూముల అక్రమ తవ్వకాల్లో పర్యావరణ ఉల్లంఘనలపై విచారణ

• డి.సిఎం పవన్ కళ్యాణ్ ఆదేశం • నో మైనింగ్ జోన్‌గా ప్రకటించాలని రెవెన్యూ, మైనింగ్ శాఖలకు సూచన • సహజ జలధారల సంరక్షణకు చర్యలు • పురాతన ఆలయ పరిరక్షణ మనందరి బాధ్యత • శ్రీ ఉమా ధర్మలింగేశ్వర ఆలయ సంరక్షణకు పురావస్తు, దేవాదాయ శాఖలు చర్యలు తీసుకోవాలని హుకుం

**విజయవాడ, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** అనకాపల్లి జిల్లా, రాంబిల్లి మండల పరిధిలోని పంచదార్ల కొండపై రెవెన్యూ భూముల్లో జరుగుతున్న గ్రావెల్ తవ్వకాల్లో పర్యావరణ నిబంధనల ఉల్లంఘనలపై సమగ్ర విచారణ జరిపి, నివేదిక సమర్పించాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖలను నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. పంచదార్ల కొండ తవ్వకాల్లో అక్రమాలపై అనకాపల్లి జిల్లా కలెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో మాట్లాడారు. కలెక్టర్ ఇచ్చిన ప్రాథమిక నివేదికను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్, పీసీబీ అధికారుల ప్రాథమిక నివేదికల్లో మైనింగ్ అనుమతులు పొందిన సంస్థ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినట్టు ప్రాథమిక ఆధారాలు ఉన్న క్రమంలో పర్యావరణ నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్, మట్టి తవ్వకాలకు పాల్పడిన సదరు సంస్థపై నిబంధనల మేరకు జరిమానా విధించడంతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. మైనింగ్ కారణంగా పంచదార్ల కొండ దిగువన ఉన్న శ్రీ ఉమా ధర్మలింగేశ్వర స్వామి ఆలయం, సహజ జలధారల ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని సంరక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. జలధారల రంగు మార్పుపై జాతీయ జలవిజ్ఞాన సంస్థ శాస్త్రవేత్తలను ఆహ్వానించి, ఆ జలధార మూలాలను పరిశీలించి, సహజ ప్రవాహ సంరక్షణకు సంబంధించిన శాస్త్రీయ నివేదికలు తీసుకోవాలన్నారు. సహజ జలధారల సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించిన సంస్థపై జరిమానా తోపాటు పర్యావరణ పునరుద్ధరణ బాధ్యత కూడా వేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పురాతన ఆలయాలు, ప్రకృతి వనరుల సంరక్షణ బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. పంచదార్ల కొండ వద్ద ఉన్న శ్రీ ఉమా ధర్మలింగేశ్వర స్వామి ఆలయ పరిరక్షణకు పురావస్తు శాఖ, దేవాదాయ శాఖ సంయుక్త కార్యాచరణ చేపట్టాలని నిర్దేశించారు. దీంతోపాటు పర్యావరణ పరిరక్షణలో భాగంగా పంచదార్ల కొండ పరిసరాలను నో మైనింగ్ జోన్‌గా ప్రకటించాలని రెవెన్యూ, మైనింగ్ శాఖలకు సూచించారు. సదరు మైనింగ్ సంస్థకు ఇచ్చిన పర్యావరణ అనుమతులు, ఎస్టాబ్లిష్ మెంట్, ఆపరేషన్స్ అనుమతులు తక్షణమే రద్దు చేయాలన్నారు.

# కేంద్రంతో ఫలించిన చర్చలు

## రైతు కష్టానికి అండగా కూటమి ప్రభుత్వం

• జిఎస్‌టి తగ్గింపు, అదనపు సాయంపై కేంద్రం నుంచి శుభసూచనలు
• వాస్తవాలు తెలుసుకుని కూడా జగన్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు
• వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**విజయవాడ, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని పొగాకు, ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. బుధవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రెండు రోజులు ఢిల్లీలో కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, లలన్ సింగ్, శివరాజ్ సింగ్ చౌహాన్‌లతో విస్తృతంగా చర్చలు జరిపామని, రైతులకు ఊరటనిచ్చే నిర్ణయాలు త్వరలో వెలువడనున్నాయని వెల్లడించారు. ముడి పొగాకుపై జీఎస్టీ తగ్గింపు, అదనపు ఆర్థిక సాయం, ఆక్వా ఫీడ్ ధరల నియంత్రణ వంటి కీలక అంశాలపై కేంద్ర మంత్రులు సానుకూలంగా స్పందించారని మంత్రి తెలిపారు. ఇటీవల కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారమన్‌తో సమావేశమై పొగాకు రైతుల సమస్యలను వివరించామని, ముడి పొగాకుపై జీఎస్టీని తగ్గించాలని కోరామని, ఆ అంశాన్ని జీఎస్టీ కౌన్సిల్ సమావేశ ఎజెండాలో చేర్చి సానుకూల నిర్ణయం తీసుకుంటామని కేంద్ర ఆర్థిక మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. అదేవిధంగా టొబాకో బోర్డు వద్ద రైతుల నుంచి వసూలు చేసిన సుమారు రూ.750 కోట్ల సెస్ నిధుల నుంచి కిలోకు రూ.15 చొప్పున రైతులకు ఆర్థిక సాయం అందించాలని కేంద్రాన్ని కోరినట్లు చెప్పారు. ఈ అంశంపై కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో ఇప్పటికే చర్చలు జరిగాయని, రెండు రోజుల్లో సానుకూల నిర్ణయం వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**రాజకీయ నాటకాలతో రైతులను తప్పుదోవ పట్టించొద్దు:** గొడ్డలి పార్టీ అధినేత వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి వ్యవసాయ, ఆక్వా, పొగాకు సమస్యలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవాలని ప్రయత్నిస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు. ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో వ్యవసాయ, నీటిపారుదల రంగాలను పూర్తిగా నిర్వీర్యం చేసిన వ్యక్తి ఇప్పుడు రైతుల పేరుతో రాజకీయాలు చేయడం విడ్డూరమని వ్యాఖ్యానించారు. పొగాకు రైతుల సమావేశాల పేరుతో నిజమైన రైతులను కాకుండా వైసీపీ కార్యకర్తలకు కండువాలు కప్పి రైతులుగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. భీమవరంలో జరిగిన ఆక్వా రైతుల ముఖాముఖి కార్యక్రమంలో కూడా డబ్బులు ఇచ్చి మహిళలు, వృద్ధులను తీసుకొచ్చి రైతుల సమావేశంగా ప్రచారం చేశారని విమర్శించారు. శ్రీకాకుళం జిల్లాలో ఇటీవల జరిగిన రెండు ఘటనలను ప్రస్తావించిన మంత్రి, మాజీ మంత్రి సిదిరి అప్పలరాజు కుమారుడికి సంబంధించిన రోడ్డు ప్రమాదం కేసులో నిజానిజాలు వెలుగులోకి రావాల్సి ఉందని, ప్రభుత్వం చట్ట ప్రకారం చర్యలు తీసుకుందని తెలిపారు. అలాగే మాజీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం భూ ఆక్రమణ ఆరోపణలపైనా చట్టబద్ధ చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.

## బ్రహ్మం చౌదరికి మంత్రి లోకేష్ పరామర్శ



**విజయవాడ, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మం చౌదరిని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. మణిపాల్ ఆసుపత్రికి వచ్చిన మంత్రి.. బ్రహ్మం చౌదరిని కలిశారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. బ్రహ్మం మాట్లాడుతూ ప్రస్తుతం అంతా బాగానే ఉందని తెలిపారు. మణిపాల్ వైద్యులతో లోకేష్ మాట్లాడగా బ్రహ్మం చౌదరి పూర్తిగా కోలుకున్నారని, త్వరలో డిశ్చార్జ్ చేస్తామని వారు తెలిపారు. బ్రహ్మం చౌదరి సతీమణి గౌతమి శ్వేతతో మాట్లాడి ధైర్యం చెప్పారు.

## ఇక గుంటూరులోని ఆరు జిల్లాల ఆడిట్స్

• జిఎస్‌టి ఆడిట్ అసిస్టెంట్ కమిషనర్ జిట్టా వెంకటేశ్వర్లు

**గుంటూరు లీగల్, జులై 22 ప్రభాతవార్త:** కృష్ణా, ఎన్.టి.ఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలలోని జీఎస్టీ రిజిస్టర్డ్ పన్ను చెల్లింపుదారుల అకౌంట్స్, రిటర్న్లు తనిఖీ నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం గుంటూరు అరండల్ పేట 3/2లో ఆడిట్ సర్కిల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసిందని సెంట్రల్ జీఎస్టీ ఆడిట్ సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ జిట్టా వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఐ.ఆర్.ఎస్ అధికారి అయిన వెంకటేశ్వర్లు ముంబై నుండి బదిలీపై వచ్చి, ఈ సర్కిల్‌కు అసిస్టెంట్ కమిషనర్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ సూపరింటెండెంట్లు, ఇన్స్పెక్టర్లు తో కూడిన ఎనిమిది బృందాలు ప్రతిరోజు, ముందుగా నోటీసు పంపిన పన్ను చెల్లింపుదారుల వ్యాపార రికార్డులు, లావాదేవీల సమగ్రతను పరిశీలిస్తాయన్నారు. పన్ను తేడా లేదా లోపాలు గుర్తిస్తే, పన్ను చెల్లింపుతో పాటు వడ్డీ, జరిమానాతో సహా డిమాండ్ నోటీసు జారీ చేయబడుతుందని హెచ్చరించారు. జీఎస్టీ అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు. ఎ.పి సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్, సెంట్రల్ ట్యాక్స్ పెన్షనర్స్ అసోసియేషన్ నేతలు పి.వి.సత్యనారాయణ, గుమ్మడి సీతారామయ్య చౌదరి, ఎన్.ఎస్. నగేష్ బాబు, పి. కోటేశ్వరరావు తదితరులు నూతన అసిస్టెంట్ కమిషనర్‌కు అభినందనలు తెలిపారు.

## ఉద్యోగుల ఆర్థిక సమస్యలపై రాజీ ప్రశ్నే లేదు: జెఎసి చైర్మన్ బొప్పరాజు

**విజయవాడ, జులై 22 ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉద్యోగుల ఆర్థిక సమస్యలపై రాజీ పడే ప్రశ్నే లేదని ఎ.పి.జె.ఎ.సి. అమరావతి రాష్ట్ర ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ఉద్యోగ సంఘాలతో రాష్ట్ర మంత్రి వర్గ ఉపసంఘం బుధవారం చర్చలు జరిపిన అనంతరం జె.ఎ.సి. నాయకులు పలిశెట్టి దామోదరరావు, టీవీ ఫణి పేర్రాజు, తిమ్మనర్తి నాగేశ్వర రావులు మీడియాతో మాట్లాడారు. చర్చలు సానుకూలంగానే జరిగాయని తాము భావిస్తున్నామని, అయితే, ఉద్యోగుల ఆర్థిక సమస్యల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ఉద్యోగులకు గతవై.సి.పి. ప్రభుత్వం 30 వేల కోట్ల రూపాయలు బకాయిలు పెట్టి వెళ్లిందని మరల ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత 20 వేల కోట్లు పైగా బకాయిలు పేరుకు పోతున్నాయని, ప్రభుత్వాలు మిగిలిన ఏ విషయాల్లోనూ చెప్పని బడ్జెట్ లెక్కలను ప్రభుత్వ ఉద్యోగుల చెల్లింపులు వచ్చేసరికి మాత్రం చెబుతున్నాయని వారు వాపోయారు. ఆర్థిక అంశాల చెల్లింపుల్లో ప్రధానంగా 12వ పీఆర్సీ కమిషనర్ నియామకం, తక్షణమే మధ్యంతర భృతి ప్రకటన, పెండింగ్లో ఉన్న 4 డిఏల ప్రకటన, గత ప్రభుత్వం బకాయిపెట్టిన షుమారు 25వేల కోట్ల రూపాయల పై ప్రభుత్వం ఏ ఉద్యోగులకి, పెన్షనర్‌కు ఎంత చెల్లించాలో ఉద్యోగుల పే స్లిప్‌లలో లేదా బాండ్ల ద్వారా పారదర్శకంగా లెక్కలు చెప్పాలని, వీటిపై ప్రభుత్వం జాప్యం చేయకుండా వెంటనే స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని ఏపీ జేఏసీ అమరావతి పక్షాన కోరామని తెలిపారు.

## తుంగభద్ర సమాంతర కాల్వ నిర్మించాలి

• వైసిపి రాయలసీమ అధికార ప్రతినిధి కె.వి.రమణ

**అనంతపురం, జులై 22 ప్రభాతవార్త బ్యూరో:** తుంగభద్ర సమాంతర వరద కాలవ విషయం ఈనెల 27వ తేదీన ఢిల్లీలో కేంద్ర జలవనుల శాఖ ఆధ్వర్యంలో జరిగే తుంగభద్ర హై లెవెల్ కమిటీ సమావేశంలో చర్చించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాయలసీమ రీజియన్ అధికార ప్రతినిధి కె.వి రమణ విజ్ఞప్తి చేశారు. సమాంతర వరద కాలవను రాయలసీమలోని అన్ని నదులు, ప్రాజెక్టులకు అనుసంధానం చేస్తే రాయలసీమ సస్యశ్యామలం అవుతుందని, అందులో భాగంగా ఈ ప్రతిపాదనకు కూటమి ప్రభుత్వం కేంద్రాన్ని ఒప్పించాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కర్ణాటక ప్రభుత్వం తుంగభద్ర ప్రాజెక్టుకు నీళ్లు రాకుండా తుంగభద్ర నది పై భాగంలో అనధికారికంగా అప్పర్ బద్ర, నవళి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టిందన్నారు. దేశంలోనే అతి తక్కువ వర్షపాతం కలిగి, నిత్యం కరువుల బారినబడి ఎడారిగా మారిపోతున్న రాయలసీమను కాపాడుకోవడానికి తుంగభద్ర సమాంతర కాలువ(వరద కాలువ) నిర్మాణం అత్యంత కీలకం అని చెప్పారు. తుంగభద్ర డ్యామ్‌కు కొత్త గేట్లు బిగించిన సందర్భంగా మూడు రాష్ట్రాల (కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) ముఖ్యమంత్రులు భవిష్యత్తులో తుంగభద్ర జలాలపై నిర్ణయాలు తీసుకోవడానికి హై పవర్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ మొదటిసారిగా ఈనెల 27వ తేదీన ఢిల్లీలో కేంద్ర జల వనరుల శాఖ ఆధ్వర్యంలో సమావేశం కాబోతున్నది. ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడు చొరవ తీసుకొని సమాంతర కాలువ నిర్మాణం కోసం కర్ణాటక, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలను ఒప్పించడానికి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి అని ఆయన విజ్ఞప్తి చేశారు. హెచ్‌ఎల్ సి, ఎల్ఎల్‌సి ద్వారా రాయలసీమకు నికరంగా రావలసిన వాటా నీళ్లు మాత్రం రావడం లేదు అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాయలసీమ పశ్చిమ ప్రాంతానికి తుంగభద్ర సమాంతర కాలువ గేమ్ చేంజర్ అవుతుంది. ఈ కాలువ ద్వారా నీళ్లు గ్రావిటీ పై తీసుకురావచ్చు అని కెవి రమణ వివరించారు.

# రాష్ట్ర వ్యాప్తంగా 'సంజీవని' అమలుకు టెండర్లు

• ఆగస్టు 14 లోపు దాఖలు చేయాలి • డిజిటల్ వైద్య సేవల రంగంలో అనుభవం ఉన్న వారు అర్హులు • 5 కోట్లకు పైగా ఉన్న రాష్ట్ర ప్రజల ఆరోగ్య రికార్డుల నిక్షిప్తం • మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



**విజయవాడ, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవల్ని అందించడంలో నూతన అధ్యాయం సృష్టించనున్న సంజీవని పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. సంజీవని ( ఇంటిగ్రేటెడ్ డిజిటల్ కేర్ కోఆర్డినేషన్ అండ్ హెల్త్ కేర్ డెలివరీ సిస్టం) అమలుకు అవసరమైన విస్తృతమైన, పటిష్టమైన సమీకృత సాంకేతిక వేదిక(ప్లాట్ ఫాం)ను రూపొందించి, 5 సంవత్సరాల పాటు సేవలందించేందుకు సంబంధించిన పలు నిబంధనలతో కూడిన ఆర్ఎఫ్‌పి (రిక్వస్ట్ ఫర్ పార్టిసిపేషన్)ని ప్రభుత్వం బుధవారం వెల్లడించింది. ఈ ఆర్ ఎఫ్‌పికి సంబంధించిన వివిధ అంశాలపై ఉన్నతాధికారులతో సమగ్రంగా చర్చించి మంగళవారం వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదించారు. ఈ పథకానికి సంబంధించిన వివిధ అంశాలను నిర్ణీత కాలపరిమితిలో అమలుపరిచేలా నిరంతర పర్యవేక్షణతో పటిష్టమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రీబిడ్ మీటింగ్ జులై 27 ప్రీబిడ్ మీటింగ్ లో ఉత్పన్నమయ్యే అంశాలపై వివరణ జులై 31న ఇస్తారు. టెండర్ల దాఖలుకు ఆఖరు తేదీ ఆగస్టు 14 నిర్ణయించారు. టెక్నికల్ బిడ్ మదింపు ఆగస్టు 19న ఫైనాన్షియల్ బిడ్ మదింపు ఆగస్టు 31ని నిర్ణయించారు. టెండర్లపై తుది నిర్ణయం సెప్టెంబర్ 7న తీసుకుంటారు., వేగంగా విస్తరిస్తున్న డిజిటల్ వైద్య సేవల రంగంలో అనుభవం ఉన్న భారతీయ సంస్థలు టెండర్లు వేయడానికి అర్హులని, వివిధ జాతీయ, రాష్ట్ర ఆరోగ్య పథకాల కింద సేవలందించిన అనుభవం ఉండాలని, మూడేళ్ల అనుభవాన్ని పరిగణలోకి తీసుకుంటామని ప్రభుత్వం వెల్లడించింది. సంజీవని పథకం ప్రధానంగా డిజిటల్ సాంకేతికత ఆధారంగా అమలుకానున్నందున క్యూసీబియస్ విధానంలో టెండర్లపై తుది నిర్ణయాన్ని తీసుకుంటామని తెలియపరిచింది


**సంజీవనితో నూతన అధ్యాయం:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీ వ్యయంతో పలు ఆరోగ్య పథకాలు అమలు చేస్తున్నా, అంతిమంగా ఆశించిన ఫలితాలు పొందడంలో స్పష్టమైన లోటు కనపడుతోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో ఆందోళన వెలిబుచ్చారు. దాదాపు 40 పథకాలు విడివిడిగా అమలవుతుండటం, వాటి మధ్య సమన్వయ లోపం, సమీకృత దృష్టితో కాకుండా విడివిడిగా ఆయా పథకాల ఫలితాలను అంచనా వేయడం, రియల్ టైంలో ప్రజల ఆరోగ్య స్థితిని మదింపు చేసి తగు విధంగా క్లినికల్ పరంగా జోక్యానికి వీలు లేకపోవడం వంటి పలు కారణాలతో ప్రస్తుత విధానంలో ఆశించిన మేరకు సత్ఫలితాలు రావడం లేదని మంత్రి వివరించారు. ఈ ప్రతికూల పరిస్థితిని అధిగమించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు ఆరోగ్య శాఖ సంజీవని పథకాన్ని రూపొందించి కుప్పంలో గత జులైలో పైలట్‌గా అమలుపరిచి త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా అమలుపరిచేందుకు టెండర్లను ఆహ్వానించామని మంత్రి తెలిపారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని మొత్తం 5 కోట్లకు పైగా ఉన్న ప్రజల ఆరోగ్య స్థితిగతులను నిక్షిప్తం చేసి, వివిధ అంశాల్లో వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు నమోదే చేసి, ప్రజల ఆరోగ్య చరిత్ర ఆధారంగా వారి ఆరోగ్యానికి సంబంధించి ఎదురయ్యే సమస్యలపై ముందుగానే ప్రజలకు హెచ్చరించి, తగు చికిత్సల కోసం డాక్టర్లతో సంప్రదింపుల సమయాలను కూడా ఏర్పాటు చేసి, అవసరాల మేరకు టెలికన్సల్టేషన్లు, వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా వైద్య సేవలందించే సదుపాయాన్ని కల్పించి, వైద్యుల సూచనల మేరకు రోగులు చికిత్స పొందారా లేదా అన్న విషయాన్ని కూడా సంజీవని పథకంలో పర్యవేక్షిస్తారని మంత్రి వివరించారు.

డిజిటల్ ప్లాట్‌ఫాం ఆధారంగా అమలుకానున్న సంజీవని పథకం వలన సుదూర ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు కూడా వైద్య సేవలందుతాయని, వ్యాధి లక్షణం బయడపడ్డ దగ్గరి నుంచి అది పూర్తిగా నయమయ్యే దాకా (కంటిన్యువం ఆఫ్ కేర్) ఈ పథకంలో పర్యవేక్షణ ఉంటుందని, ఈ విధంగా సంజీవని ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఒక నూతన అధ్యాయాన్ని సృష్టించనున్నదని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ పథకం ద్వారా తమ ఆరోగ్య రక్షణ కోసం పౌరులు తమ జేబుల్లోంచి పెట్టే వ్యయాన్ని తగ్గించనున్నామని మంత్రి అన్నారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించి 12 ప్రధాన అంశాలను సంజీవని పథకంలో ప్రభుత్వం పొందుపరిచింది. ఇవి తల్లి మరియు నవజాత. పిల్లల ఆరోగ్యం, రిప్రొడక్టివ్ హెల్త్, సంక్రమిక మరియు అసంక్రమిక వ్యాధులు, మానసిక ఆరోగ్యం, దంత ఆరోగ్యం, కన్ను, ఇన్‌ఎన్‌టి సంరక్షణ, ట్రామా కేర్, ఉపశమన వైద్యం, పెద్దల ఆరోగ్యం, వైద్య నిర్ధారణ పరీక్షలు మరియు ఉచిత మందుల సరఫరా. ఆయా ఆరోగ్య పథకాల కింద ఉత్పన్నమయ్యే వ్యక్తుల సమాచారాన్ని సమీకరించి దాని ఆధారంగా ప్రజలకు తగు సూచనలు, సలహాలను అందించి తద్వారా రియల్ టైంలో అవసరాల మేరకు వైద్య పరంగా జోక్యం చేసుకునేందుకు అవసరమైన డిజిటల్ హెల్త్ ప్లాట్‌ఫాంను రూపొందించి, 5 ఏళ్ల పాటు టెండర్ విజేత నిర్వహించాల్సి ఉంటుందని ఆర్ ఎఫ్‌పిలో ప్రభుత్వం స్పష్టం చేసింది. వ్యాధులు సోకినప్పుడు చికిత్సనందించే సాంప్రదాయ విధానానికి భిన్నంగా, వ్యాధుల రాకను ముందుగానే పసిగట్టి వాటి నివారణకు చర్యలు తీసుకుని, తద్వారా వ్యక్తులు, సమాజంపై అనారోగ్య భారాన్ని భారీ స్థాయిలో తగ్గించేందుకు సంజీవని పథకం నూతన బాటలు వేస్తుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

# రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తా.. రైతులకు మద్దతుగా నిలుస్తా!

• పొగాకు రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకూ పోరాటం కొనసాగిస్తా: - మాజీ సిఎం జగన్

**విజయవాడ, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి రైతులకు మద్దతుగా నిలుస్తామని మాజీ సీఎం వైఎస్ జగన్మోహనరెడ్డి స్పష్టం చేసారు. ధరల సంక్షోభంతో తల్లడిల్లు తున్న రైతులకు అండగా నిలిచేందుకు పోరాటం ఉధృతం చేస్తామని వెల్లడించారు. పొగాకు రైతులకు మద్దతుగా పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటన చేస్తానని తెలిపారు. రైతుల సమస్యలు తెలుసుకునేందుకు తానే స్వయంగా వారి వద్దకు వస్తానని జగన్ స్పష్టం చేసారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ పొగాకు రైతులతో సమావేశం అయ్యారు. పొగాకు రైతుల సమస్యలను తెలుసుకునేందుకు త్వరలో పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటిస్తానని వెల్లడించారు. గోపాలపురం లేదా జంగారెడ్డి గూడెంలో పొగాకు రైతులను కలుస్తానని చెప్పారు. ప్రభుత్వం పైన మరింత ఒత్తిడి తీసుకొచ్చే కార్యక్రమం ప్రారంభిస్తామని ప్రకటించారు. ఆ తరువాత కూడా ప్రభుత్వం స్పందించక పోతే కందుకూరులో మరో పర్యటన చేస్తానని చెప్పారు. పొగాకు రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకూ పోరాటం కొనసాగిస్తానని వెల్లడించారు. ఏ జిల్లాలో ఏ పంట కోసం రైతులు ఇబ్బంది పడుతున్నా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. పొగాకు వేలం ప్రారంభమై దాదాపు 94 రోజులు గడిచినా పండిన పంటలో కేవలం 16.5 శాతం మాత్రమే కొనుగోలు చేసారని జగన్ వివరించారు. సాధారణంగా వంద రోజుల్లో పూర్తి కావాల్సిన కొనుగోలు ప్రక్రియలో 94 రోజులు గడిచినా అయిదో వంతు కూడా కొనకపోవటం ప్రభుత్వ వైఫల్యంగా పేర్కొన్నారు. సెప్టెంబర్ లో కర్ణాటకలో వేలం ప్రారంభమైతే వ్యాపారులు అక్కడికి వెళ్లిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసారు. పొగాకు రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని జగన్ ప్రకటించారు.




# మోడీ వినాశకాలం మొదలైంది.. లీకుల సర్కార్‌ను కూల్చేవరకు వదిలేది లేదు!

• ఢిల్లీ వీధుల్లో విద్యార్థుల రక్తం ఏరులై పారుతోంది • ఇది ప్రభుత్వమా? రాక్షస రాజ్యమా? • సిడబ్ల్యుసి సభ్యులు ఎన్. రఘువీరారెడ్డి ధ్వజం

**మడకశిర టౌన్, జులై 22 ప్రభాతవార్త:** "కేంద్రంలో నరేంద్ర మోడీ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో దారుణంగా చెలగాటమాడుతోందని దేశంలో విద్యా వ్యవస్థను బూడిద చేస్తూ, నిరుద్యోగులను ఆత్మహత్యల వైపు నెట్టివేస్తున్న ఈ నిరంకుశ పాలనకు నూకలు చెల్లాయ్ అని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సిడబ్ల్యుసి) సభ్యులు, మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి నిప్పులు చెరిగారు. బుధవారం శ్రీసత్యసాయి జిల్లా మడకశిర పట్టణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మోడీ అధికారంలోకి వచ్చిన గత 12 ఏళ్ల పాలనలో నీట్‌తో సహా ఏకంగా 152సార్లు పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని రఘువీరారెడ్డి దుయ్యబట్టారు. రేయింబవళ్లు కష్టపడి చదివే కోట్ల మంది విద్యార్థుల కష్టాన్ని లీకేజీ మాఫియాకు తాకట్టు పెట్టారని మండిపడ్డారు. పేపర్ల లీకేజీల వల్ల భవిష్యత్తు అంధకారమై దేశవ్యాప్తంగా వందలాది మంది విద్యార్థులు, నిరుద్యోగులు ఆవేదనతో ప్రాణాలు తీసుకుంటున్నా ఈ ప్రభుత్వానికి కనీసం చలనం లేకపోవడం దారుణమన్నారు. మోడీ ప్రభుత్వం చెప్పిన అబద్ధాలు, నెరవేర్చని హామీలపై రఘువీరారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యేడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన మోడీ, ఉన్న ఉద్యోగాలనే ఊడగొట్టారని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో 4.5శాతంగా ఉన్న నిరుద్యోగం, నేడు మోడీ పాలనలో 15శాతానికి పెరిగిపోయిందన్నారు. 2014లో 6.5 కోట్లుగా ఉన్న నిరుద్యోగుల సంఖ్య నేడు 21 కోట్లకు చేరిందని గణాంకాలతో ఎండగట్టారు. దేశంలో 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా భర్తీ చేయకుండా యువత జీవితాలతో ఆడుకుంటున్నారని, పైగా దేశవ్యాప్తంగా 94 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసి పేదలకు చదువును దూరం చేశారని ధ్వజమెత్తారు. లీకుల ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ గత నెల రోజులుగా ఢిల్లీ నడిబొడ్డున శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీలతో విరుచుకుపడటం హేయమైన చర్య అని రఘువీరారెడ్డి తీవ్రంగా ఖండించారు.

సోనమ్ గారు 20 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నా ఈ ప్రభుత్వానికి కంటికి కనిపించడం లేదా?

'చలో పార్లమెంట్' అని తరలివచ్చిన విద్యార్థులకు సమాధానం చెప్పలేక, లీకేజీలకు కారణమైన మంత్రులపై చర్యలు తీసుకోకుండా, అమాయక విద్యార్థులను రక్తం వచ్చేలా కొట్టించడం క్షమించరాని నేరం. ఈరోజు ఢిల్లీ వీధుల్లో విద్యార్థుల రక్తపు మరకలు ఏరులై కనిపిస్తున్నాయి. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, రాజ్యసభలో మల్లికార్జున ఖర్గేలు విద్యార్థుల భవిష్యత్తుపై, నీట్ లీకేజీలపై చర్చించాలని డిమాండ్ చేస్తుంటే స్పీకర్ ప్రభుత్వ అనుమతి కావాలనడం ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేయడమేనని రఘువీరారెడ్డి మండిపడ్డారు. నిరసన తెలపడానికి వెళ్లిన రాహుల్ గాంధీ పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు అహంకారపూరితంగా ఉందన్నారు. నిన్నటి వరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరిన యువత, నేడు 'మోడీ హఠావో.. దేశ్ కో బచావ్' అనే నినాదంతో రోడ్లపైకి వచ్చారన్నారు. ఎవరితో పెట్టుకోకూడదో ఆ విద్యార్థులు, నిరుద్యోగులతో మోడీ ప్రభుత్వం పెట్టుకుంది. మీ వినాశ కాలం సమీపించిందని రఘువీరారెడ్డి అన్నారు. ఇక మిమ్మల్ని ప్రజలు ఎంతోకాలం భరించరు అని హెచ్చరించారు. విద్యార్థులకు, నిరుద్యోగులకు కాంగ్రెస్ పార్టీ పూర్తి అండగా ఉంటుందని, మోడీ ప్రభుత్వం పతనం అయ్యేంతవరకు ఈ పోరాటం ఆగేది లేదని రఘువీరారెడ్డి స్పష్టం చేశారు.

## చైనా ఓపెన్‌లో ఉన్నతి, శెట్టిలను
# ఓడించిన సింధు
### పురుషుల సింగిల్స్‌లో ఆయుష్ సంచలనం





**న్యూఢిల్లీ:** చైనా ఓపెన్-2026 టోర్నమెంట్‌లో, పీవీ సింధు తన స్వదేశీ క్రీడాకారిణి ఉన్నతి హుడాపై మూడు గేమ్‌ల విజయంతో తన ప్రయాణాన్ని ప్రారంభించింది. జపాన్ ఓపెన్‌లో విజయం సాధించి మంచి ఫామ్‌లో ఉన్న ప్రపంచ 15వ ర్యాంకర్ చాంగ్‌జౌలో బుధవారం జరిగిన చైనా ఓపెన్‌లో హుడాను 21-14, 9-21, 21-10 తేడాతో ఓడించింది. అలాగే పురుషుల సింగిల్స్ లో, ఆయుష్ శెట్టి మొదటి రౌండ్‌లో ఇండోనేషియాకు చెందిన ప్రపంచ నంబర్ 11 అల్వి ఫర్హాన్‌ను మూడు గేమ్‌లలో ఓడించి సంచలనం సృష్టించాడు. యువ భారత షట్లర్ మాజీ జూనియర్ ఛాంపియన్‌ను 21-17, 5-21, 21-17 తేడాతో ఓడించి రౌండ్ ఆఫ్ 16లో తన స్థానాన్ని ఖాయం చేసుకున్నాడు. చైనా జట్టుతో జరిగిన పోరులో భారత డబుల్స్ జట్టుకు చాలా కష్టంగా గడిచింది. రోహన్ కపూర్-రుత్విక శివాని గద్దె, టాప్ సీడెడ్ జోడీ అయిన యాన్ జె ఫెంగ్-డాంగ్ పింగ్ హువాంగ్ చేతిలో 21-9, 21-16 తేడాతో ఓడిపోయారు. ఇక ధ్రువ్ కపిల-తనిషా క్రాస్టో కూడా జిన్ వా గువో-ఫాంగ్ హుయ్ చెన్‌ల చేతిలో వరుస గేమ్‌లలో 21-18, 21-18తో ఓడిపోయారు. పురుషుల డబుల్స్ జోడీ ఎంఆర్ అర్జున్-హరిహరన్ అమ్సకరుణన్ నాలుగో సీడ్ జోడీ వీ కెంగ్ లియాంగ్-చాంగ్ వాంగ్‌ల చేతిలో ఓటమి పాలయ్యారు.

## ఐసిసి వన్డే ర్యాంకింగ్ టాప్ 4లో
# గిల్, రోహిత్, కోహ్లీ



**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్‌పై అద్భుత ప్రదర్శనతో శుభ్‌మన్ గిల్ ఐసీసీ పురుషుల వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరువయ్యాడు. అదే సమయంలో, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ కూడా తాజా అప్‌డేట్‌లో అగ్రస్థానంలో భారత్ ఉనికిని మరింత బలోపేతం చేశారు. మిచెల్ 802 రేటింగ్ పాయింట్లతో నెం.1 స్థానంలో కొనసాగుతుండగా, ఇంగ్లండ్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో 188 పరుగులు సాధించిన గిల్ ఇప్పుడు కేవలం ఒక పాయింట్ వెనుకబడ్డాడు. కోహ్లీ 767 రేటింగ్ పాయింట్లతో మూడో స్థానంలో కొనసాగుతుండగా, రోహిత్ 758 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉన్నాడు. భారత్‌తో జరిగిన సిరీస్‌ను ఇంగ్లండ్ కైవసం చేసుకుంది. సిరీస్ అంతటా నాటౌట్‌గా నిలిచి 249 పరుగులు చేసిన కుడిచేతి వాటం బ్యాట్స్‌మెన్ జో రూట్ వన్డే బ్యాటర్ ర్యాంకింగ్స్‌లో నాలుగు స్థానాలు ఎగబాకి 8వ స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లండ్ తరఫున బెన్ డకెట్ 11 స్థానాలు ఎగబాకి సంయుక్తంగా 19వ స్థానానికి చేరుకున్నాడు. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘనిస్తాన్ లెగ్ స్పిన్నర్ రషీద్ ఖాన్ తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. భారత్‌పై ఐదు 3 పడగొట్టిన ఇంగ్లండ్ ఫాస్ట్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ ఒక స్థానం ఎగబాకి మూడో స్థానానికి చేరుకున్నాడు. వెస్టిండీస్ ఎడమచేతి వాటం స్పిన్నర్ గుడకేష్ మోతీ ఏడు స్థానాలు ఎగబాకి సంయుక్తంగా 9వ స్థానానికి చేరుకుని టాప్ 10లోకి ప్రవేశించాడు. భారత ఆటగాడు అక్షర్ పటేల్ కూడా 10 స్థానాలు ఎగబాకి సంయుక్తంగా 32వ స్థానానికి చేరుకుని గణనీయమైన పురోగతి సాధించాడు. బ్రేస్‌వెల్ ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో రెండు స్థానాలు ఎగబాకి తన కెరీర్‌లోనే అత్యుత్తమమైన మూడవ స్థానానికి చేరుకున్నాడు. ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన అజ్మతుల్లా ఒమర్జాయ్ ఈ విభాగంలో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, బంగ్లాదేశ్ కెప్టెన్ మెహిదీ హసన్ మిరాజ్ రెండవ స్థానంలో నిలిచాడు.



## ప్రణేష్ చేతిలో గుకేశ్ ఓటమి

**న్యూఢిల్లీ:** చెన్నై గ్రాండ్ మాస్టర్స్‌లో ఎం. ప్రణేష్, ప్రపంచ ఛాంపియన్ డి. గుకేష్‌ను 39 ఎత్తులలో ఓడించి తన కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని కైవసం చేసుకున్నాడు. దీంతో గుకేష్ వరుసగా రెండవ ఓటమిని చవిచూశాడు. అనుకూలమైన స్థితిలో ఉండి ఎరిగైసి అర్జున్ చేతిలో ఓడిపోయిన మరుసటి రోజే, గుకేశ్ మళ్ళీ ప్రణేష్ చేతిలో తన ఆధిక్యాన్ని చేజార్చుకున్నాడు. కరోకాన్‌లో తెల్ల పావులతో ఆడుతున్న ప్రణేష్, మొదట్లో ఆ ఎత్తుగడ తనను ఒత్తిడికి గురిచేసినప్పటికీ, లాంగ్ కాస్లింగ్ చేసి సంక్లిష్టతలను కొనితెచ్చుకున్నాడు. గుకేష్ బలమైన క్యూసి7 మరియు ఎన్‌బి4 ఎత్తుగడలను ఎదుర్కొని, విజయం సాధించేందుకు దగ్గరగా కనిపించాడు. అయితే, డి3 వద్ద సరైన సమయంలో లభించిన పాన్ బ్రేక్ వంటి అవకాశాలను చేజార్చుకోవడంతో, అతను తన పొజిషన్‌ను సద్వినియోగం చేసుకోలేకపోయాడు. అతను తన రూక్‌ను బి5కు కదిపిన తర్వాత ప్రణేష్ తిరిగి పోటీలోకి వచ్చాడు, కానీ బి5 ఎత్తు ఆ యువ ఆటగాడిని పూర్తి నియంత్రణలో ఉంచింది.

# నేటి నుండి జింబాబ్వేతో టి20 సిరీస్
### టీమిండియాకు హ్యాట్రిక్ క్లీన్ స్వీప్ ముప్పు
### అదే బలహీన స్కెచ్‌తో బరిలోకి జింబాబ్వే



**న్యూఢిల్లీ:** ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల్లో భారత బ్యాటింగ్ విభాగాన్ని కోలుకోలేని దెబ్బతీసిన బౌన్సర్ల ముప్పు, ఇప్పుడు జింబాబ్వే సిరీస్‌లోనూ టీమిండియాను తీవ్రంగా కలవరపెడుతోంది. పరుగుల వేటలో షార్ట్ పిచ్ బంతులను ఎదుర్కోలేక పదే పదే వికెట్లు పారేసుకుంటున్న టీమిండియా యువ బ్యాటర్లపై ఈ నెల 23 నుండి హరారే వేదికగా ప్రారంభమవుతున్న టీ20 సిరీస్‌లో మరోసారి పేస్ దండయాత్రకు ప్రత్యర్థి వ్యూహాలు రచిస్తోంది. ఇటీవల ముగిసిన ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల్లో టీమిండియా ఎదుర్కొన్న వరుస ఓటములకు ప్రధాన కారణం బ్యాటర్ల వైఫల్యమే. ప్రత్యర్థి ఫాస్ట్ బౌలర్లు సంధించిన పవర్ ఫుల్ షార్ట్ పిచ్ బంతులను అంచనా వేయడంలో టీమిండియా బ్యాటర్లు ఘోరంగా తడబడ్డారు. ఈ బలహీనతను పసిగట్టిన జింబాబ్వే బౌలర్లు కూడా అదే అస్త్రాన్ని ఉపయోగించేందుకు సిద్ధమయ్యారు. హరారే మైదానంలోని పిచ్‌లు ఎంతో వేగంతో పాటు అధిక ఉత్సాహపూరితమైన ఎత్తు (బౌన్స్) కలిగి ఉంటాయి. ఇది ప్రత్యర్థి ఫాస్ట్ బౌలర్లకు కొండంత బలాన్ని ఇవ్వనుంది. యూకే సిరీస్‌లో భారత ఆటగాళ్ల పరాభవాన్ని నిశితంగా గమనించిన జింబాబ్వే యాజమాన్యం, తమ జట్టులోని ధాటిగా బౌలింగ్ చేసే ఫాస్ట్ బౌలర్లను రంగంలోకి దించుతోంది. ముఖ్యంగా ఎడమచేతి వాటం ఫాస్ట్ బౌలర్ రిచర్డ్ ఎన్గారవా తన యార్కర్లతో పాటు షార్ట్ బంతులతో విరుచుకుపడటంలో దిట్ట. ఇటీవల బంగ్లాదేశ్‌పై హరారేలోనే జరిగిన టీ20 సిరీస్‌లో కేవలం మూడు మ్యాచ్‌ల్లోనే 8 వికెట్లు తీసి ప్రత్యర్థులను వణికించాడు. అతనితో పాటు, పొడవాటి బౌలర్ బ్లెస్సింగ్ ముజరబానీ కూడా భారత బ్యాటర్లకు పెద్ద ముప్పుగా మారనున్నాడు. బంగ్లాదేశ్ సిరీస్‌లో కేవలం 5.75 ఎకానమీతో అత్యంత పొదుపుగా బౌలింగ్ చేసి కీలక వికెట్లు పడగొట్టాడు. వీరిద్దరితో పాటు మరో ఫాస్ట్ బౌలర్ బ్రాడ్ ఈవాన్స్ కూడా తన వేగవంతమైన షార్ట్ బంతులతో భారత ఆటగాళ్లను ఇబ్బంది పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాడు.

ఈ పరిస్థితుల్లో భారత జట్టులోని పలువురు కీలక ఆటగాళ్లు ఇటీవల షార్ట్ బంతులకు వికెట్లు సమర్పించుకోవడం ఆందోళన కలిగిస్తోంది. వైభవ్ సూర్యవంశీతో పాటు వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ ఈ రకమైన బంతులను ఎదుర్కొనే క్రమంలో ఒత్తిడికి లోనవుతున్నారు.

వీరితో పాటు విస్ఫోటక ఓపెనర్ అభిషేక్ శర్మ, ఆల్‌రౌండర్ శివమ్ దూబే కూడా షార్ట్ పిచ్ బంతులకు ఔట్ కావడం గమనార్హం. జింబాబ్వేతో జరిగే ఈ మ్యాచ్‌లలో మన ఆటగాళ్లు తమ లోపాలను ఎంత త్వరగా సరిదిద్దుకుని, సాంకేతికతను మెరుగుపరుచుకుంటారో అనే దానిపైనే సిరీస్ ఫలితం ఆధారపడి ఉంటుంది.

## ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో నిరాశతో ప్రారంభించిన భారత్ షూటర్లు

**న్యూఢిల్లీ:** ఆసియా క్రీడల తొలి రోజున చైనా పతకాలను కైవసం చేసుకోగా, ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్ ఆఖరి సన్నాహక మ్యాచ్‌లో భారత షూటర్లు తడబడ్డారు. ఈ ఈవెంట్‌లో భారత షూటర్లకు నిరాశాజనకమైన ఆరంభం లభించింది, దేశానికి చెందిన రెండు 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ జట్లలో ఏదీ కూడా క్వాలిఫికేషన్ దశను దాటి ముందుకు సాగలేకపోయింది. బుధవారం జరిగిన ప్రపంచ కప్ తొలిరోజు ఆతిథ్య చైనా ఆధిపత్యం చెలాయించి, అందుబాటులో ఉన్న రెండు స్వర్ణ పతకాలనూ కైవసం చేసుకోగా, భారత్ పతకం లేకుండానే సరిపెట్టుకుంది. పలు ప్రపంచ కప్ స్వర్ణ పతక విజేతలైన సురుచి ఇందర్ సింగ్, కేదార్లింగ్ ఉచగన్వేల జోడి 577 మొత్తం స్కోరుతో తొమ్మిదో స్థానంలో నిలిచింది. ఇందులో సురుచి 292, కేదార్లింగ్ 285 స్కోరు సాధించారు.

కేవలం మొదటి నాలుగు జట్లు మాత్రమే ముందుకు వెళ్లే క్రమంలో, చైనా రెండు ఫైనల్ స్థానాలను దక్కించుకోవడం ద్వారా తన ఆధిపత్యాన్ని చాటుకుంది. వీరిలో ఒకరైన యావో కియాన్‌క్సున్ మరియు హు కై కలిసి 591 స్కోరు సాధించి క్వాలిఫికేషన్ ప్రపంచ రికార్డును బద్దలు కొట్టారు. భారత్‌కు చెందిన రెండవ జోడీ సైన్యం, కమల్‌జీత్ కూడా 577 పరుగులు చేసినప్పటికీ, వరుసగా 288, 289 స్కోర్లతో 11వ స్థానంతో సరిపెట్టుకోవలసి వచ్చింది.




### ముడిచమురు, టారిఫ్ ఎఫెక్ట్:
# ఇన్వెస్టర్ల సంపద 4.2 లక్షలకోట్లు ఆవిరి
### నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబయి,జులై 22:** అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరగడం, ఇరాన్‌కు సంబంధించిన భౌగోళిక ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాల్చడం, అమెరికా ప్రకటించిన కొత్త టారిఫ్ విధానం ప్రభావంతో భారత స్టాక్ మార్కెట్లు బుధవారం భారీ నష్టాలతో ముగిశాయి. గత 10 ట్రేడింగ్ సెషన్లలో ఇదే అతిపెద్ద పతనంగా నమోదైంది. మార్కెట్ పతనంతో పెట్టుబడిదారుల సంపదలో సుమారు రూ.4.2 లక్షల కోట్లు ఆవిరైనట్లు బీఎస్ఈ గణాంకాలు వెల్లడించాయి. నిఫ్టీ 50 సూచీ 191.45 పాయింట్లు కోల్పోయి 23,996.25 వద్ద ముగియగా, సెన్సెక్స్ 715.06 పాయింట్లు పడిపోయి 76,755.05 వద్ద స్థిరపడింది. వరుసగా మూడో ట్రేడింగ్ సెషన్‌లోనూ ప్రధాన సూచీలు నష్టాల్లోనే ముగిశాయి.అమెరికా మరోసారి ఇరాన్‌పై వైమానిక దాడులు జరపడంతో ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు ఒక్కసారిగా ఎగిశాయి. ఇదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిగుమతి చేసుకునే జనరిక్ ఔషధాలపై దశలవారీగా భారీ టారిఫ్‌లు విధించనున్నట్లు ప్రకటించడం కూడా పెట్టుబడిదారుల ఆందోళనను పెంచింది. ఇరాన్‌కు సంబంధించిన భౌగోళిక పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారే అవకాశాలు ఉండటంతో మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి పెరిగింది.ముడి చమురు ధరలకు మళ్లీ జోష్అమెరికా వరుసగా 11వ రాత్రి కూడా ఇరాన్‌పై సైనిక దాడులు నిర్వహించడంతో బుధవారం అంతర్జాతీయ ముడి చమురు ధరలు దాదాపు 4 శాతం ఎగిశాయి.ప్రపంచ ప్రమాణమైన బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 3.5 శాతం పెరిగి 94.20 డాలర్లకు చేరగా, అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ ధర 3.8 శాతం పెరిగి 87.56 డాలర్ల వద్ద ట్రేడైంది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిగుమతి చేసుకునే జనరిక్ ఔషధాలపై కొత్త టారిఫ్ విధానాన్ని ప్రకటించారు. దీనితో ఫార్మా రంగ షేర్లపై కూడా ఒత్తిడి పెరిగింది.ట్రంప్ ప్రకటించిన ప్రణాళిక ప్రకారం
వచ్చే ఆగస్టు 1 నుంచి వచ్చే రెండేళ్ల పాటు దిగుమతి జనరిక్ ఔషధాలపై సున్నా శాతం టారిఫ్ కొనసాగుతుంది. ఆ తరువాత ఒక సంవత్సరం పాటు 100 శాతం టారిఫ్ అమల్లోకి వస్తుంది.అనంతరం 200 శాతం టారిఫ్ విధించబడుతుంది.ఈ నిర్ణయం భారతీయ జనరిక్ ఔషధ ఎగుమతులపై భవిష్యత్తులో ప్రభావం చూపే అవకాశం ఉందనే ఆందోళనతో మార్కెట్లలో ప్రతికూల ప్రభావం కనిపించింది. మార్కెట్లకు ప్రధానంగా ఐసిఐసిఐబ్యాంకు 1.60శాతం, రిలయన్స్ 1.51శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 0.99శాతం నిఫ్టీపై ఒత్తిడి తెచ్చాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్ 1.05శాతం, స్మాలక్యాప్‌సూచీ 1.39శాతం క్షీణించింది. బిఎస్ఇలో 1458 కంపెనీలు పెరిగితే 2780 కంపెనీలు క్షీణించాయి. 193 స్థిరంగా కొనసాగాయి. బ్రెంట్‌ముడిచమురు సెప్టెంబరు ఫ్యూచర్‌ధరలు బ్యారెల్‌కు 94.77 డాలర్లుగా ఉన్నాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 96.59గా నడిచింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్ల 1.22శాతంపెరిగి రూ.1,44,623కి చేరాయి.

### వార్ ఎఫెక్ట్:
# బ్రెంట్ ముడిచమురు బ్యారెల్ 95.19 డాలర్లు




**ముంబయి,జులై 22:** అమెరికాఇరాన్ మధ్య సైనిక ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతుండటంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు బుధవారం భారీగా పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ ధర ఆరు వారాల తర్వాత తొలిసారిగా బ్యారెల్‌కు 95 డాలర్ల మార్కును దాటి ట్రేడవుతూ ప్రపంచ ఇంధన మార్కెట్లలో ఆందోళనలను పెంచింది. మధ్యప్రాచ్య ప్రాంతం నుంచి చమురు సరఫరాలకు అంతరాయం ఏర్పడే అవకాశాలపై పెట్టుబడిదారులు ఆందోళన చెందడంతో ధరలు వేగంగా పెరిగాయి.రియల్‌టైమ్ మార్కెట్ డేటా ప్రకారం భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3:15 గంటల సమయంలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు 95.19 డాలర్ల వద్ద ట్రేడవుతూ 4.23 శాతం లాభాన్ని నమోదు చేసింది. ఇదే సమయంలో అమెరికా ప్రమాణ ముడి చమురు వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ధర కూడా గణనీయంగా పెరిగింది. అమెరికాదాడులతో ముడి చమురు ధరల పెరుగుదల మరింత వేగం అందుకుంది.ఇక ఎర్ర సముద్రం ప్రాంతంలో కూడా ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఇరాన్ మద్దతు ఉన్న యెమెన్ హౌతీ తిరుగుబాటు దళాలు, సౌదీ అరేబియాతో సంబంధాలు ఉన్న నౌకలపై నౌకాదళ దిగ్బంధనం విధిస్తామని హెచ్చరించాయి. ఈ హెచ్చరికల నేపథ్యంలో కొన్ని చమురు ట్యాంకర్లు తమ ప్రయాణ మార్గాలను మార్చుకున్నట్లు వార్తలు వచ్చాయి. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఉత్పత్తి ప్రాంతాల్లో ఒకటైన మధ్యప్రాచ్యం నుంచి ముడి చమురు ఎగుమతులకు అంతరాయం ఏర్పడే అవకాశాలపై ఆందోళనలు పెరిగాయి. ఇదిలా ఉండగా, ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణించేందుకు ప్రయత్నించిన నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన రెండు చమురు ట్యాంకర్లను అడ్డుకుని నిలిపివేసినట్లు ఇరాన్ ప్రకటించింది. దీంతో ప్రపంచ చమురు సరఫరాలపై కొత్త ఆందోళనలు నెలకొన్నాయి.తాజా పరిణామాల నేపథ్యంలో బ్రెంట్ క్రూడ్ ధరలు జూన్ ప్రారంభం తర్వాత అత్యధిక స్థాయికి చేరుకున్నాయి. అమెరికాఇరాన్ మధ్య ఘర్షణలు మరింత ముదిరితే ప్రపంచ చమురు సరఫరాలకు దీర్ఘకాలిక అంతరాయం ఏర్పడే ప్రమాదాన్ని మార్కెట్లు ముందుగానే అంచనా వేస్తూ ధరలను పెంచుతున్నాయని మార్కెట్ నిపుణులుఅంచనావేస్తున్నారు.

## పేస్ స్టాక్‌బ్రోకింగ్‌పై సెబీ రూ.4 లక్షల జరిమానా

**ముంబై:** యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ ట్రేడింగ్ ఫ్రంట్‌రన్నింగ్ కేసు దర్యాప్తులో రికార్డుల నిర్వహణలో లోపాలు, అలాగే విచారణ సమయంలో తప్పుదారి పట్టించే సమాచారం అందించినందుకు పేస్ స్టాక్ బ్రోకింగ్ సర్వీసెస్ సంస్థపై సెబీ రూ.4 లక్షల జరిమానా విధించింది. ఈ ఉత్తర్వులో పేస్ స్టాక్ బ్రోకింగ్ సంస్థ ఫ్రంట్‌రన్నింగ్‌కు పాల్పడిందని సెబీ నిర్ధారించలేదు. సంస్థ నిబంధనలకు




అనుగుణంగా రికార్డులను నిర్వహించకపోవడం, దర్యాప్తుకు అవసరమైన కీలక సమాచారాన్ని సమర్పించడంలో విఫలమవడంపైనే చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. దర్యాప్తు సందర్భంగా మొత్తం 93 ట్రేడింగ్ లావాదేవీలకు సంబంధించిన ట్రేడర్‌ప్రత్యేక ఐపి అడ్రస్ వివరాలను పేస్ సమర్పించలేదని సెబీ తెలిపింది. ప్రతి ఆర్డర్‌ను ఏ డీలర్, ఏ ట్రేడింగ్ టెర్మినల్ ద్వారా అమలు చేశారో స్పష్టంగా గుర్తించగలిగే విధంగా రికార్డులు నిర్వహించడం స్టాక్ బ్రోకర్ల బాధ్యత అని నియంత్రణ సంస్థ గుర్తుచేసింది.ఈ విషయంలో పేస్ స్టాక్ బ్రోకింగ్ తన వాదనలో, సాంకేతిక పరిమితులు మరియు కోవిడ్ మహమ్మారి కాలంలో ఏర్పడిన ఇబ్బందుల కారణంగా నిర్దిష్ట ట్రేడర్లు ఉపయోగించిన ఐపిఅడ్రస్‌లను గుర్తించడం సాధ్యం కాలేదని తెలిపింది. ఆ వాదనలకు మద్దతుగా ఎలాంటి ఆధారాలు సమర్పించలేదని పేర్కొంటూ సెబీ ఆ వివరణను తిరస్కరించింది.సెబీ ఉత్తర్వు ప్రకారం, ప్రతి వ్యక్తిగత ట్రేడర్‌కు సంబంధించిన మ్యాక్ ఐడి, ఐపి అడ్రస్లను ఖచ్చితంగా గుర్తించి అనుసంధానించలేకపోయామని పేస్ స్వయంగా అంగీకరించింది. దీంతో స్టాక్ బ్రోకర్లకు వర్తించే రికార్డు నిర్వహణ నిబంధనలను సంస్థ ఉల్లంఘించినట్లు సెబీ తేల్చింది. అదనంగా, ట్రేడింగ్ టెర్మినల్ రిజిస్ట్రేషన్ల నిర్వహణలో కూడా పేస్ నిర్లక్ష్యం వహించిందని సెబీ గుర్తించింది.




## నిరాశపరిచిన డాక్టర్ రెడ్డీస్
### నికర లాభం రూ.444 కోట్లు

**ముంబయి,జులై 22:** డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ తొలి త్రైమాసికం ఫలితాల్లో బలహీన పనితీరును నమోదు చేసింది. ఆపరేటింగ్ మార్జిన్లు భారీగా క్షీణించడంతో కంపెనీ సమీకృత నికర లాభం గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే దాదాపు 68.7 పడిపోయి రూ.444 కోట్లకు పరిమితమైంది. మార్కెట్ అంచనాలప్రకారం కంపెనీ రూ.737 కోట్ల నికర లాభాన్ని నమోదు చేస్తుందని భావించినప్పటికీ, వాస్తవ ఫలితం రూ.444 కోట్లుగానే నమోదైంది.ఆదాయం కూడా తగ్గింది. గత ఏడాది తొలి త్రైమాసికంలో రూ.8,572 కోట్లుగా ఉన్న ఆదాయం ఈసారి 5.5 తగ్గి రూ.8,100 కోట్లకు చేరింది. నికర లాభం: రూ.1,418 కోట్ల నుంచి రూ.444 కోట్లకు తగ్గితే ఆదాయం రూ.8,572 కోట్ల నుంచి రూ.8,100 కోట్లకు చేరింది. ఎబిడిటా రూ.2,173 కోట్ల నుంచి రూ.861 కోట్లకు చేరింది. విశ్లేషకులు రూ.1,398 కోట్లుగా ఉంటుందని అంచనా వేశారు. ఎబిడిటా మార్జిన్ కూడా గత ఏడాది 25.3 నుంచి 10.6 కు పడిపోవడం ఆపరేటింగ్ పనితీరులో బలహీనతను స్పష్టంగా చూపించింది. మార్కెట్ అంచనా 17శాతం గా ఉండగా, వాస్తవ మార్జిన్ దానికంటే చాలా తక్కువగా నమోదైంది. ఇతర ఆదాయం మాత్రం పెరిగింది. గత ఏడాది రూ.290 కోట్లుగా ఉన్న ఇతర ఆదాయం ఈ త్రైమాసికంలో రూ.355 కోట్లకు చేరింది.

## ఇండస్ ఇండ్ బ్యాంక్ నికరలాభం రూ.1003 కోట్లు




**ముంబయి,జులై 22:** ప్రైవేట్ రంగంలోని ఇండస్‌ఇండ్ బ్యాంక్ తొలి త్రైమాసికంలో బలమైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. బ్యాంక్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 46.5 శాతం పెరిగి రూ.684 కోట్ల నుంచి రూ.1,003 కోట్లకు చేరుకుంది.బ్యాంక్‌కు సంబంధించిన నికర వడ్డీ ఆదాయం కూడా స్వల్పంగా పెరిగి రూ.4,640 కోట్ల నుంచి రూ.4,685 కోట్లకు చేరింది. ఇదే సమయంలో ఆపరేటింగ్ లాభం 1.2 శాతం వృద్ధితో రూ.2,652 కోట్ల నుంచి రూ.2,683 కోట్లకు పెరిగింది.ఆస్తుల నాణ్యత లో కూడా మెరుగుదల కనిపించింది. గ్రాస్ ఎన్‌పీఏ 3.43 శాతం నుంచి 3.25 శాతానికి తగ్గగా, నెట్ ఎన్‌పీఏ 1 శాతం నుంచి 0.95 శాతానికి తగ్గింది. బ్యాంక్ నెట్ ఇంటరెస్ట్ మార్జిన్ 3.46 శాతం నుంచి 3.57 శాతానికి మెరుగుపడింది.ఇక రానిబాకీలకోసం కేటాయింపులు కూడా తగ్గుముఖం పట్టాయి. ఈ త్రైమాసికంలో బ్యాంక్ రూ.1,340 కోట్ల ప్రొవిజన్లు చేయగా, గత త్రైమాసికంలో ఇవి రూ.1,484 కోట్లు ఉన్నాయి.

## ఉద్యోగులకోసం ఎఎస్ఎంఎల్ రూ.22 లక్షల స్టాక్‌గ్రాంట్ బోనస్!

**న్యూఢిల్లీ,జులై 22:** సెమీకండక్టర్ రంగంలో చిప్ తయారీ కంపెనీ ఏఎస్ఎంఎల్ హోల్డింగ్ ఎన్వీ తమ ఉద్యోగులను కాపాడుకునేందుకు ఒక భారీ ప్రోత్సాహకాన్ని ప్రకటించింది. కంపెనీలో దీర్ఘకాలం పాటు కొనసాగే ఉద్యోగులకు 20,000 యూరోలు అంటే రూ. 22 లక్షలవరకూ షరతులతో కూడిన స్టాక్ గ్రాంట్‌ను అందించనున్నట్లు వెల్లడించింది. కృత్రిమ మేధ కారణంగా ఆధునాతన చిప్‌లకు డిమాండ్ విపరీతంగా పెరగడంతో ఈ రంగంలో ఏర్పడిన తీవ్రమైన నిపుణుల కొరతను అధిగమించేందుకే ఈ నిర్ణయం తీసుకుంది. నెదర్లాండ్స్‌కు చెందిన ఈ టెక్నాలజీ దిగ్గజం, ఈ రిటెన్షన్ బోనస్ పథకాన్ని 2027 జనవరి 1 నుంచి ప్రారంభించనుంది. ఈ పథకం కింద ప్రయోజనం పొందాలంటే ఉద్యోగులు 2030 చివరి వరకు కంపెనీలో కొనసాగాల్సి ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఏఎస్ఎంఎల్‌లో సుమారు 44,500 మంది ఉద్యోగులు ఉండగా, అర్హులైన వారందరికీ ఈ పథకం వర్తిస్తుందని కంపెనీ స్పష్టం చేసింది. ఉద్యోగుల గత పనితీరుకు గుర్తింపుగా, భవిష్యత్తులో పెరగనున్న పనిభారానికి ప్రోత్సాహకంగా ఈ బోనస్‌ను అందిస్తున్నట్లు వివరించింది. ఈ స్టాక్ గ్రాంట్‌కు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో ఖరారు చేయనున్నారు. ఏఎస్ఎంఎల్ ఉద్యోగుల్లో సగానికి పైగా నెదర్లాండ్స్‌లో పనిచేస్తుండగా, సుమారు 8,500 మంది అమెరికాలో ఉన్నారు. ఇటీవల ఏఎస్ఎంఎల్ బలమైన ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. కంపెనీ 2.92 బిలియన్ యూరోల నికర లాభాన్ని ఆర్జించింది.




Print and Published by Gireesh Sangh, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at 11-37, Moramputi, Rajamahendravaram-533 103. Phone: 24 2460408. RNI No.64863/96, Editor: Damerla Sai Baba, Responsible for selection of News-under the PRB Act. Regd: No.H/SD/337/09-11 . Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.




తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక **వార్త**

రాజమహేంద్రవరం | గురువారం 23 జులై 2026 | I


# ఇద్దరు కోవిడ్ వ్యక్తులకు జిజిహెచ్‌లో చికిత్స



**రాజమహేంద్రవరం సిటీ, జూలై 22 (ప్రభాతవార్త)** కోవిడ్ సోకిన ఇద్దరు వ్యక్తులకు రాజమహేంద్రవరం జి జి హెచ్ లో వైద్యం చికిత్స చేస్తున్నారు. రాజమహేంద్రవరం రూరల్ కొంతమూరుకు చెందిన 54 ఏళ్ల మహిళకు నాలుగు రోజుల నుంచి దగ్గు తగ్గిపోవడంతో జిజిహెచ్ కు ఓపికి వచ్చారు. వైద్యులు ఆర్టిపిసిఆర్ చేయగా పాజిటివ్ అని తెలిసింది. గోపాల్ పురానికి చెందిన 25 ఏళ్ల మహిళ వారం కిందట జిహెచ్ లోని మాతా శిశు విభాగంలో పురుడు పోసుకున్నారు ఆమెకు జ్వరం జలుబు తగ్గకపోవడంతో కోవిడ్ పరీక్ష చేయగా పాజిటివ్ వచ్చినట్లు వైద్యాధికారులు తెలిపారు. దీంతో ఆమెను ప్రత్యేక వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. 8 మందికి ఆర్టీ పిసి ఆర్ పరీక్ష చేయగా ఇద్దరు వ్యక్తులకు పాజిటివ్ గా తేలినట్లు నిర్ధారణ అయింది. కోవిడ్ కేసులు పెరుగుతున్న దృశ్యం జిజిహెచ్ లో ప్రత్యేక వార్డులను కేటాయించారు. ప్రత్యేక బెడ్స్ తో పాటు అవసరమైన ఆక్సిజన్ సిలిండర్లను అందుబాటులో ఉంచారు. మాస్కులు ధరించాలని జన సమూహాల్లోకి వెళ్ళవద్దని నిత్యం చేతులు శుభ్రం చేసుకోవడంతో పాటు శానిటైజర్ వాడాలని భౌతిక దూరం పాటించాలని వైద్యులు సూచించారు.

# ఉపాధి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి

**మెగా జాబ్ మేళానుద్దేశించి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి.**



**రాజమహేంద్రవరంఅర్బన్,జూలై 22(ప్రభాతవార్త)** మరో మూడు నెలల్లో భారీ స్థాయిలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తామని రాజమహేంద్రవరం రూరల్ శాసన సభ్యులు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి వెల్లడించారు. ఇందుకు సిద్ధంగా ఉండాలని వివిధ శాఖలకు సూచించారు. జాబ్ మేళాకు హాజరయ్యే నిరుద్యోగులకు అవసరమైన ఏర్పాట్లు సొంత ఖర్చులతో చేస్తామన్నారు. బొమ్మూరు కలెక్టరేట్ లో మెగా జాబ్ మేళా బుధవారం నిర్వహించిన సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి ఏర్పాటుచేసిన జాబ్ మేళాకు అనూహ్య స్పందన రావడం పట్ల హర్షం వ్యక్తం చేసారు. జాబ్ మేళాలో 1600పోస్టులు భర్తీ చేయడానికి దాదాపు 14సంస్థలు వచ్చాయని ఆయన చెప్పారు. ఇలాంటి జాబ్ మేళాలు ఎక్కడికక్కడ నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గత వైసిపి పాలనలో పెట్టుబడులు వెనక్కిపోయి, పారిశ్రామిక వేత్తలు వెనుకంజ వేశారని ఎమ్మెల్యే గోరంట్ల పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక యువతకు ఉపాధి అవకాశాలపై దృష్టి పెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వ కృషితో రాష్ట్రానికి 24లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని, ఎక్కువగా పరిశ్రమలు వస్తే, యువతకు తగిన ఉపాధి లభిస్తుందని అన్నారు. మంత్రి లోకేష్ కృషితో ప్రపంచ సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి వస్తున్నాయని ఎమ్మెల్యే గోరంట్ల అన్నారు. నక్కపల్లి, కడపలలో స్టీల్ ప్లాంట్ లు వస్తున్నాయన్నారు. ఇంకా రాష్ట్రానికి ఆటోమొబైల్స్, సెల్ ఫోన్స్ తయారీ పరిశ్రమలు, ఏ ఐ ఆధారిత పరిశ్రమలు కూడా వస్తున్నాయని ఆయన వివరించారు. వీటిలో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడానికి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని యువతకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంసి చైర్మన్ మార్ని వాసుదేవ, ఎం.పి.పి వెలుగుబంటి సత్య ప్రసాద్, రూరల్ మండలం తెదేపా అధ్యక్షులు మత్యేటి ప్రసాద్, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, గంగిన హనుమంతరావు, పిన్నమరెడ్డి ఈశ్వరుడు, నన్ను కృష్ణ, కురుకూరు కిషోర్, అడ్డాల శ్రీను, జిల్లా ఉపాధి కార్యాలయ నైపుణ్యాభివృద్ధి అధికారి సిహెచ్ శిరీష, డి.ఎస్.డి.ఓ హరి శేషు, సీడ్ యాప్ జేడీఎం కిరణ్, నెక్ ఏడి రవికుమార్, ఐటిఐ ప్రిన్సిపల్ సునీల్ కుమార్, బొప్పన శ్రీను, తాడేపల్లి నాగరాజు, ప్రత్తిపాటి రామారావు చౌదరి, వట్టికూటి దత్తుడు, నిచ్చినకోళ్ల సత్తిబాబు, వల్లూరి శ్రీరామ చౌదరి, కొప్పుశెట్టి నాగేశ్వరరావు, మరియు ఐటీడీపీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబు ను కలిసిన మాజీ ఎమ్మెల్యే "పిల్లి" దంపతులు



**కాకినాడ రూరల్, జూలై 22(ప్రభాతవార్త):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ను కాకినాడ రూరల్ నియోజకవర్గం ఇన్ ఛార్జి పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులు విజయవాడ సెక్రటేరియట్ లో మర్యాదపూర్వకంగా కలిసి, పార్టీ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ,టీడీపీ కాకినాడ రూరల్ ఇంచార్జి పిల్లి అనంత లక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, పార్టీ కమిటీల ఏర్పాటు, సంస్థాగత బలోపేతం, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సంక్షేమానికి సంబంధించిన అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న కార్యకర్తల కుటుంబాలకు సంబంధించిన సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తులను ముఖ్యమంత్రికి అందజేసి, వాటిని సానుకూలంగా పరిశీలించి బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 27 నుంచి రాష్ట్ర ప్రభుత్వ రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేలా ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రికి వివరించినట్లు తెలిపారు. అలాగే రానున్న పంచాయతీ, మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి పార్టీ శ్రేణులతో కలిసి సమష్టిగా కృషి చేస్తామని వెల్లడించినట్లు తెలిపారు.

# తల్లికి వందనం ద్వారా విద్యకు ప్రోత్సాహం: మంత్రి సుభాష్



**రామచంద్రపురం,జూలై 22 (ప్రభాతవార్త):** రాష్ట్రంలో విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థుల భవిష్యత్తు కోసం కూటమి ప్రభుత్వం పలు సంస్కరణలు అమలు చేస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు.తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేసి విద్యాభ్యాసానికి ప్రోత్సాహం అందిస్తున్నామని చెప్పారు.ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న 67.47 లక్షల మంది విద్యార్థులకు రూ.10,120.78 కోట్ల ఆర్థిక సాయం అందించినట్లు మంత్రి సుభాష్ వెల్లడించారు.ఆర్థిక ఇబ్బందులతో ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సహకారంతో విద్యా రంగంలో నాణ్యత పెంపు, డిజిటల్ విద్య, మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు మంత్ర తెలిపారు.ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి ఉపయోగపడే పౌరుడిగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సుభాష్ పేర్కొన్నారు.

# తాళ్లరేవులో రోజుకి రూ.5 లక్షలు నష్టం.

## లేఖర్ల పెన్ డౌన్ తో ఆగిన రిజిస్ట్రేషన్లు...



**తాళ్లరేవు, జూలై 22 (ప్రభాతవార్త):** దస్తావేజులేఖర్ల పెన్ డౌన్ కార్యక్రమంతో తాళ్లరేవు మండలంలో రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. తాళ్ళరేవు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కార్యాలయం కరప, కాజులూరు, తాళ్ళరేవు 3 మండలాలకు చెందినది కావడంతో రోజుకి సుమారు 40 వరకు రిజిస్ట్రేషన్లు జరిగేవి. దస్తావేజులేఖర్ల సమ్మె మూడో రోజుకు చేరడంతో మూడు రోజులుగా రూ.15 లక్షల ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది. తమ డిమాండ్లు నెరవేరేంతవరకు రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా పెన్డౌన్ సమ్మెను కొనసాగిస్తామని దస్తావేజులేఖర్లు అంటున్నారు.రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన సేవలతోపాటు దస్తావేజుల తయారీని రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తూ దస్తావేజు లేఖర్ల పొట్టకొడుతోందని తాళ్లరేవు దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. ప్రభుత్వం తక్షణమే ఆ విధానానికి సంబంధించిన 396 జీఓను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. మూడవరోజు కార్యక్రమంలో మండలంలోని పలువురు దస్తావేజులేఖరులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# వాహనదారులు మల్టీ మోడల్ కనెక్టివిటీ కోసం పీఎం గతి యాప్ ఉపయోగించుకోవాలి.

**చింతూరు యం వి ఐ. చల్లారావు.**





**చింతూరు జూలై 22 ప్రభాత వార్త.**వాహనదారులు సులువైన వాహన యాక్సిఎస్ సిబిలిటీ కోసం పి యం గతి శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని చింతూరు యం వి ఐ చల్లారావు పిలుపునిచ్చారు.లాజిస్టిక్స్ ఇంటర్‌ఫేస్ ప్లాట్‌ఫామ్ తో అనుసంధానించబడిన ఏపీ ట్రాన్స్‌పోర్ట్ కనెక్ట్ యొక్క ప్రధాన ప్రయోజనాలు, ఏ పి ఐ ల ద్వారా ప్రభుత్వ లాజిస్టిక్స్ డేటాకు సురక్షితమైన యాక్సెస్‌ను అందించడం ద్వారా రవాణాదారులు, ఫ్లీట్ ఆపరేటర్లు మరియు లాజిస్టిక్స్ కంపెనీలకు ఉద్దేశించబడ్డాయని ఆయన అన్నారు. డిజిటల్ డాక్యుమెంట్ వెరిఫికేషన్ తో వాహన పత్రాల వేగవంతమైన ధృవీకరణ మరియు కాగితరహిత డ్రైవర్ ఆన్‌బోర్డింగ్, మాన్యువల్ పేపర్‌వర్క్‌ను తగ్గిస్తుందని, రియల్-టైమ్ వాహనం మరియు సరుకు రవాణా, సరుకు కదలికలను ట్రాక్ చేసి,వాహనాలను పర్యవేక్షించండం,మరియు మరింత ఖచ్చితమైన అంచనా రాక సమయాలను పొందవచ్చన ఖాళీ ట్రిప్పులను తగ్గించడానికి, రూట్ ప్లానింగ్‌ను మెరుగుపరచడానికి మరియు ఇంధన ఖర్చులను తగ్గించడానికి ఫాస్టా ట్యాగ్ మరియు రవాణా డేటాను ఉపయోగించంటం, తక్కువ నిర్వహణ ఖర్చులు, మెరుగైన ఫ్లీట్ వినియోగం, తగ్గిన నిరీక్షణ సమయం మరియు క్రమబద్ధమైన లాజిస్టిక్స్ కార్యకలాపాలు మొత్తం రవాణా ఖర్చులను తగ్గించడంలో సహాయపడతాయని తెలిపారు. ఒకే ఇంటర్‌ఫేస్ ద్వారా రోడ్డు, రైలు, విమానం మరియు ఇతర రవాణా విధానాలలోని సమాచారాన్ని యాక్సెస్ చేయవచ్చని తెలిపారు.

# సీఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

## సమన్వయంతో పనులు పూర్తి చేయాలి: కలెక్టర్ దినేష్‌కుమార్





**రంపచోడవరం, జూలై 22: ప్రభాతవార్త.** ఈ నెల 24న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పోలవరం జిల్లా రంపచోడవరంలో పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కె. దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంతకుమార్, ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షకుడు పెందుర్తి వెంకటేశ్వరరావు, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు గాంధీబాబు, ఆర్డీవో కె. సాత్తి, డీఎస్పీ కృతి, ఎస్పీవో అర్ఫత్ అలీ తదితరుల నేతృత్వంలోని ఉన్నతాధికారుల బృందం బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. పోలవరం జిల్లా ఏర్పాటైన తర్వాత ముఖ్యమంత్రి తొలిసారిగా జిల్లాకు వస్తున్నందున పర్యటనను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రంపచోడవరం సభా ప్రాంగణంతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేపట్టిన ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలోని తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మమేకమయ్యారు. బోధనా విధానం, ఉపాధ్యాయులు బోధించే పాఠాలు విద్యార్థులకు సులభంగా అర్థమవుతున్నాయా అనే అంశాలను వారిని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి సందర్శించనున్న విద్యాసంస్థల్లో తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రత, డిజిటల్ తరగతి గదులు, విద్యుత్, ఇతర మౌలిక వసతులను అధికారులు పరిశీలించారు. లోటుపాట్లు ఉంటే వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. అనంతరం సభా ప్రాంగణాన్ని పరిశీలించిన అధికారులు వేదిక నిర్మాణం, గ్యాలరీల ఏర్పాటు, ప్రముఖుల ప్రవేశ మార్గాలు, ప్రజల రాకపోకలు, భద్రత, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కావాలంటే అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, కార్యాచరణ ప్రణాళిక ప్రకారం తమకు అప్పగించిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు.

# ప్రత్యామ్నయ స్మశాన వాటికను ఏర్పాటు చేయాలి



**శంఖవరం జులై 22 ప్రభాతవార్త** ప్రత్యామ్నయ స్మశాన వాటికను ఏర్పాటు చేయాలని రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్న శివ కోరారు. శంఖవరం మండలం కత్తిపూడి కాకినాడ రోడ్లో పోలవరం కాలువపై నూతనంగా నిర్మిస్తున్న రహదారి వల్ల ప్రస్తుతం హిందూ స్మశాన వాటిక పూర్తిగా రోడ్లో పోవడంతో, రైతులు గ్రామస్తులు బుధవారం రెవిన్యూ ,పోలవరం అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ రహదారి విస్తరణలో స్మశాన వాటిక పోవడంతో ,మరో స్మశాన వాటికను ఏర్పాటుచేసి ,షెడ్డు బోర్ వసతి నిర్మించడం జరిగిందని ,మరల రోడ్డు విస్తరణలో ఉన్న స్మశానం పోతే ప్రజలకు ప్రత్యామ్నాయంగా స్థలాన్ని చూపించాలని కోరారు. నీటి సంఘం సంఘం అధ్యక్షులు దేశ లంక వెంకటలక్ష్మి వెంకటరమణ మాట్లాడుతూ వెంకన్న దొర చెరువు ఆయకట్టు రైతులకు నీరు వెళ్లేందుకు కాలువ ఏర్పాటు చేయాలని, రైతులు పొలాల్లో వెళ్లేందుకు మార్గాన్ని కూడా ఏర్పాటు చేయాలని ప్రస్తుతం రైతులు పంటలు వేసే సమయం కావడంతో రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై పోలవరం డి ఆర్ వి రఘు మాట్లాడుతూ నూతన స్మశాన వాటికకు20 సెంట్లు స్థలాన్ని ఏర్పాటు చేస్తామని, రైతులకు నెల రోజుల్లో సాగునీరు అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సూరిబాబు పోలవరం జె.ఇ. రాము, సొసైటీ చైర్మన్ ,గాబు కృష్ణ గౌతు అర్జిబాబు, నాయుడు ఈశ్వరరావు, మరుకుర్తి శ్రీను ,దూది పెద్దకాపు, రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు

# విద్యార్థి యువకులపై లాఠీచార్జి అమానుషం...

## కేంద్ర విద్యా శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి..

## కాక్రోచ్ పార్టీ సోనం వాన్చుక్ మద్దతుగా అమలాపురంలో నిరసన



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూలై22,ప్రభాతవార్త.** నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఢిల్లీలో విద్యార్థులు యువకులపై జరిగిన లాఠీచార్జి దారుణ కాండకు నిరసనగా అమలాపురంలో విద్యార్థి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం క్యాండిల్ ప్రదర్శన నిర్వహించి నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల యువకుల పట్ల కేంద్ర ప్రభుత్వం అత్యంత దారుణంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని నీట్ పరీక్ష పేపర్ లీకేజీ కారణంగా 22 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోగా కేంద్ర ప్రభుత్వం మరియు ప్రధాని నరేంద్ర మోడీ స్పందించకుండా శాంతియుతం గా ఉద్యమం నిర్వహిస్తున్న విద్యార్థులపై అమానుషంగా లాఠీచార్జి చేయడం దారుణమని అన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం లో బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యం లో విద్యార్థి యువకులు రెండు నెలలుగా దేశవ్యాప్తంగా ఉద్యమం చేస్తున్న మోడీ ప్రభుత్వం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు న్యాయం చేయాలని సోనం వాంక్షక్ 20 రోజులుగా ఢిల్లీ నడిబొడ్డున ఆమరణ నిరాహారదీక్షక చేస్తుంటే ప్రపంచ దేశాలన్నీ ఆయనకు మద్దతు పలికితే మన దేశ ప్రభుత్వం మాత్రం ఏమాత్రం పట్టించుకోకుండా ధర్మేంద్ర ప్రధాని రాజీనామా చేయకుండా విద్యార్థులపై తమన్న కాండ చేయడం అత్యంతఘోరం అని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో బాధ్యతగా కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని నీట్ పేపర్ లీకేజీలో నిందితులను కఠినం గా శిక్షించాలని విద్యావ్యవస్థ లోని లోపాలను సవరించాలని లీకేజీ కారణంగా మరణించిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలని ఢిల్లీలో శాంతియుతంగా నిరసన చేస్తున్న పర్యావరణ వేత్త సోనం వాంగ్సుక్ ను వెంటనే విడుదల చేయాలని విద్యార్థుల పై అమానుషంగా లాఠీచార్జి చేసిన పోలీసు ముసుగులో ఉన్న నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో పి డి ఎస్ యు విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతి రావు, సిపిఎం జిల్లా కార్యదర్శి కారెం వెంకటేశ్వర రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కొత్తూరు శ్రీనివాస్, రైతు కూలీ సంఘం కొండా దుర్గారావు, మానవ హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి ఆకుమర్తి రవి, పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి అమలదాసు బాబురావు, పిడిఎం కార్యదర్శి డిపాటి శివప్రసాద్ ,వి సి కె జిల్లా అధ్యక్షులు బొంతు రమణ,గెడ్డం సురేష్ బాబు, ముసిని రామకృష్ణారావు, మహబూబ్ సకిల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలోపేదలకు అధునాతన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం.



**అనపర్తి జూలై 22(ప్రభాతవార్త)** ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు అధునాతన వైద్యం అందించడమే ప్రభుత్వం లక్ష్యమని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి ఏరియా ఆసుపత్రిలో హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సభ్యులు , వైద్యులు మరియు సిబ్బందితో సమావేశమై భవన నిర్మాణాల పురోగతి,వసతుల కల్పన గురించి సమీక్షా సమావేశం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నిర్వహించారు ఇవాళ అనపర్తి 100 పడకల ఆసుపత్రిని ఒక నిదర్శనంగా చూపించే దిశగా కృషి చేస్తామని సందర్భంగా తెలియచేసిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. తప్పనిసరిగా ప్రభుత్వం ప్రజలకు వైద్యం అందించాలి సక్రమమైన వైద్యం చౌకగా క్వాలిటీ వైద్యం అందించాలనే దృష్టిలో ముందుకు వెళ్తా ఉంది. దానికి ఈ కార్యక్రమంలో హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సభ్యులు, వైద్యులు, వైద్య సిబ్బంది,కూటమి నాయకులు పాల్గొన్నారు.


**ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన**

పురపాలక సంఘ కార్యాలయం, తుని

తేది: 22-07-2026

ఆర్.ఓ.సి.నెం.388/2017-ఇ1

భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన Urban Challange Fund పథకం క్రింద తుని పురపాలక సంఘంలో "Construction of Commercial Shops and Stalls at General Market at Tuni Muncipality" ప్రోజెక్టుకు సంబంధించి సమగ్ర ప్రోజెక్టు నివేదిక తయారు చేయుటకు, తగిన అర్హత మరియు అనుభవం కలిగిన సంప్రదింపు సంస్థలు / ఏజెన్సీల నుండి ఆసక్తి వ్యక్తీకరణలు కోరడమైనది.

ఆసక్తి గల అర్హత కలిగిన సంస్థ వివరాలు, అర్హతలు, గత అనుభవం, గతంలో చేపట్టిన ప్రోజెక్టుల వివరాలు మరియు సంబంధిత ధృవపత్రాలతో కూడిన ప్రతిపాదనలను తేది.28-07-2026 సాయంత్రం గం. 4.00లోపు కమిషనరు, తుని పురపాలక సంఘం వారి కార్యా లయంలో సమర్పించవలెను. సంప్రదించవలసిన చిరునామా: కమిషనరు, తుని మున్సిపాలిటీ ఫోన్ నెం.9849905806, 98499 19262, 08854-253506

e-mail: tunimunicipality@gmail.com

సం/-ఎ. వెంకటరావు,
కమిషనరు, తుని పురపాలకసంఘం.


# వాడపల్లి క్షేత్ర అభివృద్ధిపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి...

**మాడవీధులను 40 అడుగుల వెడల్పులో విస్తరించేలా చర్యలు..**

**మరో తిరుమలగా వాడపల్లి క్షేత్రం అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తున్నాం...**

**అభివృద్ధి పనులపై అధికారులతో కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఎమ్మెల్యే బండారు. సమీక్షా సమావేశం.**









**ఆత్రేయపురం, జూలై,22,(ప్రభాత వార్త).** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం తిరుమల తిరుపతి తరహాలో వాడపల్లి ని టెంపుల్ టౌన్ గా అభివృద్ధి చేయడానికి అన్ని విధాల కృషి చేస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలియజేశారు. బుధవారం జిల్లా కలెక్టర్ , రావిరాల మహేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ నదియా కుమారి,అడిషనల్ ఎస్పీ, దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు , పాలకమండలి సభ్యులు, డిప్యూటీ కమిషనర్ ఈఓ నల్లం సూర్య చక్రధరరావు,తదితర జిల్లా అధికారులతో కలిసి ఆయన వాడపల్లి లో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ముందుగా శ్రీనివాసం 1 కాంప్లెక్స్ నిర్మాణాన్ని, వకుళమాత అన్నదాన భవన కేంద్ర నిర్మాణాన్ని, మాడవీధులను పరిశీలించారు. అనంతరం లోల్ల పార్కింగ్ ఏరియాను, గోదావరి ఘాట్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్, ఎమ్మెల్యే, బండారు సత్యానందరావు లు మాట్లాడుతూ ఆలయం చుట్టూ నాలుగు మాడవీధులను 40 అడుగుల వెడల్పులో విస్తరించాలని ఆలోచన చేస్తున్నామన్నారు.దర్శనానికి వచ్చిన వృద్ధులు, చంటి పిల్లల తల్లులు, దివ్యాంగులు ,మహిళలు ఇబ్బందులు పడకుండా ఉండడానికి తిరుమల తరహాలో కంపార్ట్మెంట్లు నిర్మాణాన్ని చేపట్టడానికి కృషి చేస్తున్నామన్నారు. రాబోయే భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ముందు ముందు ఏ విధంగా ఈ ఆలయ అభివృద్ధికి చేయాల్సిన పనులపై కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ దృష్టి సారించడం మంచి పరిణామం అన్నారు. ఊహించని రీతిలో భక్తులు వాడపల్లి తరలివస్తున్నారన్నారు. భక్తుల రాక అంచనాలు అందకుండా ఉండడంతో అందుకు తగ్గ ఏర్పాట్లు చేయడానికి సతమతమవుతున్న పరిస్థితి కనపడుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సైతం వాడపల్లి అభివృద్ధి పై దృష్టి సారించారన్నారు. ఆలయం అభివృద్ధి చెందితే ఈ ప్రాంతమంతా అభివృద్ధి చెందుతుందని తన భావనని వ్యక్తం చేశారు. వచ్చిన భక్తులకు సరైన వసతి సౌకర్యాలు కల్పించాలని అందుకోసం 54 రూములతో శ్రీనివాసం 1 నిర్మాణం జరుగుతుందన్నారు. గత రెండు సంవత్సరాల్లో 140 బాత్రూములు నిర్మించడం జరిగిందన్నారు. ఇంకా డార్మటరీలు, రూములు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఒక నెల రోజుల్లో వకుళమాత అన్నదాన భవన కేంద్రం నిర్మాణం పూర్తి అయ్యే అవకాశం ఉందన్నారు. పార్కింగ్ కి ఉన్న ఇబ్బందులు తొలగించడానికి కృషి చేశామన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిధులు అందించిన ఏటిగట్టు రహదారి పనులు కూడా త్వరలో ప్రారంభిస్తామన్నారు. భక్తులు వస్తే ఇక్కడే ఉండే విధంగా తగిన ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రూ.12 కోట్లతో శ్రీనివాసం 2 నిర్మాణానికి టీటీడీ నిధులు అందేలా ముఖ్యమంత్రి స్వయంగా సిఫార్సు చేశారన్నారు. త్వరలో అది కూడా సాకారం అవుతుందన్నారు. టెంపుల్ సిటీగా అభివృద్ధి చేయడానికి ఒక ప్లాన్ రూపొందించి ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. రానున్న పుష్కరాల్లో భాగంగా రూ.5కోట్ల నిధులతో గోదావరి ఘాట్ నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎం.వి.వి. సత్యానారాయణ, కాకినాడ జిల్లా డి సి, దారపురెడ్డి రమేష్ బాబు,డీఎస్పీ సుంకర మురళీమోహన్, తహసీల్దార్ రాపాక రామచంద్రమూర్తి, ఆర్ అండ్ బి డి ఈ, రాజేంద్ర కుమార్, ఆర్టీసీ డిఎం. కుమార్, ఆర్డబ్ల్యూఎస్ డీఈ, ఏఈ శ్రీధర్, ఎలక్ట్రికల్ ఏఈ.టి. అశోక్, వ్యవసాయ అధికారి జె. పట్టాభి రామయ్య, సీఐ. సిహెచ్ విద్యాసాగర్,ఎస్సై. ఎస్. రాము, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులతోపాటు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 31 న కలక్టరేట్ వద్ద ధర్నా ను జయప్రదం చేయాలి:

**జగ్గంపేట జూలై 22 (ప్రభాతవార్త )** వేతనాల పెంపుకోసం ఈ నెల 31 కలక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నా ను జయప్రదం చేయాలని సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి. బేబీరాణి పిలుపునిచ్చారు. స్థానిక నెహ్రూకాలనీ వద్ద బుధవారం జగ్గంపేట ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడి కార్యకర్తలు, సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 42 రోజులు సమ్మె చేసినప్పుడు టిడిపి మనకు మద్దతు ప్రకటించి అధికారంలోకి వచ్చాక సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్న సమస్యలను పట్టించుకోవడంలేదన్నారు. రిటైర్మెంట్ తర్వాత గ్రాడ్యూటీని పోరాటం ద్వారా సాధించుకున్నామన్నారు. ఏదైనా సమ్మె ద్వారానే సాధించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సంఘం జిల్లా కార్యదర్శి చంద్రావతి, ప్రాజెక్ట్ అధ్యక్షురాలు రత్నం, కార్యదర్శి సుజాత, నాయకులు లక్ష్మి, కృపాభాయ్, వెంకటలక్ష్మి, జ్యోతి, నాగదుర్గ, రామలీల తదితరులు పాల్గొన్నారు.

# మూడో రోజు కొనసాగిన కౌడా అధికారుల దాడులు..

## అక్రమ లేఅవుట్లపై ఉక్కుపాదం..



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జులై 22, ప్రభాతవార్త** కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కౌడా) ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం మూడో రోజు కూడా అక్రమ లేఅవుట్లపై విస్తృతంగా దాడులు నిర్వహించింది. జిల్లాలోని తొండంగి, శంఖవరం మండలాల్లో ప్రభుత్వ అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన లేఅవుట్లను తొలగిస్తూ చర్యలు చేపట్టింది. తొండంగి మండలం బెండపూడి గ్రామ పంచాయతీ పరిధిలో చిన్నయ్యపాలెం గ్రామానికి ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 59/4ఏలో 0.84 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన అనధికార లేఅవుట్‌ను కౌడా ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం తొలగించింది. ఇదే గ్రామంలో సర్వే నంబర్లు 62/2, 62/19, 62/22లో మొత్తం 2.40 ఎకరాలు, అలాగే సర్వే నంబర్ 69/8ఏలో 1.87 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అక్రమ లేఅవుట్లను గుర్తించి చర్యలు చేపట్టింది.అలాగే శంఖవరం మండలం కత్తిపూడి గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 180లో 1.80 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అనధికార లేఅవుట్‌పై కూడా కౌడా అధికారులు దాడి నిర్వహించారు.అక్రమ లేఅవుట్ల పై ఎట్టి పరిస్థితుల్లో నూ ఉపేక్ష ఉండదని, ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్లాట్ల విక్రయాలు చేపట్టే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని కౌడా అధికారులు హెచ్చరించారు.


**న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను**

విస్తృతమైన వార్తా సేకరణ యంత్రాంగం ఉన్న వార్త న్యూస్ నెటవర్క్‌ను మరింత పటిష్టవంతంగా చేయాలనుకుంలోంది. పాఠకులకు మరింత తాజా వార్తలను అందించేందుకు కాకినాడ జిల్లాలోని వివిధ ప్రాంతాలలో విలేకరుల యంత్రాంగాన్ని విస్తృతపరచాలని నిర్ణయించింది. ఆసక్తి గల వారికి న్యూస్ కంట్రిబ్యూటర్లయ్యే సదవకాశం కల్పిస్తోంది."

**అభ్యర్థులకు కావలసిన అర్హతలు**

- 35 ఏళ్ళ లోపు వయస్సు
- స్థానికంగా నివాసం
- ఇంటర్, డిగ్రీ
- ప్రజల జీవన స్థితిగతులపై అవగాహన

**న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలసిన కేంద్రాలు**

గండేపల్లి, కిర్లంపూడి, అన్నవరం, తొండంగి, , తుని రూరల్, కోటనందూరు, పిఠాపురం, సామర్లకోట, కరప, యానం, కాకినాడ సిటీ

ఇంటర్వ్యూలకు ఆసక్తిగల అభ్యర్థులు తమ బయోడేటాతో సంప్రదించగలరు.

'వార్త' ఆఫీస్, రాజమహేంద్రవరం

వివరములకు: 9666685998, 8096661682 నెంబర్లను సంప్రదించగలరు

## 23, 24 తేదీల్లో పోలవరం జిల్లాలో నారా లోకేష్ పర్యటన



**రంపచోడవరం, జూలై 22: ప్రభాతవార్త.** రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, రియల్‌టైమ్ గవర్నెన్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఈ నెల 23, 24 తేదీల్లో పోలవరం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నెల 23న సాయంత్రం 5.30 గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి 6.10 గంటలకు విజయవాడ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో బయలుదేరి 6.50 గంటలకు రాజమండ్రి విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం రోడ్డు మార్గంలో బయలుదేరి రాత్రి 8 గంటలకు రంపచోడవరం మండలం ఐ.పోలవరం పంచాయతీ పరిధిలోని జగరంపల్లి గ్రామ సమీపంలోని టీటీడీ ఆలయానికి చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు. ఈ నెల 24న ఉదయం 9.30 గంటలకు జగరంపల్లి నుంచి బయలుదేరి 9.50 గంటలకు రంపచోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలకు చేరుకుంటారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే మెగా పేరెంట్--టీచర్స్ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు రంపచోడవరం నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి 3 గంటలకు రాజమండ్రి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 3.10 గంటలకు విమానంలో బయలుదేరి 3.50 గంటలకు హైదరాబాద్ చేరుకుంటారు.

## జడ్డంగి పంచాయతీ సమస్యల పరిష్కారానికి వినతి



**రాజవొమ్మంగి, జూలై 22, ప్రభాత వార్త** రాజవొమ్మంగి మండలం జడ్డంగి పంచాయతీ పరిధిలోని గ్రామాల సమస్యల పరిష్కారం కోరుతూ పీసా గ్రామసభ ఆధ్వర్యంలో బుధవారం జడ్డంగి సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ కు జడ్డంగి పీసా కమిటీ ఉపాధ్యక్షులు దబ్బా దివాకర్, కార్యదర్శి తెడ్ల రాంబాబు వినతిపత్రం అందజేశారు పనిచేయని వీధి దీపాలను వెంటనే మరమ్మతులు చేసి విద్యుత్ వెలుగులు ఏర్పాటు చేయాలని, దోమల నివారణ కోసం క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలని కోరారు. వి.బి.జి. రామ్-జి సంస్థ ద్వారా పని చేసిన వేతనదారులకు ఆరు వారాలు పని చేసి నందుకు సొమ్ములు అందలేదని, ఆసొమ్ములు ఇప్పించాలని అర్జీలో పేర్కొన్నారు. పీసా గ్రామసభ కార్యదర్శి తెడ్ల రాంబాబు, పీసా ఉపాధ్యక్షులు దబ్బా దివాకర్ పాల్గొన్నారు.

## సీఎం పర్యటన నేపథ్యంలో పశువులను రోడ్లపైకి రానివ్వొద్దు



**రంపచోడవరం, జూలై 22: ప్రభాతవార్త.** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 24న రంపచో డవరంలో పర్యటించనున్న నేపథ్యంలో రహదారులపై పశువులు సంచరించ కుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని పోలవరం జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ షేక్ అహ్మద్ షరీఫ్ కోరారు. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు తదితర పశువులను రహదారులపైకి వదలకుండా రైతులు తమ పశువులను సురక్షిత ప్రదేశాల్లో కట్టి ఉంచాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో రహదారులపై పశువులు సంచరించకుండా రైతులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పంటల బీమా రైతులకు ఉపయోగం : ఏఓ చక్రధర్



**రాజవొమ్మంగి, జూలై 22, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలం ఊర్లకులపాడు, కరుదేవపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏ. ఓ. చక్రధర్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఏ. ఓ. మాట్లాడుతూ ప్రతీ రైతు పంటలు బీమాను చేయించుకోవాలని అన్నారు. వరి ఎకరానికి రూ. 648లు, ప్రత్తి ఎకరానికి రూ. 1,924 లను సి. ఎస్. సి సెంటర్, మీ సేవ ద్వారా గాని చెల్లించాలన్నారు. ఆగస్టు 15 తేదీ లోపు చెల్లించా లన్నారు. 260 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. యూరియా, డి. ఏ. పి. ఎరువులు ఏ. పి. ఏ. ఐ. యం. ఎస్ యాప్ ద్వారా ఇవ్వడం జరుగుతుందన్నారు. అన్ని పంటలకు ఇ క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఏ. ఓ. చక్రధర్, వ్యవసాయ సహాయకులు రవి, శశికాంత్, రైతులు పాల్గొన్నారు.

## వాడపల్లిని టెంపుల్ టౌన్‌గా అభివృద్ధి చేస్తాం

### ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**రావులపాలెం, జూలై 22 (ప్రభాతవార్త) :** వాడపల్లిని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని విధాలుగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. రావులపాలెంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల నియోజకవర్గంలో జరిగిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పర్యటనలను విజయవంతం చేసిన కూటమి నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. వాడపల్లి అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని, దానిని టెంపుల్ టౌన్‌గా అభివృద్ధి చేయాలని సూచించారని చెప్పారు. వాడపల్లి అభివృద్ధి చెందితే బస్టాండ్, ఆసుపత్రి తదితర మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని, దీనివల్ల రావులపాలెం ప్రాంత అభివృద్ధికి కూడా ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు శ్రీనివాసం--2 కాంప్లెక్స్ నిర్మాణానికి టీటీడీ నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## కొత్తపేటలో విరబూసిన గంట మందారం



**కొత్తపేట, జూలై 22, (ప్రభాతవార్త)** మందార పుష్పాలలో అనేక రకాలు ఉంటాయి కానీ కొత్తపేటలో గంట ఆకారంలో క్రిందికి విరబూసిన మందార పువ్వు అందరికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది వివరాలకు వెళితే కొత్తపేట కమ్మిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన పురోహితుడు మొక్కల ప్రేమికుడు డాక్టర్ పెద్దింటి రామం అపూర్వమైన మొక్కలను సేకరిస్తూ ఉంటారు ఎక్కడెక్కడ నుంచో మొక్కలను సేకరించి తమ పెరట్లో నాటి వాటిని పెంచుతూ ఉంటారు అందులో భాగంగా తాను ఈ గంట మందారాన్ని కడియపులంక నర్సరీ నుండి తెచ్చినట్లు డాక్టర్ రామం తెలిపారు దీనిని లాంతరు పుష్పం అని కూడా అంటారు గంట ఆకారంలో ఉండి కిందికి వంగి ఈ పుష్పం విరబూస్తుంది ఈ పుష్పాన్ని చూసేందుకు అనేకులు డాక్టర్ రామం ఇంటికి వస్తున్నారు పువ్వులను మొక్కలను చూసి తరిస్తున్నారు

## పలువురు పరామర్శించిన మంత్రి సుభాష్, ఏఎంసీ చైర్మన్ రిషి



**కె గంగవరం, జూలై 22, (ప్రభాతవార్త):** కె గంగవరం మండలం గంగవరం గ్రామంలో ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను మంత్రి సుభాష్, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ (రిషి) లు పరామర్శించారు. వనుం శ్రీరామ తారకం, తాజా మాజీ వైస్ ప్రెసిడెంట్ దొమ్మేటి నరసింహమూర్తి కుటుంబ సభ్యులను కలిసి వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానికులతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు

# 24న రంపచోడవరంలో సీఎం పర్యటన

### నూతనంగా ఏర్పడిన పోలవరం జిల్లాకి మొదటిసారి రానున్న సీఎం



**రంపచోడవరం, జూలై 22: ప్రభాతవార్త.** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 24న పోలవరం జిల్లా రంపచోడవరం, ఐ.పోలవరం ప్రాంతాల్లో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ముఖ్యమంత్రి 24న ఉదయం 9.10 గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10 గంటలకు రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో రంపచోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలకు చేరుకుని ఉదయం 10.20 నుంచి 11.32 గంటల వరకు నిర్వహించే మెగా పేరెంట్--టీచర్ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం సమీపంలోని ప్రజా వేదిక ప్రాంగణానికి చేరుకుని 11.35 గంటల నుంచి మధ్యాహ్నం 1.17 గంటల వరకు నిర్వహించే ప్రజా వేదిక కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం తిరిగి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలకు చేరుకుని మధ్యాహ్నం 1.20 నుంచి 1.45 గంటల వరకు విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారితో ముచ్చటిస్తారు. తదుపరి ఐ.పోలవరం బయలుదేరి టీటీడీ ఆలయం సమీపంలోని పార్టీ కార్యకర్తల సమావేశ ప్రాంగణానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం రోడ్డు మార్గంలో రంపచోడవరం చేరుకుని సాయంత్రం 4.20 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి 4.25 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 5.15 గంటలకు ఉండవల్లిలోని తన నివాసానికి చేరుకుంటారు.

## గ్రామదేవతకు ఆషాఢం సారె..

### శాకంబరీదేవి అలకరణలో బూరుగులమ్మ అమ్మవారు..



**అంబాజీపేట,జూలై 22, ప్రభాతవార్త):** అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు గ్రామ దేవత శ్రీ బూరుగులమ్మ అమ్మవారికి ఆషాఢమాసం సారెను బుధవారం సమర్పించారు. ఆషాఢమాసంను పురస్కరించుకుని అమ్మవారికి బూరెలు, గారెలు, అరిసెలు, పులిహోర, పెసరపప్పు, చలివిడి, దద్దోజనంతో పాటు లడ్డు, కాజా, మైసూర్పాక్, పాయసం తదితర సుమారు 100 రకాల పిండి వంటలతో కూడిన సారెను గ్రామ ఆడపడుచులు, భక్తులు సమర్పించేందుకు ర్యాలీగా తరలివెళ్లారు.పలువురు మహిళలు చీర-గాజులు, పసుపు-కుంకుమ,పండ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించిన ఈ ఆషాఢ సారె ఉత్సవంలో పాల్గొన్న మహిళలు, యువతులు, అమ్మవారి, స్వామివారి సేవకులు సంప్రదాయ దుస్తులు ధరించారు. ఈ సందర్భంగా గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అలాగే శ్రీ బూరుగులమ్మ అమ్మవారు శాకంబరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

## నీట్ లీకేజీపై ధర్నా..

### 24న విద్యాసంస్థల బంద్‌కు పిలుపు



**రామచంద్రపురం,జూలై 22 (ప్రభాతవార్త):** నీట్--యూజీ 2026 ప్రశ్నపత్రం లీకేజీ,ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల చర్యలను నిరసిస్తూ రామచంద్రపురంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద పీడీఎస్‌యు, ఏఐఎస్ఎఫ్, సీఐటీయూ, ఏఐటీయూసీ, బీఎస్పీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా పీడీఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధు,ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ,నీట్ పరీక్షల నిర్వహణలో పారదర్శకత తీసుకురావాలని,ప్రశ్నపత్రం లీకేజీకి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యార్థులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని,కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని కోరారు.అలాగే నీట్ పేపర్ లీకేజీ, విద్యార్థులపై పోలీసుల చర్యలకు నిరసనగా జూలై 24న రాష్ట్రవ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ బంద్‌ను విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాలు విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు,విద్యార్థులు పాల్గొన్నారు. రిజిస్ట్రేషన్లు యధావిధిగా కొనసాగుతాయి. తాళ్లరేవు సబ్ రిజిస్ట్రార్ శారద. తాళ్ళరేవు, జూలై 22 (ప్రభాతవార్త): దస్తావేజు లేఖర్ల పెన్ డౌన్ కార్యక్రమంతో ప్రజలు అసౌకర్యానికి గురికావాల్సిన పనిలేదని రిజిస్ట్రేషన్లు యధావిధిగా కొనసాగుతాయని తాళ్లరేవు సబ్ రిజిస్ట్రార్ పంతగడ శారద అన్నారు. మే ఐ హెల్ప్ యా కౌంటర్ ద్వారా రిజిస్ట్రేషన్ దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పబ్లిక్ డేటా ఎంట్రీ విధానంలో కార్యాలయంలోనే డాక్యుమెంట్ రైటింగ్ చేస్తామని తెలిపారు. ప్రజలు నేరుగా తాళ్ళరేవు కార్యాలయంకు వచ్చి రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## వరి, అరటి పంటలకు భీమా తప్పనిసరి



**కడియం, జూలై 22 ( ప్రభాతవార్త)** రైతులు వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వరి, అరటి పంటలకు తప్పనిసరిగా పంట భీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి.వి. శ్రీనివాస్ సూచించారు.కడియం మండలం, జేగురుపాడు గ్రామంలో నిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, తొలకరి పంటల సాగులో భీమా రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని తెలిపారు. ప్రస్తుతం వరి పంటలో అక్కడక్కడా ఆకు చుట్టు పురుగు ఆశించే అవకాశం ఉన్నందున, నివారణ కోసం ఒక లీటరు నీటికి 2.5 మిల్లీలీటర్ల క్లోరిపైరిఫాస్ కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.అలాగే డైఅమ్మోనియం ఫాస్ఫేట్‌కు ప్రత్యామ్నాయంగా ట్రిబుల్ సూపర్ ఫాస్ఫేట్ 46 శాతం -- 50 కిలోలు, యూరియా 20 కిలోలు వినియోగించాలని ఎరువుల వ్యాపారులకు సూచించారు.


## ఇంటింటా ప్రచారానికి సిద్ధం కావాలి



**రామచంద్రపురం,జూలై 22 (ప్రభాతవార్త):** కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు ఈ నెల 27 నుంచి నెల రోజులపాటు చేపట్టనున్న ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.పట్టణ టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కార్యకర్తలకు మంత్రి సుభాష్ సూచించారు.సమావేశంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ సంస్థ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలి..

### ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించిన ఉద్యోగులు..



**అంబాజీపేట,జూలై 22, (ప్రభాతవార్త):** జీవో ఎంఎస్ నెంబర్ 53 ద్వారా 2004 లోపు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పింఛను వర్తింపు చేసినట్లు 1999 నుండి 2004 వరకు విద్యుత్ సంస్థ ఉద్యోగులకు కూడా వర్తింపజేయాలని ఉద్యోగుల కోరుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 పిలుపులో భాగంగా పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం వినతిపత్రం సమర్పించారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపినట్లు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో 1104 యూనియన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్కిల్ రీజనల్ అధ్యక్షులు ఎం.వి. రమణ,డిస్కం ఉపాధ్యక్షులు ఎం.రాజా, డివిజన్ అధ్యక్షులు డి.నరేంద్ర కుమార్, డివిజన్ కార్యదర్శి వి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు బి.వెంకటరమణ, ఎ.బ్రహ్మాజీ, డి.సత్తిబాబు, మంచాల సత్యనారాయణ, పి.దుర్గారావు,వి.యేసురాజు, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీపై దాడి ప్రజాస్వామ్యంపై దాడే: తాడాల కొండ్రాజు



**కడియం, జూలై 22 ( ప్రభాతవార్త)** ఢిల్లీలో ప్రధానమంత్రి నివాసానికి శాంతియుత ర్యాలీగా బయలుదేరిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై జరిగిన ఘటన ప్రజాస్వామ్య విలువలపై జరిగిన దాడేనని కాంగ్రెస్ పార్టీ రాజమహేంద్రవరం రూరల్ సమన్వయకర్త తాడాల కొండ్రాజు తీవ్రంగా ఖండించారు. బుర్రిలంకలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశ యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్య, పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలు, ఉద్యోగ నియామకాలలో జరుగుతున్న అవకతవకలపై ప్రధానమంత్రి నుంచి సమాధానం కోరేందుకు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన శాంతియుత ర్యాలీని అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు.ప్రజల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ప్రతిపక్షానికి రాజ్యాంగం కల్పించిందని, ఆ హక్కును కాలరాస్తూ ప్రతిపక్ష నాయకుడిపై భౌతిక దాడికి పాల్పడటం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు, యువత భవిష్యత్తుకు సంబంధించిన అంశాలపై సమాధానం కోరేందుకు వెళ్లిన రాహుల్ గాంధీని అడ్డుకోవడం ద్వారా కేంద్ర ప్రభుత్వం తన అసహన వైఖరిని ప్రదర్శించిందని విమర్శించారు.ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలను గౌరవించడం ప్రభుత్వ బాధ్యత అని, విపక్ష స్వరాన్ని అణచివేయాలనే ప్రయత్నాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు హానికరమని కొండ్రాజు అన్నారు. రాహుల్ గాంధీపై జరిగిన ఘటనను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో రాజమహేంద్రవరం రూరల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ యాళ్ల వీరభద్రరావు, జేటి రామారావు, కడియం మండల అధ్యక్షుడు రాజు, నాయకులు రత్నం వెంకట్రావు, గోశాల రామకృష్ణ, ఉలిశెట్టి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## అస్తవ్యస్త విద్యుత్ సరఫరాతో గిరిజనుల అవస్తలు



**వి.ఆర్.పురం,జూలై 22, ప్రభాతవార్త** మండలంలోని సున్నంవారి గూడెం గ్రామంలో గత కొన్ని రోజులుగా తీవ్రమైన విద్యుత్ సమస్య నెల కొందని, అస్తవ్యస్త విద్యుత్ సరఫరాతో గిరిజనుల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సున్నం.రాజులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం రాజులు సున్నంవారిగూడెం గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యను పత్రికలకు వివరించారు. గడిచిన కొన్ని రోజులుగా గ్రామానికి 3 ఫేస్ విద్యుత్ సరఫరా కావటం లేదన్నారు. దీంతో నీటి పథకాలు పనిచేయక, నీళ్ళ కోసం గ్రామస్తులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామంలో వీధి దీపాలు వెలగక రాత్రివేళల్లో చిమ్మచీకటి నెలకొంటుందని చెప్పారు. అసలే వర్షాకాలం వీధిలైట్లు లేక ఎవరు విష సర్పాల బారిన పడాల్సివస్తుందోనని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే పంచాయతీ రాజ్, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి, గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేయాల్సివస్తుందని హెచ్చరించారు.

## రైతుల శ్రేయసే ఉద్యానవన శాఖ ధ్యేయం

### దోసకాయ విత్తన లోపాలపై తక్షణం స్పందించాం -ఆర్టికల్చర్ అధికారి సోమశేఖర్



**గొల్లప్రోలు, జూలై 22,(ప్రభాతవార్త)** దోసకాయ విత్తనాల నాణ్యత లోపంపై రైతులు చేసిన ఫిర్యాదుకు ఉద్యాన శాఖ మెరుపు వేగంతో స్పందించిందని పిఠాపురం ఉద్యానవన శాఖ అధికారి వై. సోమశేఖర్ తెలిపారు.గొల్లప్రోలుకు చెందిన ఐదుగురు రైతులు ఈ నెల 20న ఆర్ఎన్ఎస్ఎం-1 రకం దోసకాయ విత్తనాల నాణ్యత,పంట నష్టంపై అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.రైతులు ఫిర్యాదు అందిన వెంటనే తనతో పాటు గొల్లప్రోలు మండల వ్యవసాయ అధికారి కెవివి. సత్యనారాయణ రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు.అదే రోజు విత్తనాల వల్ల నష్టపోయిన రైతులు మొగలి వీరబాబు, జ్యోతుల వీరబాబు,మొగలి దొరబాబు, మాదేపల్లి చిట్టిబాబు,మొగలి లోవరాజుల పొలాలను సందర్శించి క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు.విత్తనాల కారణంగా పంట నష్టపోయిన రైతులందరికీ పూర్తి న్యాయం చేస్తామని భరోసా కల్పించడం జరిగిందన్నారు. ఈ పరిశీలన అనంతరం నివేదికను పిఠాపురం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు పి.స్వాతి దృష్టికి తీసుకుని వెళ్ళగా ఆమె డా. వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులకు లేఖ రాస్తూ సమస్య తీవ్రతను వివరించి శాస్త్రవేత్తల బృందాన్ని పంపాల్సిందిగా కారణం జరిగిందన్నారు. యూనివర్సిటీ నుంచి శాస్త్రవేత్తల బృందం వచ్చిన తర్వాత అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్,హార్టికల్చర్ ఆఫీసర్,వ్యవసాయ అధికారులతో కూడిన ఒక సంయుక్త కమిటీ ఏర్పాటు చేసి విత్తన సంస్థ ప్రతినిధులు,బాధిత రైతుల సమక్షంలోనే పూర్తి పారదర్శకంగా క్షేత్రస్థాయి విచారణ చేపట్టడం జరుగుతుందన్నారు.ఈ సంయుక్త తనిఖీల్లో పొలం పరిస్థితులు,విత్తన నమూనాలు,కాయల నాణ్యత, దిగుబడి,రక లక్షణాలను శాస్త్రీయంగా పరిశీలించి తుది నివేదికను తయారుచేసి ఆ నివేదిక ఆధారంగా చట్టపరమైన తదుపరి చర్యలు తీసుకుంటామని ఆర్టికల్చర్ అధికారి సోమశేఖర్ స్పష్టం చేశారు.రైతుల ప్రయోజనాలే పరమావధిగా ఎల్లప్పుడూ ఉద్యానవన శాఖ అడుగులు వేస్తుందని అన్నారు.

## వృథాగా పోతున్న నీటి కుళాయికి మరమ్మతులు చేపట్టాలి: ఏపీ ఆదివాసీ జేఏసీ



**దేవీపట్నం, జూలై 22 ప్రభాతవార్త :** దేవీపట్నం మండలం ఇందుకూరు గ్రామ సమీపంలోని ఎస్టీ, ఎస్సీ స్మశాన వాటికల వద్ద ఉన్న మంచినీటి కుళాయి ధ్వంసం కావడంతో పెద్ద మొత్తంలో నీరు వృథా అవుతోందని ఏపీ ఆదివాసీ జేఏసీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కుళాయికి వెంటనే మరమ్మతులు చేపట్టకపోతే గ్రామంలోని 250 కుటుంబాలకు తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి, మౌలిక వసతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్, రాష్ట్ర కార్యదర్శి కారం రామన్న దొర, మండల కార్యదర్శి యలగాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## అధ్యాపకుల క్రమబద్ధీకరణకు రూ రెండు లక్షలు పై ఖండన

**కొత్తపేట, జూలై 22, (ప్రభాతవార్త)** అమరావతి నుంచి బుధవారం ఒక దినపత్రిక లోకాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమ బద్ధీకరణకు రూ 2 లక్షలు వసూలు చేస్తున్నట్లు వచ్చిన వార్తలను కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంట్రాక్ట్ అధ్యాపకులు తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు ఆ మేరకు చిక్కాల నరసింహం కేదాసి గంగాధర్ రావు గోగులమండ మాధురి కొండేపూడి సుజాత తో సహా సుమారు 20 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు ఖండించారు

## జ్ఞాపకశక్తిపై వాకర్స్ పరీక్షా పోటీలు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై22,ప్రభాతవార్త.** నరాల సంబంధిత రుగ్మతల గురించి ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పించడానికి మరియు మెదడు ఆరోగ్యాన్ని ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరం జూలై 22న ప్రపంచ మెదడు దినోత్సవాన్ని పాటిస్తారు. అమలాపురం మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు యర్రమిల్లి అనంతలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక గోఖలే వీధిలో జరిగిన సమావేశంలో వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ న్యూరాలజీచే స్థాపించబడిన ఈ ప్రాధాన్యతను రచయిత పుత్సా కృష్ణ కామేశ్వర్ సభ్యులకు తెలియజేశారు. మెదడు చురుగ్గా పనిచేసే విధంగా వెనుక నడక, లెక్కల పజిల్స్, జ్ఞాపకశక్తి పరీక్ష, కొత్త భాష నేర్చుకోవడం వంటి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో వేదనభట్ల సాయిలక్ష్మి మొదటి స్థానంలోనూ, శిష్టా లక్ష్మీదేవి ద్వితీయ స్థానంలోను, పేరి లలిత తృతీయ స్థానంలోను నిలిచారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గోటేటి లక్ష్మి, జోన్ చైర్పర్సన్ పుత్సా రాజేశ్వరి, గోటేటి గంగాధరరావు, శిష్టా శ్రీహరి పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్లు యధావిధిగా కొనసాగుతాయి. తాళ్లరేవు సబ్ రిజిస్ట్రార్ శారద.




**తాళ్ళరేవు, జూలై 22 (ప్రభాతవార్త):** దస్తావేజు లేఖర్ల పెన్ డౌన్ కార్యక్రమంతో ప్రజలు అసౌకర్యానికి గురి కావాల్సిన పనిలేదని రిజిస్ట్రేషన్లు యధావిధిగా కొనసాగుతాయని తాళ్లరేవు సబ్ రిజిస్ట్రార్ పంతగడ శారద అన్నారు. మే ఐ హెల్ప్ యా కౌంటర్ ద్వారా రిజిస్ట్రేషన్ దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పబ్లిక్ డేటా ఎంట్రీ విధానంలో కార్యాలయంలోనే డాక్యుమెంట్ రైటింగ్ చేస్తామని తెలిపారు. ప్రజలు నేరుగా తాళ్ళరేవు కార్యాలయంకు వచ్చి రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## బాధిత కుటుంబానికి టిడిపి నేతలు పరామర్శ..



**అంబాజీపేట,జూలై 22, (ప్రభాతవార్త ):** ఈ నెల 19న అల్లవరం మండలం ఓడలరేవు సముద్రంలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు మృతి చెందిన ఇరువురి యువకులు మంచాల సాయి సత్య భాస్కర్, మంచాల షణ్ముఖ శ్రీరామ్ ల కుటుంబ సభ్యులను టిడిపి నేతలు బుధవారం పరామర్శించారు. మండలంలోని మాచవరంలో మంచాల శేషు, మంచాల నాగబాబు,మంచాల ధర్మారావు లను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, కృషివల కోకోనట్ ఫార్మర్స్, ప్రొడ్యూసర్స్ కంపెనీ చైర్మన్ గణపతి వీరరాఘవులు, దొమ్మేటి వెంకట రామారావు, పొట్టుపోతు స్వామినాయుడు, పొట్టుపోతు సాయి, అడబాల వెంకట సూరి, అడబాల వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## ముద్రగడకు జడ్పిటిసి సాగర్ ఘన నివాళి.



**తాళ్ళరేవు, జూలై 22 (ప్రభాతవార్త):** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సుదీర్ఘ ప్రస్థానం కలిగిన సీనియర్ నాయకుడు, కాపు ఉద్యమ సారథి, వైకాపా నాయకులు ముద్రగడ పద్మనాభ మృతి పట్ల తాళ్లరేవు జడ్పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా కిర్లంపూడి లోని ముద్రగడ సమాధి వద్ద పుష్పగుచ్చం ఉంచి ఆయనకు ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన కుమారుడ్ని కలిసి సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట పలువురు వైకాపా నాయకులు ఉన్నారు.

## ఆర్థిక సహాయం అందించిన మంత్రి సుభాష్



**కె.గంగవరం, జులై 22(ప్రభావతవార్త):** కె.గంగవరం మండలం పామర్రు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త గాదె సత్యనారాయణ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి వాసంశెట్టి సుభాష్ కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం వారి కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సహాయ చెక్కును అందజేశారు.ప్రజల సుఖదుఃఖాల్లో భాగస్వామిగా ఉంటూ, అవసరమైన ప్రతి సందర్భంలో తన వంతు సహాయం అందిస్తానని తెలిపారు. తమ కష్ట సమయంలో అండగా నిలిచిన మంత్రికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, క్లస్టర్ ఇంచార్జ్ కంచుమర్తి బాబురావు, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా పెద్దాపురం నవోదయలో హ్యాండ్ బాల్ రీజినల్ పోటీల ప్రారంభం



**పెద్దాపురం జూలై 22(ప్రభాత వార్త ) ?**పెద్దాపురంలోని పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో బుధవారం హ్యాండ్ బాల్ రీజినల్ క్రీడా పోటీలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 24 వరకు జరిగే ఈ పోటీల ప్రారంభోత్సవానికి ఆదిత్య యూనివర్సిటీ ప్రో వైస్ ఛాన్సలర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. విద్యాలయ ప్రిన్సిపాల్ ఎస్. శరత్‌చంద్ర కీర్తి ఈ వివరాలను వెల్లడించారు. ?ఎన్సీసీ కేడెట్లు, బ్యాండ్ ట్రూప్‌లు ముఖ్య అతిథి సతీష్ రెడ్డికి ఘన స్వాగతం పలికాయి. వివిధ క్లస్టర్ల క్రీడాకారులు ఆకట్టుకునే రీతిలో మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం ముఖ్య అతిథి క్రీడాపతాకాన్ని ఆవిష్కరించి, క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ?ఈ సందర్భంగా సతీష్ రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులకు చదువుతో పాటు ఆటల్లో నైపుణ్యం ఉంటే జీవితంలో ఎంతో ఉన్నత స్థాయికి ఎదగవచ్చని పేర్కొన్నారు. అనంతరం అండర్-19 బాలికల (పోలవరం - పాలక్కాడ్), అండర్-17 బాలుర (కోలార్ - చిక్‌మంగళూరు) క్లస్టర్ల మధ్య జరిగిన మ్యాచ్‌లను ఆయన తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎన్సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ సనపల సత్యనారాయణ, ఉపాధ్యాయులు, పీఈటీలు, సిబ్బంది పాల్గొన్నారు.

## మండలంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాలు



**కె.గంగవరం, జులై 22(ప్రభావతవార్త):** కె. గంగవరం మండలం అద్దంపల్లి ,యర్రపోతవరం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ఏవో సద్గురుమూర్తి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వరి నాట్లు వేసి, పంట రుణం తీసుకొని రైతులందరూ తప్పనిసరిగా ఆగస్టు 15 నాటికి స్వయం ధ్రువీకరణ పంట పత్రం, పట్టాదారు జెరాక్స్ లేదా కౌలు కార్డు జెరాక్స్, బ్యాంకు పాస్ బుక్ జెరాక్స్, ఆధార్ జెరాక్స్ లతో దగ్గరలోని మీసేవా కేంద్రాల్లో పంట బీమా నమోదు చేసుకోవాలని దీనికి గాను ఒక ఎకరానికి 76 రూపాయలు నామమాత్రపు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించి తగు రసీదు పొందాలని కోరారు. అలాగే రైతులందరూ యొక్క ఉపయోగాన్ని గుర్తించి మేలైన దిగుబడులు పొందాలని కోరారు ఈ కార్యక్రమంలో ఏఈవో తేజ,స్థానిక రైతులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు 6లో

# వైభవంగా స్వామి వారి జన్మనక్షత్ర పూజలు....





సఖినేటిపల్లి జూలై 22, ప్రభాత వార్త: కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామంలో వేంచేసియున్న నవ నారసింహ క్షేత్రాలలో ఒకటైన స్వయంభూ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో స్వామి వారి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా స్వామి వారికి అష్టోత్తర శత కలశాభిషేకము వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్ ఆధ్వర్యంలో విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, నిర్వహించి, 108 కలశాలతో స్వామి వారి 108 అష్టోత్తర నామాలతో ఆవాహనం చేసి, కలశలకు పూజలు, ప్రధాన కలశను శిరస్సుపై ధరించి ఆలయ ప్రదక్షిణ చేసి ఆ 108 కలశలతో స్వామి వారికి పంచా మృతాలతో అభిషేకం చేసినారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమీషనర్ మోకా వెంకట నాగార్జున ప్రసాద్, అర్చక స్వాములు, పాల్గొన్నారు.

## చిన్నతనం నుంచి మంచి అలవాట్లు నేర్చుకోవాలి...ఎస్ఐ



మామిడికుదురు.జూలై 22(ప్రభాతవార్త) విద్యార్థులు చిన్నతనం నుంచే మంచి అలవాట్లను అలవార్చుకోవాలని నగరం ఎస్ఐ ఎ.చద్మారావు సూచించారు. మొగలికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో విద్యార్థుల భవిష్యత్తు, క్రమశిక్షణ మరియు చట్టాలపై అవగాహన కల్పించారు. చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు.డ్రగ్స్,గంజాయి వంటి వాటి జోలికి పోకుండా కష్టపడి చదువుకోవాలన్నారు. ఈవ్ టీజింగ్ కు ఎవరు పాల్పడినా ఉపేక్షించేది లేదన్నారు.గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పిస్తూ విద్యార్థినీలకు ఎటువంటి ఇబ్బంది వచ్చినా వెంటనే తల్లిదండ్రుల దృష్టికి తీసుకు వెళ్లాలన్నారు.

## అగ్ని ప్రమాద బాధితురాలిని ప్రభుత్వం ఆదుకోవాలి



మామిడికుదురు.జూలై 22(ప్రభాతవార్త) మామిడికుదురు చివారు గాలిదేవరపాలెంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితురాలు కాట్రేని పాడు మంగాదేవి ని ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్ఆర్ సీపీ రాజోలు నియోజకవర్గం కో-ఆర్డినేటర్ పాముల రాజేశ్వరీదేవి డిమాండ్ చేశారు.బుధవారం ఆమె బాధితురాలిని పరామర్శించి పార్టీ తరపున బియ్యం ఇస్తా అందించారు.ఆమె వెంట వైఎస్సీపీ రాష్ట్ర కార్యదర్శి కటకంశెట్టి ఆదిత్య,గ్రామశాఖ అధ్యక్షులు కంది శ్రీరామ్, పార్టీ నాయకులు కొల్లాబత్తుల మున్నా, జాలెం జాన్సన్,విప్పర్తి మహేష్ ఉన్నారు. ప్రభుత్వం తరపున తహశీల్దార్ సీఏస్ రాజు 20 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు బాధితురాలికి అందించారు.ఆర్ఐ ఇబ్రాహిం,వీఆర్ఓ త్రిమూర్తులు తహశీల్దార్ వెంట ఉన్నారు.

## బాడవ కాలువను పరిశీలించిన రైల్వే అధికారులు

## తవ్వకం పనులకు గ్రీన్ సిగ్నల్



గొల్లప్రోలు, జూలై 22,(ప్రభాతవార్త) గొల్లప్రోలు శివారు బాడవ కాలువ త్రవ్వకం పనులకు రైల్వే అధికారులు అంగీకరించారు. ఏదురొడ్డు నుండి నక్కలఖండి వరకు గల రైల్వే పరిధిలోని బాడవకాలువ కొన్ని దశాబ్దాలుగా కాలువలో పూడిక తీయక ఎదురొడ్డు,పిడుండొడ్డి పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయని అలాగే రైల్వే ట్రాక్ వరకు వరద నీరు చేరడంతో పాటు ఏలేరు నుండి అధికంగా నీరు విడుదల చేస్తే 216 జాతీయ రహదారిపై సైతం వరద నీరు ప్రవహిస్తుందని వివరిస్తూ బాడవకాలువ ప్రాధాన్యత గురించి ఇటీవల కాకినాడ జిల్లాకలెక్టర్ కు రైతులు ఫిర్యాదు చేశారు.రైతుల ఫిర్యాదు మేరకు బుధవారం రైల్వే అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చి బాడవ కాల్వను,పంట పొలాలను పరిశీలించారు. అనంతరం రైల్వే అధికారులు మాట్లాడుతూ తమ అధికారుల పర్యవేక్షణలో బాడవకాలువ త్రవ్వటకు ఏర్పాట్లు చేసుకోవాల్సిందిగా ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సామర్లకోట సిగ్నల్ ఎస్ ఎస్ ఇ చిరంజీవి, జనార్దన్ రావు సిగ్నల్, టెలి కమ్యూనికేషన్ ఈ ఎస్ ఎస్ నవీన్,ఇరిగేషన్ అధికారులు జనార్దన్ రావు, ప్రసన్న కుమార్,బాబూరావు,ఆర్థ్ మాజీ చైర్మన్ కొశిరెడ్డి రాజా, మొగలి రాంబాబు,గొల్లపల్లి చినకొండ,వీఆర్ఓ, బాబ్జి,లస్కర్ నానాజీ, పలువురు రైతులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రానికి ఫ్యాన్ వితరణ

## పలువురికి అన్నదానం



శంఖవరం, జూలై 22 ప్రభాతవార్త శంఖవరం మండలం కత్తిపూడి గ్రామానికి చెందిన ఇసరపు హరీష్ లత దంపతుల కుమారుడు మోక్ష పుట్టినరోజును పురస్కరించుకుని కుటుంబ సభ్యులు వినూత్నంగా, నలుగురికీ ఉపయోగపడేలా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి ఉచితంగా సీలింగ్ ఫ్యాన్‌ను బహుకరించారు. చిన్న పిల్లలు వేసవిలో తీవ్ర ఉక్కపోతతో ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ ఫ్యాన్‌ను అందజేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.?అనంతరం, సమాజంలోని నిరుపేదలు మరియు యాచకులకు ఆకలి తీర్చేలా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఫ్యాన్ అందజేసినందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు కుమారుడు మోక్ష కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ విధంగా సేవా కార్యక్రమాలు చేపట్టిన కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు ఈ శివ, య. శివదుర్గ, అంగన్‌వాడీ కార్యకర్త ఏ భాగ్యలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షలపై కాంగ్రెస్ వికృత చర్యలు

### బీజేపి రాష్ట్రకార్యవర్గ సభ్యులు పాలూరి



కొత్తపేట, జూలై 22, (ప్రభాతవార్త) నీట్ పరీక్షలపై వ్యతిరేక శక్తులతో కలిసి కాంగ్రెస్ వికృత చర్యలకు పాల్పడుతుందని బీజేపి రాష్ట్రకార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం విమర్శించారు విద్యార్థుల పరీక్ష పేపర్ లీకులపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని పాలూరి అన్నారు నీట్ పరీక్షలకు సంబంధించి అవకతవకలు జరిగినట్లు నివేదికలు అందిన వెంటనే తక్షణ చర్యలు తీసుకొని పేపర్ లీకుకు కారణమైన 13 మందిని అరెస్టు చేసి జైల్లో ఉంచడం జరిగిందని తెలిపారు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను రాజీనామా చేయమనడం హాస్యాస్పదమన్నారు విద్యార్థులు తమ భవిష్యత్తుకోసం చదువుల్లో నిమగ్నమై ఉంటే విద్యార్థుల ముసుగు వేసుకొని ధర్నాలలో పాల్గొంటున్నారని ఆరోపించారు

# ఏడువారాల వెంకన్నకు అష్టోత్తర పూజ, నిత్యకళ్యాణం..

- గోవిందుడి సేవలో తరించిన భక్తులు.
- నిత్యాన్న పథకానికి రూ50, వేలు విరాళం...



ఆత్రేయపురం, జూలై 22,(ప్రభాత వార్త) ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న కోనసీమ తిరుమల



వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం బుధవారం వేలాది మంది భక్తుల విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.ఏడు వారాల నోము పూర్తయిన భక్తులు అష్టోత్తర శతనామావళి నిత్య కళ్యాణం గోపూజ పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. అనంతరం విజయవాడకు చెందిన ఘంటసాల ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల విద్యార్థులు భక్తి గీతాలతో "గానామృతం" కార్యక్రమం. భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కాకినాడ చెందిన కాకి రవితేజ, ఉమామహేశ్వరి దంపతులు నిత్యాన్నదాన పథకానికి రూ. 50,000 /- వేలు విరాళంగా అందించారు. స్వామివారి దర్శనం అనంతరం వారికి ఆలయ అర్చకులు, వేద పండితులు,వేద ఆశీర్వచనం అందించగా. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు లు స్వామివారి చిత్రపటం ప్రసాదాలను అందజేశారు. వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు తగు ఏర్పాట్లు చేశారు

## విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించాలి



గోపాలపురం, జూలై 22 (ప్రభాతవార్త): విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించడంలో క్రీడా పోటీలు, క్రీడా మౌలిక వసతులు కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్ర ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కె. మహబూబ్ బాషా అన్నారు. గోపాలపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన పీడీలు, పీఈటీల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 10 వేలకుపైగా ఉన్నత పాఠశాలలు ఉన్నాయని, వాటిలో క్రీడల అభివృద్ధి, విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. పాఠశాలల క్రీడా కార్యక్రమాల అమలు, క్రీడా మౌలిక వసతుల పరిస్థితిని సమీక్షించేందుకు నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఉన్నత పాఠశాలకు క్రీడా సామగ్రి కొనుగోలు కోసం ఏటా రూ.25 వేల చొప్పున నిధులు అందజేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో క్రీడా మైదానాల అభివృద్ధికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నామని, గోపాలపురం నియోజకవర్గంలో ఏడు పాఠశాలలు ఈ పథకానికి ఎంపికయ్యాయని వెల్లడించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, జట్టు భావన, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. జూలై 15 నుంచి ఆగస్టు 25 వరకు అమరావతిలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో దశలవారీగా జరుగుతాయని, ప్రతిభ కనబరిచిన విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో షాప్ డైరెక్టర్ పేరం రవీంద్ర, జిల్లా నాయకుడు ఐ. రమేష్, గోపాలపురం నియోజకవర్గంలోని పీడీలు, పీఈటీలు పాల్గొని క్రీడల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

## ముంపుకు గురౌతున్న పంట పొలాల శాశ్వత పరిష్కారానికి కృషి

### ఎమ్మెల్యే, బండారు,జిల్లా కలెక్టర్, మహేష్ కుమార్.



ఆత్రేయపురం, జూలై,22, (ప్రభాత వార్త) రైతులు ప్రతి ఏటా మండలంలోని లొల్ల, వాడపల్లి, మెర్లపాలెం గ్రామాలలోని పంట పొలాలు ముంపు బారిన పడి చాల నష్ట పోతున్నారని వాటి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ లు తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్, జాయింట్ కలెక్టర్, నదియా కుమారి లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ ఈ మూడు గ్రామాల ముంపుకు గురవుతున్న పంట పొలాలకు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ ముంపు సమస్య పూర్తిగా పరిష్కారం అవ్వాలంటే ర్యాలి వద్ద ఒక సైఫాన్ నిర్మిస్తే ఇబ్బందులు తొలుగుతాయన్నారు. జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ శాశ్వత పరిష్కారానికి రైతులకు ఇబ్బందులు లేకుండా రెండు రోజులు ముక్తేశ్వరం కాలును కొంచెం తగ్గిస్తే ముంపుకు గురవుతున్న పంట పొలాల నుండి ముంపు నీరు దిగుతాదని అలాగే శాశ్వత పరిష్కారానికి సైఫాన్, పైప్ లైన్ కు ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించి ఆపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ ఈ, డ్రైన్స్ ఈఈ, జేఈ జయలక్ష్మి, జిల్లా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు, కాయల జగన్నాథం, ఆర్డీఓ ఎం వి వి సత్యనారాయణ, తహసీల్దార్ రాపాక రామచంద్రమూర్తి, ఏపుగంటి వెంకటేష్,అన్ని శాఖల అధికారులు, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, రైతులు పాల్గొన్నారు.

## శక్తియాప్ సద్విని చేసుకోవాలి : ఎస్పై శివకృష్ణ



ముమ్మిడివరం, జూలై 22(ప్రభాత వార్త ) విద్యార్థులంతా శక్తి యా ప్ పై అవగాహన పెంచుకుని అత్యవసర సమయాల్లో ఆపదల నుంచి రక్షణ పొందాలని, ప్రతి ఒక్కరూ విధిగా యాప్పు డౌన్లోడ్ చేసుకోవాలని ముమ్మిడివరం ఎస్పై బి శివకృష్ణ సూచించారు. బుధవారం స్థానిక శ్రీకృష్ణదేవరాయ మహిళ జూనియర్, డాక్టర్ రావు బహదూర్ రఘుపతి మహిళా డిగ్రీ కళాశాలల విద్యార్థినులకు మహిళల రక్షణ, గంజాయి నివారణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టోల్ ఫ్రీ నెంబర్లు గృహింస నివారణకు 181, అత్యవసర సేవలకు 112, మహిళా వేధింపులు, అక్రమ రవాణా నివారణకు 1091, పిల్లలపై లైంగిక వేధింపులకు సంబంధించి 1098, సైబర్ నేరాల కు సంబంధించి 1930 వివరించారు. సైబర్ నేరాలు జరిగే తీరు, మహిళా వేధింపులు, గంజాయి వంటి నేరాలు జరిగే తీరును సమగ్రంగా వివరించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఫ్రెండ్లీ పోలీసింగ్ ను ప్రోత్సహిస్తుందని, తమకు ఎదురయ్యే సమస్యలను పైన పేర్కొన్న నెంబర్లకు గాని, తన వ్యక్తిగత నెంబర్కు గాని మెసేజ్ చేస్తే సత్వర సహాయ చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ గణేశుల బ్రహ్మానందం, కానిస్టేబుల్ శేషు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పేకాట శిబిరం పై దాడి ఏడుగురు అరెస్ట్

### నగదు స్వాధీనం :ఎస్. ఐ. శివకృష్ణ

ముమ్మిడివరం జూలై 22(ప్రభాత వార్త ) ముమ్మిడివరం మండలం తానే లంక సమీపంలో పేకాట శిబిరంపై ముమ్మిడివరం పోలీసులు దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి పంతోమిది వేల ఆరు వందలు రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నారు. తానేలంకలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు ముమ్మిడివరం ఎస్పై బి శివకృష్ణ కు సమాచారం రావడంతో మంగళవారం రాత్రి ఆయన పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులు దంగేటి శ్రీనివాసరావు, గుత్తుల ప్రసాద్, గోదాశి నాగకృష్ణమూర్తి, మెండ శ్రీనివాస్, చప్పిడి సత్యనారాయణ, శేట్ విక్రమ్ కుడిపూడి హరికృష్ణ లను అదుపులోకి తీసుకున్నారు. మండలంలో ఎక్కడ పేకాట జూదం వంటి చట్ట విరుద్ధ కార్యక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పై శివకృష్ణ హెచ్చరించారు. కొత్తగా వచ్చిన ఎస్ఐ శివకృష్ణ అసాంఘిక కార్యకలాపాలు, అల్లరిమోకలపైన ఉక్కు పాదం మోపడంతో మండల ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తున్నారు

## మడికి-గాంధీనగరం రోడ్డుకు మహర్దశ

### రూ కోటి 29 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణం

### కొత్తపేట ఎమ్మెల్యే బండారు కృషి ఫలితం



ఆలమూరు, జూలై 22, (ప్రభాతవార్త) ఎన్నో దశాబ్దాలుగా సరైన రోడ్డు సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్న ఆలమూరు మండలం మడికి-గాంధీనగరం రోడ్డుకు మహర్దశ వచ్చింది. గత ఎన్నికల సమయంలో పక్కా రోడ్డు నిర్మిస్తామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు హామీ ఇచ్చారు. ఆ మేరకు నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఇందుకు నాబార్డు నిధులు నుండి రూ. కోటి 14 లక్షలు మంజూరు చేయించారు. మడికి నుంచి చిలకలపాడు వరకు 650 మీటర్లు పొడవునా 12.6 అడుగుల వెడల్పుతో సిమెంట్ రోడ్ నిర్మించారు. అయితే గాంధీనగరం నుండి చిలకలపాడు వెళ్లే ప్రధాన రహదారి 570 మీటర్లు 15 అడుగులకు నిర్మించాలని ఆ ప్రాంత ప్రజలు పట్టుబట్టారు. అలాగే టిడిపి, జనసేన నాయకులు కూడా 15 అడుగులే ఇక్కడ అవసరాలు దృష్ట్యా నిర్మించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన పనులు నిలిపేసి నిధులు వేట మొదలు పెట్టారు.మొత్తానికి ఉపాధి హామీ పథకం నుంచి మరో రూ.15 లక్షలు ఎమ్మెల్యే మంజూరు చేయించారు. మొత్తం రూ. కోటి 29 లక్షలతో 1,220 మీటర్ల పొడవున సిమెంట్ రోడ్ నిర్మాణం బుధవారంతో పూర్తయింది. ఈ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీడీవో, ఆ గ్రామ ప్రత్యేక అధికారి ఎ. రాజు, పంచాయతీ కార్యదర్శి వెంకటరత్నం, గ్రామ టిడిపి అధ్యక్షులు దొండపాడు సుబ్బరాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రీకాంత్ తదితరులు పరిశీలించారు.ఎన్నో ఏళ్ల కల నెరవేర్చిన ఎమ్మెల్యే బండారు కు మడికి, చిలకలపాడు,గాంధీనగరం గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి కృషి



రావులపాలెం, జూలై 22 (ప్రభాతవార్త) : గోపాలపురం అరుంధతీ పేటలో డ్రైనేజీ నీరు పొంగిపొర్లుతూ గృహ సముదాయాల మధ్య ప్రవహిస్తున్న నేపథ్యంలో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీధుల్లో నిల్వ ఉన్న మురుగునీటితో దుర్వాసన వ్యాపించడంతో పాటు ప్రజల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.ఈ సమస్యపై స్థానికుల ఫిర్యాదుల మేరకు రాష్ట్ర తెలుగురైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు అధికారి నాగేశ్వరరావు (నాగు) సోమవారం అరుంధతీ పేటను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. బాధిత కుటుంబాలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి స్థానిక సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆకుల రామకృష్ణ మాట్లాడుతూ, ప్రజలు మురుగునీటి మధ్య జీవనం సాగించడం బాధాకరమని, రోడ్డు, డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్థానికులు కూడా తమ సమస్యలను ప్రత్యక్షంగా వివరించి, త్వరితగతిన పరిష్కారం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## మహిళల ఆర్థిక సాధికారతకై

## 'మన డబ్బులు -- మన లెక్కలు" యాప్

### డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు



పెద్దాపురం జూలై 22 (ప్రభాత వార్త ) మహిళా సంఘాల పొదుపు లెక్కలను మరింత పారదర్శకంగా, సులభతరంగా నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన "మన డబ్బులు -- మన లెక్కలు" మొబైల్ యాప్ మహిళల ఆర్థిక సాధికారతకు ఎంతో దోహదపడుతుందని కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు అన్నారు. బుధవారం పెద్దాపురం పట్టణం లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో నిర్వహించిన "మన డబ్బులు -- మన లెక్కలు" అవగాహన ర్యాలీలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యులతో కలిసి ర్యాలీలో పాల్గొని ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన డిజిటల్ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తుమ్మల రామస్వామి బాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం మహిళల ఆర్థిక స్వావలంబనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. మహిళలు పొదుపు చేసే ప్రతి రూపాయి వివరాలు, సంఘాల లావాదేవీలు, ఖాతాల సమాచారం ఎప్పటికప్పుడు వారి చేతిలోనే ఉండేలా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ "మన డబ్బులు -- మన లెక్కలు" యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు.ఈ యాప్ ద్వారా మహిళలు తమ మొబైల్ ఫోన్‌లోనే పొదుపు ఖాతాల వివరాలు, రుణాల సమాచారం, నెలవారీ లావాదేవీలు, చెల్లింపులు, నిల్వలు వంటి వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఈ అవగాహన ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ సురేంద్ర శ్రీకాంత్ రెడ్డి, టిడిపి నాయకులు తూతిక రాజు, పెద్దాపురం జనసేన పార్టీ అధ్యక్షులు దొమ్మేటి శ్రీనివాస్(సరోజ్ వాసు ), పోలమరశెట్టి సత్తిబాబు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్,కంటే జగదీష్ మోహన్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్,పిట్టా జానకి రామారావు,బలుసు వాసు,అందుగుల జార్జి చక్రవర్తి,వల్లూరి దొరబాబు,తుమ్మల ప్రసాద్,అత్తిలి కృష్ణ,మడగల శ్యామ్ కుమార్,జల్లి సుధాకర్,కూటమి నాయకులు,అధికారులు, మున్సిపల్ ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియా జాగ్రత్తలు పాటించుకుంటే ఇబ్బందులు తప్పవు



పెద్దాపురం జూలై 22 (ప్రభాత వార్త ) సోషల్ మీడియా ( వాట్సాప్,ఫేస్బుక్) ఇతర మాధ్యామల ద్వారా తప్పుడు ప్రకటనలు తప్పుడు సమాచారంతో పోస్టింగులు పెడితే ఇబ్బందులు తప్పవని పెద్దాపురం సిఐ వై ఆర్ కె శ్రీనివాస్ హెచ్చరించారు. కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ఆదేశాల మేరకు పెద్దాపురం మండలంలోని సోషల్ మీడియా గ్రూప్ అడ్మిన్స్ తో బుధవారం సి ఐ వై ఆర్ కె శ్రీనివాస్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సి ఐ మాట్లాడుతూ సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టేటప్పుడు వాస్తవికతను గమనించి, నిజా నిజాలను తెలుసుకుని పెట్టవలసి ఉందన్నారు. సామాజిక బాధ్యతగా శాంతి భద్రత లకు భంగం కలిగించే, రెచ్చగొట్టే విధంగా ఇతరుల మనోభావాలను గాయ పరిచే పోస్ట్ లను పోస్ట్ చేయవద్దు అన్నారు. ఒకటికి పది సార్లు ఆలోచించి పోస్టులు పెట్టాలని, అభ్యంతర కర వ్యాఖ్యలు, అశ్లీలత,అసభ్య కరంగా మహిళలను, ఇతరులను కించపరిచే విధంగా, బాధ పెట్టే విధముగా , ఉండేటు వంటి పోస్టింగ్ల ను పెట్ట వద్దన్నారు. అలాగే వర్గ వైషమ్యాలను రెచ్చగొట్టే పోస్టింగ్లను పెట్టడం చేయవద్దని గ్రూప్ అడ్మిన్స్ తమ గ్రూపులో ఉన్న వారు ఎటువంటి అసత్య ,అసభ్య అభ్యంతరకర, రెచ్చగొట్టే పోస్టులను, పెట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, లేని విషయంలో వారే క్రిమినల్ చర్యలకు బాద్యులు అవుతారని సిఐ వై ఆర్ కే శ్రీనివాస్ హెచ్చరించారు. శాంతి భద్రతల విషయంలో పోలీసు వారికి సహకరించాలని సోషల్ మీడియా ప్రతినిధులను ఆయన కోరారు.

## మత్తుతో జీవితాలు చిత్తు



యు.కొత్తపల్లి (పిఠాపురం), జూలై 22 (ప్రభాతవార్త) : మత్తు పదార్థాలకు అలవాటు పడి బానిసలైతే వ్యక్తిగత జీవితాలతోపాటు కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయని పట్టణ ఎస్పై వి. మణికుమార్ అన్నారు. పట్టణం లోని చిన్నమాంబ పార్కులో బుధవారం గంజాయి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్తును సర్వనాశనం చేస్తాయన్నారు. అంతేకాకుండా కుటుంబాలు, సమాజాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. దురలవాట్లు విడనాడి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలు కలిగి ఉన్నా, అక్రమంగా రవాణా చేస్తున్నా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## చింతూరు ఐటీడిఏ పిజిఆర్ఎస్‌కు 56 ధరఖాస్తులు.



చింతూరు జూలై 22 ప్రభాత వార్త. చింతూరు ఐటీడీఏలో బుధవారం నిర్వహించిన పి జి ఆర్ ఎస్ కు 56 దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన అర్జీలను ఆన్లైన్ లో సంబంధిత శాఖ అధికారులకు పంపించడం జరుగుతుందని నిర్ణీత సమయంలో పరిష్కరించాలని చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శుభం నొక్వాల్ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ఏపీవో రామతులసి, నాలుగు మండల తాసిల్దార్లు, ఎంపీడీవోలు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## రెండేళ్లనమ్మకం అభివృద్ధి, సంక్షేమంపై ప్రతిఇంటికి తెలియాలి...

### ఎమ్మెల్యే ఆనందరావు.



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై22,ప్రభాతవార్త. కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా అమలాపురం నియోజకవర్గ వ్యాప్తంగా జూలై 27 నుండి ప్రారంభం కానున్న "2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం" ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రతి బుధవారం క్రమం తప్పకుండా నిర్వహించే క్యాడర్ క్యాలెండర్ సమావేశంలో భాగంగా, క్లస్టర్, యూనిట్,బూత్ ఇన్‌ఛార్జ్‌లతో ఈ భేటీ నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ఆనందరావు పాల్గొని,ప్రచార కార్యాచరణపై నాయకులకు, కార్యకర్తలకు సమగ్ర దిశానిర్దేశం చేశారు.ప్రతి బూత్ పరిధిలో ప్రతిరోజూ కనీసం 30 ఇళ్లను సందర్శించి,ప్రభుత్వం అం దించిన సంక్షేమ ఫలాలను, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ను ప్రజ లకు వివరించాలని సూచించారు. ప్రచారంలో భాగంగా కరపత్రాల పంపిణీతో పాటు, ప్రజల అభిప్రాయాలను సేకరించి, ప్రతి ఇంటి వద్ద తీసిన ఫోటోలను మైటీడీపీ యాప్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, డి సి ఎం ఎస్ అధ్యక్షులు పెచ్చెట్టి చంద్ర మౌళి, టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి పెచ్చెట్టి విజయలక్ష్మి పాల్గొన్నారు.

## కత్తిపూడిలో ముద్రగడకు ఘన నివాళి



శంఖవరం జూలై 22 ప్రభాతవార్త రాష్ట్ర రాజకీయాల్లో నాటికి, నేటికి నీతి, నిజాయితీ, నిబద్ధతలకు నిలువెత్తు నిదర్శనంగా ముద్రగడ పద్మనాభం నిలుస్తారని వైసీపీ నేతలు గౌతు వాసు, అడపా సోమేష్, గౌతు స్వామి పేర్కొన్నారు. శంఖవరం మండలంలోని కత్తిపూడిలో గల జెడి ఫంక్షన్ హాలులో ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభను నిర్వహించిన వైసీపీ నేతలు, ముద్రగడ అభిమానులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించిన అనంతరం ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ కొవ్వొత్తులను వెలిగించి అభిమానం చాటుకున్నారు. ఈ సందర్భంగా వైసిపి నేతలు వాసు, సోమేష్, స్వామి మాట్లాడుతూ ప్రజా సమస్యల పోరాటంలో తన పదవులను సైతం తృణప్రాయంగా వదిలిన ధీశాలి ముద్రగడ అన్నారు. ముక్కుసూటిగా మాట్లాడటం, తన దగ్గరకు వచ్చే వారిని చిన్న పెద్ద అనే బేధం లేకుండా ఆదరించి, అల్పాహారాన్ని స్వయంగా అందించడం ఆయన సామాన్య, సాధారణ జీవనశైలిని తేటతెల్లం చేస్తుందన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ముద్రగడ చేసిన అభివృద్ధి నేటికి ఫలాలను అందిస్తున్నాయని, అవే చిరస్థాయిగా నిలుస్తున్నాయని కొనియాడారు. అవినీతికి ఆమడ దూరంగా ఉంటూ తాను ఇచ్చిన మాటకు కట్టుబడి, ఎంత కష్టమైనా పనినైనా తనను నమ్మి వచ్చేవారికి అభయ హస్తమించిన రాజకీయ దురందరుడు ముద్రగడ పద్మనాభం అని కొనియాడారు. అనంతరం ముద్రగడ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపి, భగవంతుడు వారికి ధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు చల్లా సత్య ప్రసాద్, సప్పా రాంబాబు, జీలకర్ర విష్ణు, వైసీపీ నేతలు కూచిమంచి సూర్య ప్రకాష్, పెయ్యల రాజా, నూకరాజు, పద్మావతి, అధిక సంఖ్యలో వైసిపి శ్రేణులు, ముద్రగడ అభిమానులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ అమలాపురం ఆధ్వర్యంలో బాలికలకు మెన్స్ట్రువల్ హైజీన్ అవగాహన

### ఆశా వర్కర్లకు ఘన సన్మానం



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూలై 22,ప్రభాతవార్త రోటరీ క్లబ్ అమలాపురం ఆధ్వర్యంలో జూలై నెల సేవా కార్యక్ర మాలలో భాగంగా గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్, నల్లవంతెన అమలాపురంలో బాలికలకు మెన్స్ట్రువల్ హైజీన్ అవగాహన– ఆశా వర్కర్లకు ఘన సన్మానం జరిగింది.ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు డాక్టర్ నాగ మానస గారు ముఖ్య అతిథిగా హాజరై, బాలికలకు రుతుక్రమ పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం, పోషకాహారం, అపోహలు -- వాస్తవాలు, మానసిక ఆరోగ్యం తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ప్రతి బాలిక రుతుక్రమ సమయంలో పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని ఆమె వివరించారు.అనంతరం సమాజ ఆరోగ్య పరిరక్షణలో విశేష సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లను రోటరీ క్లబ్ అమలాపురం తరపున ఘనంగా సన్మానించి, వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షులు ఆర్.డి.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ, సమాజ ఆరోగ్యాభివృద్ధికి ఆశా వర్కర్లు చేస్తున్న సేవలు అమూల్యమైన వని, మహిళలు మరియు బాలికల ఆరోగ్య పరిరక్షణలో రోటరీ క్లబ్ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ గర్ల్స్ హై స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ ఆకుల రాము, ఆసక్తి శ్రీను, గవర్నమెంట్ గర్ల్స్ హై స్కూల్ హెచ్ఎం డి గౌరీ శంకర్,రోటరీ కోశాధికారి శశిధర్ రాం, రోటరీ సభ్యులు వాడ్రేవు శ్రీరాం, మూల రవితేజ,కర్రా బాబీ, వాడ్రేవు శ్రీవాణి మరియు ఇతర రోటరీ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.కార్యక్రమం ముగింపులో రోటరీ క్లబ్ కార్యదర్శి ఆర్‌టీఎన్. ఆకొండి పవన్ అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ, సమాజ సేవలో రోటరీ చేపట్టే కార్యక్రమాలకు ప్రజల సహకారం ఎల్లప్పుడూ అవసరమని పేర్కొన్నారు.

## ఈ కలయిక తెలుగు సినీ రంగ ప్రవేశానికి సంకేతమా..



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై 22, ప్రభాతవార్త. కాకినాడలోని జీఆర్‌టీ హోటల్లో ప్రముఖ తెలుగు సినీ నటుడు నందమూరి బాలకృష్ణను మిస్ ఫరెవర్ యూనివర్స్ ఇండియా 2025 విజేత, ప్రముఖ అనస్థీషియాలజిస్ట్, మెడికవర్ హాస్పిటల్స్ విశాఖపట్నం మెడికల్ సూపరింటెండెంట్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నేషనల్ డైరెక్టర్ డా. ఎం. సృజన దేవి మర్యాదపూర్వకంగా కలిశారు. వైద్య సేవలు, సామాజిక సేవ, నాయకత్వ లక్షణాలు, అందాల పోటీల్లో జాతీయ స్థాయి విజయాలతో ఇప్పటికే ప్రత్యేక గుర్తింపు పొందిన డా. సృజన దేవి ఈ భేటీతో మరోసారి వార్తల్లో నిలిచారు. సమావేశం లో సినీ రంగం,వ్యక్తిత్వ వికాసం, సామాజిక సేవ తదితర అంశాలపై స్నేహపూర్వకం గా చర్చ జరిగినట్లు తెలిసింది. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.దీంతో సినీ అభిమానుల్లో ఒకే మాట వినిపిస్తోంది..."డా. సృజన దేవి తెలుగు సినీ రంగంలోకి అడుగుపెట్టనున్నారా?"అయితే, దీనిపై ఇప్పటివరకు డా. సృజన దేవి గానీ, నటుడు నందమూరి బాలకృష్ణ గానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కాబట్టి సినీ రంగ ప్రవేశంపై ప్రస్తుతం అధికారిక ధృవీకరణ లేదు. అయితే ఈ భేటీ సినీ, వైద్య వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. వైద్యురాలిగా సేవలు, సామాజిక బాధ్యత, జాతీయ స్థాయి అందాల కిరీటం, ఐఎంఏ లో నాయకత్వ బాధ్యతలు... ఇప్పుడు సినీ ప్రముఖుడితో ప్రత్యేక భేటీ. ఈ కలయిక భవిష్యత్తులో కొత్త ప్రయాణానికి నాంది అవుతుందా? అనే ప్రశ్నకు కాలమే సమాధానం చెప్పాలి.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps